మంగళవారం
07-10-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 16
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఫ్రాన్స్ ప్రధాని రాజీనామా

పారిస్: ఫ్రాన్స్‌లో మరోసారి రాజకీయ సంక్షోభం తలెత్తింది. ఫ్రాన్స్ కొత్త ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే అధికారం నుంచి దిగిపోయారు. ఆయన నియమించిన కేబినెట్‌పై విమర్శలు రావడంతో రాజీనామా చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ ఈ రాజీనామాను ఆమోదించినట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. మక్రాన్‌కు అత్యంత సన్నిహితుడిగా సెబాస్టియన్‌కు పేరుంది. అసలేమైందంటే... సెబాస్టియన్ ఆదివారం కొత్త కేబినెట్‌ను ఏర్పాటు చేయగా కూర్పుపై రాజకీయంగా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా మాజీ ఆర్థిక మంత్రి బ్రూనో లీ మైయిరోను రక్షణ మంత్రిగా నియమించడం పట్ల తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

స్టాక్‌హోం: ఈ ఏడాది వైద్యరంగంలో ముగ్గురికి నోబెల్ బహుమతి ప్రకటించారు. మేరీ ఈ బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకాగుచి ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారు. శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ తన సొంత అవయవాలపై దాడి చేయకుండా ఎలా నిరోధించబడుతుందనే రహస్యాన్ని ఛేదించినందుకుగాను వీరికి ఈ పురస్కారం లభించింది. వీరి పరిశోధనలు పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్ అనే విధానంపై దృష్టి సారించాయి. దీని ద్వారా నియంత్రిత టీ కణాలు అని పిలిచే

- మిగతా 2 లో

పసిడి పరుగులు...

తులం రూ.1.23 లక్షలు

హైదరాబాద్: ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కారణంగా బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. సంపన్నులకే దడ పుట్టించేలా ప్రస్తుతం బంగారం రేట్లు పెరుగుతూ పోతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,23,420కి చేరింది. 22 క్యారెట్ల పసిడి ధర రూ. 1,10,700గా ఉంది. పసిడి ధరలు పెరగడానికి ట్రంప్ అధిక టారిఫ్‌లు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులకు తోడు అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ కూడా ఓ కారణంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో

- మిగతా 2 లో

గీతాంజలికి నోటీసు ఎందుకివ్వలేదు

న్యూఢిల్లీ: లద్దాఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. జాతీయ భద్రతా చట్టం కింద వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన భార్య గీతాంజలి జె.అంగ్మో వేసిన పిటిషన్‌పై విచారణను సోమవారం న్యాయస్థానం వాయిదా వేసింది. వచ్చే మంగళవారం విచారించ నుంది. అలాగే కేంద్రం, జమ్మూకశ్మీర్ యంత్రాంగానికి, రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తన భర్తను ఎన్ఎస్ఏ చట్టం కింద నిర్బంధించడానికి గల కారణాలపై ఆమెకు ముందస్తు నోటీసులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రెండు విడతల్లో బీహార్ ఎన్నికలు

- నవంబరు 6, 11న పోలింగ్...14న ఓట్ల లెక్కింపు
- షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల సంఘం
- ఏడు రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తెలిపింది. నవంబరు 6, 11 తేదీల్లో పోలింగ్ జరగనుండగా 14న ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సోమవారం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి... ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నోటిఫికేషన్, నామినేషన్లు, పోలింగ్ తేదీలు తదితర వివరాలను వెల్లడించారు. "బీహార్ ఎన్నికలు రెండు విడతల్లో జరుగుతాయి. తొలి విడత ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ఈ నెల 10న, రెండో దశ ఎన్నికల నోటిఫికేషన్ 13వ తేదీన రానుంది. తొలి విడత ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ ఈనెల 17 కాగా, రెండో దశ ఎన్నికల నామినేషన్లకు చివరి తేదీ ఈ నెల 20. నామినేషన్ల పరిశీలన 18, 21 తేదీల్లో జరుగుతాయి. నామినేషన్ల ఉపసంహరణకు తొలి విడతకు చివరి తేదీ 20 అక్టోబర్, రెండో విడతకు 23 అక్టోబర్. తొలి విడత ఎన్నికలు నవంబర్ 6న గురువారం జరగనుండగా, రెండో విడత 11 నవంబర్ మంగళవారం జరుగుతాయి. లెక్కింపు నవంబర్ 14న ఉంటుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియ నవంబర్ 16 వరకు ముగుస్తుంది" అని జ్ఞానేశ్ కుమార్ వివరించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి 17 నూతన సంస్కరణలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వినియోగిస్తున్నామని, 250 పోలింగ్ స్టేషన్ల పరిధిలో అశ్వికదళాలతో గస్తీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం మొత్తం 90,712 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ కేటాయించామని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌క్యాస్టింగ్ చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 10న తొలి విడత నోటిఫికేషన్, 13న రెండో విడత నోటిఫికేషన్ వెలువడుతుందని చెప్పారు. కాగా 7 రాష్ట్రాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉపఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు.

ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు స్వీకరిస్తాం...

బీహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై జ్ఞానేశ్ కుమార్ స్పందించారు "ఎస్ఐఆర్ ముసాయిదాను ఆగస్టు ఒకటిన విడుదల చేశాం. దానిని అన్ని రాజకీయ పార్టీలకు అందజేశాం. అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేసే అవకాశం ఇచ్చాం. తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించాం. ఇప్పటికీ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం" అని తెలిపారు.

8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు

ఏడు రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్‌లోని అంతా, జార్ఖండ్‌లోని ఘట్‌శిలా, తెలంగాణలోని జూబ్లీహిల్స్, పంజాబ్‌లోని తర్న్‌తారన్, మిజోరంలోని దంపా, ఒడిశాలోని నౌపాదాతోపాటు జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోని బద్గామ్, నగ్రోటా స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయని జ్ఞానేశ్‌కుమార్ పేర్కొన్నారు.

బీహార్‌లో 243 అసెంబ్లీ స్థానాలు... 7.42 కోట్ల మంది ఓటర్లు

బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. అందులో ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు- 38, ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు- 2 ఉన్నాయి. మొత్తంగా 7.42 కోట్ల మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 3.92 కోట్లు, మహిళా ఓటర్లు 3.50 కోట్లు ఉన్నారు. బీహార్ అసెంబ్లీ గడువు నవంబర్ 22లోపు ముగియనుంది. ఆ లోపే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు ఈసీ ఇంతకుముందు తెలిపింది. ప్రస్తుతం బీహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో జేడీయూ, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ, రెండేళ్లకే నితీశ్ ఎన్డీయేను వీడి ఆర్జేడీ, కాంగ్రెస్‌తో కూడిన మహాగట్బంధన్‌లో చేరి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ బంధం కూడా ఎంతోకాలం కొనసాగలేదు. 2024 జనవరిలో మహాఘట్బంధన్‌ను వీడిన జేడీయూ...మళ్లీ ఎన్డీయేతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. దీంతో మరోసారి నితీశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అయితే, ఈ సారి ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా ఐక్యసంఘటన మధ్య ప్రధానంగా పోటీ ఉండనుంది. కాగా, బీహార్‌లోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రకటించింది.

నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

విశాలాంధ్ర - హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. నవంబరు 11న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడించింది. 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నెల 13న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్లకు తుది గడువు 21. నామినేషన్ల పరిశీలన 22. ఉపసంహరణకు గడువు 24. పోలింగ్ నవంబరు 11, ఓట్ల లెక్కింపు అదే నెల 14వ తేదీన జరుగుతందని ఎన్నికల షెడ్యూల్‌లో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, సీపీ సజ్జనార్ సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.



విద్వేష విషం

సీజేఐపై షూతో దాడికి న్యాయవాది యత్నం

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టులో సోమవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి ప్రయత్నించాడు. అది గమనించిన తోటి లాయర్లు... అతన్ని నిలువరించి పోలీసులకు అప్పగించారు. ఖజురహో ఆలయ సముదాయంలోని జవారీ ఆలయంలో ధ్వంసమైన విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ గవాయ్ కొట్టేశారు. తీర్పు సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలపై ఓ వర్గం నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ తరుణంలో ఇవాళ ఓ కేసు విచారణ జరుగుతున్న సమయంలో న్యాయవాది ఒకరు ఆయనపైకి షూ విసిరే ప్రయత్నం చేశాడు. అయితే అది సీజేఐ బెంచ్ దాకా వెళ్లకుండా కింద పడిపోయింది. ఆ సమయంలో 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే దేశం సహించబోదు' అంటూ నినాదం చేశాడు. తోటి లాయర్లు అతన్ని అడ్డుకుని... కోర్టు సిబ్బందికి అప్పగించారు. ఈ పరిణామం నుంచి వెంటనే తేరుకున్న జస్టిస్ బీఆర్ గవాయ్.. 'ఇలాంటి చర్యలు తననేం చేయబోవని, వాదనలు కొనసాగించాలి' అని కేసు వాదిస్తున్న న్యాయవాదులకు సూచించారు. దాడికి పాల్పడిన న్యాయవాది పేరు కిషోర్ దాస్‌గా తెలుస్తోంది. ప్రస్తుతం అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు... దాడికి గల కారణాలపై విచారణ జరుపుతున్నారు. కాగా, సీజేఐ బీఆర్ గవాయ్‌పై షూ విసిరేందుకు యత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ని బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సస్పెండ్ చేసింది.

భారత్‌కు చీకటి దినం

సీజేఐ గవాయ్‌పై బూటు దాడి ఘటన... మండిపడిన విపక్షాలు 8 లో

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి ఊరట

పిటీషన్‌ను కొట్టేసిన సుప్రీం ధర్మాసనం

విశాలాంధ్ర - హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులో కూడా పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టులో కేసు విచారణలో ఉండగా సుప్రీంకోర్టుకి ఎందుకు వచ్చారు అని ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా అని అడిగింది. రాష్ట్ర హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఈ పిటీషన్‌ను విచారించలేమని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం కొట్టివేసింది. కాగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవో 9 సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వంగ గోపాల్ రెడ్డి పిటీషన్ దాఖలు చేశారు. విచారణకు స్వయంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు.

42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం: భట్టి

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కావాలనే కొంతమంది రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కోర్టులను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. త్వరలోనే వీటన్నింటినీ అధిగమించి ఎన్నికలు జరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్ల పై జరిగిన విచారణకు దిల్లీ వెళ్లిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి భట్టి మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్ల కల్పన కోసం హైకోర్టు, సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం అభిషేక్ మనుసింఘ్వితో వాదనలు వినిపిస్తామన్నారు. బీసీ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు

- మిగతా 2 లో

ఫార్మా హబ్ హైదరాబాద్

- అమెరికా కంపెనీ రూ.9 వేల కోట్ల పెట్టుబడి
- ఔషధాల తయారీలో అపార అనుభవం
- 40 శాతం బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి ఇక్కడి నుంచే
- జీనోమ్ వ్యాలీకి సాంకేతిక సహకారం: సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రపంచంలో పేరొందిన అమెరికాకు చెందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎల్ లిల్లీ ... తమ ఉత్పత్తి యూనిట్ ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఒక బిలియన్ డాలర్లు (సుమారు రూ.9,000 కోట్లు) పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో సోమవారం కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. అనంతరం తెలంగాణలో పెట్టుబడులకు సంబంధించి కంపెనీ కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీటిలెనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్మెంట్ నిపుణులు, ఇంజినీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎల్ లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎల్ లిల్లీ కంపెనీ కార్యకలాపాలు సాగిస్తోంది. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్టులో గ్లోబల్ కెపాబులిటీ కేంద్రాన్ని ప్రారంభించింది. విస్తరణలో భాగంగా ఎల్ లిల్లీ కంపెనీ భారీ పెట్టుబడులతో ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని రేవంత్ రెడ్డి అన్నారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మా హబ్‌గా పేరొందిందని చెప్పారు. 1965లో ఇందిరాగాంధీ ఐడీపీఎల్

- మిగతా 2 లో

భారత నౌకాదళ అమ్ములపొదిలో

మరో అస్త్రం

విశాఖ సాగర జలాల్లోకి 'ఐఎన్ఎస్ అండ్రోత్'

2లో

న్యాయ వ్యవస్థను బెదిరించడమే...

సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది బూటు విసరడం దారుణమని, ఇది న్యాయ వ్యవస్థను బెదిరించడమేనని సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇది ఒక వ్యక్తి తప్పుదు

- మిగతా 2 లో

నకిలీ మద్యం లీలలు

- ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు
- ఇబ్రహీంపట్నంలో భారీగా స్పిరిట్, ఖాళీ సీసాలు బట్టబయలు
- జనార్ధనరావు గోడౌన్‌గా గుర్తింపు?
- అన్నమయ్య జిల్లాలోనూ దాడులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నకిలీ మద్యం తయారీపై ఎక్సైజ్ పోలీసులు డేగ కన్నువేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఒక బార్ దగ్గర గల గోడౌన్‌లో నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్, ఖాళీ మద్యం సీసాలు బయటపడ్డాయి. ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో నాసిరకం మద్యం తయారీకి వాడిన స్పిరిట్ విక్రయించిన వారిపై ఎక్సైజ్ అధికారులు దృష్టి పెట్టారు. రెక్టిఫైడ్ స్పిరిట్ (ఆర్ఎస్), ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ) మిశ్రమం చేసి తయారు చేసిన నకిలీ మద్యాన్ని గుర్తించారు. తయారు చేయడానికి అవసరమైన వందలాది ఖాళీ

- మిగతా 2 లో

మత్స్యకారులు టెర్రరిస్టులా?

- ఆందోళనకారులను కలువకూడదా?
- పోలీసుల అత్యుత్సాహంపై రామకృష్ణ ఆగ్రహం

విశాలాంధ్ర-పాయకరావుపేట/ నక్కపల్లి: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నియోజకవర్గంలో పోలీసులు చేస్తున్న అతిని గవర్నర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో నిర్మించతలపెట్టిన బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మత్స్యకారులు, స్థానికులు చేస్తున్న ఆందోళన ప్రదేశానికి వెళ్లేందుకు రామకృష్ణ ప్రయత్నించగా... ఉపమాక చెరువు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై రామకృష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 24 రోజులుగా

- మిగతా 2 లో

గవాయ్‌పై దాడిని ఖండిస్తున్నాం: శైలజానాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సనాతన ధర్మం ముసుగులో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఖండించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా దళితులను చిన్నచూపు చూస్తూనే ఉన్నారని, ఉన్నత స్థానంలో ఉంటే ఇప్పటికీ కొందరు చూసి ఓర్చలేకపోతున్నారని మండిపడ్డారు. సనాతన ధర్మం ముసుగులో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ మీద కోర్టు హాలులో ఒక న్యాయవాది బూటు విసరడానికి ప్రయత్నించడాన్ని తీవ్రంగా పరిగణించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి ఊరట

(మొదటిపేజీ తరువాయి)
అంగీకరిస్తుందని తమకు నమ్మకం ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించామని పొన్నం అన్నారు.సబ్ కమిటీ ద్వారా సమీక్షించి క్యాబినెట్ అనుమతి తీసుకొని దాన్ని అసెంబ్లీలో పెట్టి అన్ని రాజకీయాల పార్టీల ఏకగ్రీవ నిర్ణయంతో చట్టాన్ని గవర్నర్‌కు పంపించామని తెలిపారు. గవర్నర్ రాష్ట్రపతికి పంపించారన్నారు. అయితే దీనిపై కొంతమంది కోర్టుకు వెళ్ళారని మండిపడ్డారు. రాష్ట్ర హైకోర్టులో వాదనలు జరిగాయని.. ఎన్నికల నోటిఫికేషన్‌కు వెళ్లొచ్చని చెప్పారని మంత్రి వెల్లడించారు.

సుప్రీం తీర్పుపై టీపీసీసీ అధ్యక్షుడు హర్షం

బీసీ రిజర్వేషన్ల పిటిషన్‌కు కొట్టివేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ... సుప్రీం తీర్పు శుభ పరిణామమన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీం కోర్టులో వేసిన పిటీషన్‌ను కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం మూడు చట్టాలు, ఒక ఆర్డినెన్స్, ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసిందని వివరించారు. ఈ నెల 8వ తేదీన హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

ఫార్మా హబ్ హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)
తీసుకువచ్చినప్పటి నుంచి ఫార్మా రంగం విస్తరించిందని అన్నారు. పేరొందిన దిగ్గజ ఫార్మా కంపెనీల్లో 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని అన్నారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. ఎల్ లిల్లీ కంపెనీ విస్తరణ... రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ వేగవంతమైన వృద్ధి సాధిస్తోందని చెప్పారు. ఎల్ లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటిపేజీ తరువాయి)
ప్రత్యేక రోగనిరోధక కణాలు ఆటోఇమ్యూన్ వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించే సంరక్షకులుగా ఎలా పనిచేస్తాయో వారు ప్రపంచానికి తెలిపారు. రోగ నిరోధక వ్యవస్థ శరీర కణాలపై దాడి చేయకుండా అడ్డుకునేందుకు ఉన్న పెరిఫెరల్ ఇమ్యూన్ టాలరెన్స్ వ్యవస్థను గుర్తించినందుకు ఈ అవార్డు ఇస్తున్నట్లు నోబెల్ అవార్డు కమిటీ ప్రకటించింది. రోగ నిరోధక వ్యవస్థ కాపలాదారుగా వ్యవహరించే టీ-సెల్స్‌లో కొన్ని అతిగా ప్రవర్తించకుండా నియంత్రిస్తున్నట్లు వీరు గుర్తించారు. శరీరంపై దాడి చేసే సూక్ష్మజీవులు అడ్డుకునేందుకు రోగ నిరోధక వ్యవస్థ కొన్ని కణాలను విడుదల చేస్తూంటుంది. టీ-సెల్స్ కూడా వీటిల్లో ఒకటి. అయితే కొన్ని ప్రత్యేకమైన టీ-సెల్స్ ఇతర రోగ నిరోధక వ్యవస్థ కణాలను నియంత్రిస్తూ... అవసరానికి మించి స్పందించకుండా చేస్తాయి. నోబెల్ విజేతలకు ఇచ్చే మొత్తం నగదు బహుమతి 11 మిలియన్ స్వీడిష్ క్రోనోర్. భారతీయ కరెన్సీలో ఇది సుమారు రూ.10 కోట్లు. విజేతలు ముగ్గురు ఈ 11 మిలియన్ క్రోనోర్‌ను సమానంగా పంచుకుంటారు. నగదుతో పాటు నోబెల్ ఫౌండేషన్ తయారు చేసిన ఆల్ఫ్రెడ్ నోబెల్ చిత్రంతో కూడిన 18 క్యారెట్ల బంగారు పతకం లభిస్తుంది.

పసిడి పరుగులు...

(మొదటిపేజీ తరువాయి)
పసిడి ధర ఔన్సు 3,935 డాలర్లుగా నమోదైంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. దీపావళి నాటికి బంగారం ధర 10 గ్రాములు రూ.1.25 లక్షలకు చేరుకుంటుందని అంచనా. మరోవైపు వెండి ధర కూడా బంగారంతో పోటీపడి మరీ పెరిగిపోతోంది. కిలో వెండి ధర రూ.లక్షన్నర దాటింది. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.54 లక్షలుగా ఉందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

గీతాంజలికి నోటీసు ఎందుకివ్వలేదు

(మొదటిపేజీ తరువాయి)
ఎందుకు ఇవ్వలేదని కేంద్రాన్ని కోర్టు ప్రశ్నించింది. వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రత చట్టం(ఎన్ఎస్ఏ) కింద అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్న ఆయన భార్య గీతాంజలి... ఆయనను తక్షణమే విడుదల చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ లేకుండానే రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలులో నిర్బంధించిన తన భర్తను సర్వోన్నత న్యాయస్థానం ఎదుట హాజరుపరచాలని ఆమె కోరారు. వాంగ్‌చుక్‌తో నేరుగా లేదా టెలిఫోన్ ద్వారా మాట్లాడటానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 'సెప్టెంబరు 26న అరెస్టు చేసినప్పటినుంచి ఇంతవరకు నా భర్తతో మాట్లాడనివ్వట్లేదు. కలవనివ్వట్లేదు' అని ఆమె ఆరోపించారు. ఉద్యమస్ఫూర్తిని దెబ్బతీసేందుకు కొంతకాలంగా కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఆయనకు పాకిస్థాన్‌తో ఎలాంటి సంబంధాలు లేవన్నారు. ఆయన అరెస్టుకు గల కారణాలు తెలియజేయాలన్నారు. అంతకుముందు తన భర్తను విడుదల చేయాలంటూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితరులకు గీతాంజలి లేఖ రాసిన సంగతి తెలిసిందే.

ఎవరెస్ట్‌పై హిమపాతం

- పెద్దసంఖ్యలో చిక్కుకుపోయిన పర్వతారోహకులు
- కొనసాగుతున్న సహాయ చర్యలు

ఖాట్మండు/బీజింగ్: ప్రపంచంలోనే అతిపెద్ద పర్వతం మౌంట్ ఎవరెస్ట్‌పై మంచు తుపాను బీభత్సం సృష్టించింది. 4,900 మీటర్ల ఎత్తులో పెద్ద సంఖ్యలో పర్వతారోహకులు మంచు శిఖరంపై చిక్కుకుపోయారు. వీరిని రక్షించేందుకు స్థానికులతో కలిసి సహాయ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ఎవరెస్ట్ శిఖరం మూలన ఉన్న టిబెటన్ పర్వతాలపై సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తూర్పు వైపున ఉన్న కొండలపై మంచు తుపాను కారణంగా మొదట దాదాపు 1,000 మంది వరకు శిబిరాల్లో చిక్కుకు న్నట్లు చైనా ప్రభుత్వ మీడియా తెలిపింది. 4,900 మీటర్లు (16,000 అడుగులు) కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ఈ ప్రాంతానికి చేరుకునే మార్గంలో మంచు పేరుకు పోయింది. దాన్ని తొలగించడానికి వందల మంది స్థానికులతోపాటు, సహాయ బృందాలు మోహరించాయి. దాదాపు 350 మందిని రక్షించి, కుడాంగ్‌లోని చిన్న పట్టణానికి సురక్షితంగా తరలించారని స్థానిక మీడియా పేర్కొన్నట్టు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ప్రస్తుతం ఇంకా అక్కడ దాదాపు 200మంది శిబిరాల్లోనే ఉన్నారని, వారిని రక్షించేందుకు ప్రయ త్నాలు జరుగుతున్నాయని చైనా ప్రభుత్వ మీడియా వెల్లడించింది. శుక్రవారం సాయంత్రం మొదలైన హిమపాతం టిబెట్‌లోని ఎవరెస్ట్ పర్వతం తూర్పు కొండలలో తీవ్ర రూపందాల్చింది. "ఈ హిమపాతం చాలా తడిగా, చల్లగా ఉంది. హైపోథెర్మియా (అల్పోష్ణస్థితి) నిజంగా ప్రమాదకరం" అని కుడాంగ్‌కు చేరుకున్న ట్రెక్కింగ్ బృందంలో ఒకరైన చెన్ గెషు వాంగ్ రాయిటర్స్‌తో అన్నారు. "ఈ సంవత్సరం వాతావరణం ఎప్పటిలాగా లేదు. అక్టోబర్‌లో ఎప్పుడూ ఇలాంటి వాతావరణం చూడలేదని గైడ్ చెప్పారు. ఇది అకస్మాత్తుగా జరిగింది" అని చెన్ అన్నారు. భారీ మంచు కారణంగా టెంట్లు కూలిపోయాయని, కొంతమంది హైకర్లు అప్పటికే హైపోథెర్మియాతో బాధపడుతున్నా రని టిబెట్‌లోని బ్లూ స్కై సహాయ బృందానికి సాయం కోసం పిలుపు అందిందని చైనా ప్రభుత్వ మీడియా పేర్కొంది. టింగ్రి కౌంటీ టూరిజం కంపెనీ శనివారం నుంచి ఎవరెస్ట్ సీనిక్ ఏరియాకు టికెట్ల అమ్మకాలు, ప్రవేశాన్ని నిలిపివేసిందని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. ఈ ప్రాంతం ప్రస్తుతం తీవ్రమైన భిన్న వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. పక్కనే ఉన్న నేపాల్‌లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆకస్మిక వరదలు సంభవించాయి. దీంతో వంతెనలు కొట్టుకు పోయి, గత రెండు రోజులలో సుమారు 47 మంది ప్రాణాలు కోల్పోయారు. మరోపక్క చైనాలో మాట్మో తుపాను తీరాన్ని తాకింది. దీంతో దాదాపు 1,50,000 మంది ప్రజలు తమ ఇళ్లు వదిలి వెళ్లాల్సి వచ్చింది. ఎవరెస్ట్ ప్రపంచంలోనే ఎత్తైన శిఖరం. ఇది 8,849 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉంది. ఏటా చాలామంది దీన్ని ఎక్కడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ, దీన్ని అధిరోహించడం ప్రమాదకరంగానే పరిగణిస్తున్నారు.

శాంతి ప్రణాళికపై నిర్ణయానికి రాకుంటే... రక్తపాతమే

ఇజ్రాయిల్-హమాస్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: గజా శాంతి ప్రణాళిక విషయంలో ఇజ్రాయిల్- హమాస్ ఒక నిర్ణయానికి రావాలని... లేని పక్షంలో భారీ రక్తపాతం చవిచూడాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టిగా హెచ్చరించారు. ఈజిప్టు వేదికగా రెండు దేశాల మధ్య కీలక చర్చలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ ఈమేరకు హెచ్చరించారు. 'శతాబ్దాల నాటి ఈ సంఘర్షణను నేను నిశితంగా గమనిస్తున్నానే ఉన్నాను. సమయం చాలా విలువైంది. గాజా శాంతి ప్రణాళికపై ఇజ్రాయిల్, హమాస్ త్వరగా ముందుకు సాగాలి. అలా చేయడంలో విఫలమైతే భారీ రక్తపాతం జరుగుతుంది' అంటూ 'ట్రూత్'లో పోస్టు పెట్టారు. హమాస్‌తో పాటు ఇతర అరబ్, ముస్లిం దేశాలతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని, బందీల విడుదల, గాజాలో యుద్ధం ముగింపు వంటి అంశాలపై సానుకూల వాతావరణం నెలకొందని ఈ సందర్భంగా ట్రంప్ తెలిపారు. సోమవారం ఈజిప్టు వేదికగా తుది చర్చలు జరగనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు తొలి దశలో భాగంగా గజాలోని బలగాల ఉపసంహరణకు ఇజ్రాయిల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని హమాస్‌కు కూడా పంపించినట్లు వెల్లడించారు. హమాస్ నుంచి ఆమోదం లభించిన వెంటనే గాజాలో కాల్పుల విరమణ అమలులోకి వస్తుందని, ఇజ్రాయిల్ బందీలు, పలస్తీనా బందీల మార్పిడి ప్రారంభమవుతుందని ట్రంప్ తెలిపారు.

కులగణనతోనే పేదల అభ్యున్నతి

సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విశాఖ: సమాజంలో అత్యంత వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం కులగణన చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగణనలో కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ విశాఖలో సోమవారం నిర్వహించిన బీసీ సంఘాలు-రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కుల గణన కోసం క్షేత్రస్థాయి నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అవసరమైతే చలో అమరావతికి సిద్ధం కావాలన్నారు. తెలంగాణలో కులగణన నిర్వహించి... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. కర్నాటకలో కూడా కులగణన స్వల్ప వ్యవధిలో పూర్తి చేశారని చెప్పారు. కులగణన జరిగితే కులాల వారీగా జనాభా, సామాజిక స్థితిగతులు తెలుస్తాయని... తద్వారా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో 143 బీసీ కులాలు ఉంటే పది పన్నెండు కులాలకు చెందిన వారు మాత్రమే అభివృద్ధి చెందగా... మిగిలిన కులాలవారు ఇంకా వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఆ కులాల నుండి ఒక్కరు కూడా ఎమ్మెల్యే లేదా ఎంపీగా లేరని తెలిపారు. ఎస్సీల వర్గీకరణ వల్ల ఇటీవల జరిగిన డీఎస్సీలో మాదిగలు కూడా ఉద్యోగాలు పొందారని చెప్పారు. ధనికుల దయపై పేదలు బతకాలా? అని రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బంగారు కుటుంబాల పథకంపై మాట్లాడుతూ పేద కుటుంబాలను ధనికులకు దత్తత తీసుకోవాలని కోరడాన్ని తప్పుబట్టారు. ధనికుల వద్దే ఎక్కువ బంగారం ఉంటుందని, ఏమీలేని పేద కుటుంబాలకు మాత్రం బంగారు కుటుంబాలు అంటూ పేరు పెట్టారని విమర్శించారు. ఇటీవల బయటకు వచ్చిన సంపన్నుల జాబితాలో ఎస్సీ, ఎస్టీలు ఒక్కరైనా ఉన్నారా? అని ప్రశ్నించారు. కుల గణన ద్వారా ఏ కులాల్లో ఎక్కువమంది ధనవంతులు ఉన్నారన్నది తెలుస్తుందన్నారు. పేదలను మభ్య పెట్టేందుకు బంగారు కుటుంబాల పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. ధనికుల దయతోనే చదువుకోవాలా?, వారి దయతోనే ఉద్యోగం చేయాలా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ అన్ని రంగాలూ ప్రైవేటు రంగం చేతుల్లోకి వెళ్తున్నాయన్నారు. ప్రాథమిక విద్య నుండి యూనివర్సిటీ విద్య వరకు ప్రైవేటు రంగం ఆధిపత్యం నెలకొందని చెప్పారు. ప్రభుత్వ రంగంలో నడుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ని పక్కకు నెట్టి ప్రైవేటు రంగంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ని తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగం లేకపోతే రిజర్వేషన్లు ఉన్నా ఉపయోగం ఏమిటన్నారు. అందువల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ లు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షోపన్యాసం చేస్తూ రాష్ట్రంలో కులగణన జరిగిన తరువాత బీసీల జనాభాను బట్టి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ నిర్ణయించాలన్నారు. కులగణన చేపడతామని ఎన్నికల ముందు చెప్పిన బీజేపీ...అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చి బీసీల మధ్య ఐక్యత దెబ్బతినే అవకాశం ఉందంటూ కులగణనను పక్కన పెట్టే కుట్ర చేస్తోందన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన గురించి మాట్లాడకపోవడం విచారకరమన్నారు. 1931లో బ్రిటిష్ పాలకులు కులగణన నిర్వహించారని, స్వాతంత్రం వచ్చిన తరువాత మన దేశ నాయకులు కుల గణనను పక్కన పెట్టారని విమర్శించారు.

భారత నౌకాదళ అమ్ములపొదిలో మరో అస్త్రం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: భారత నౌకాదళం అమ్ములపొదిలోకి మరో బ్రహ్మాండమైన అస్త్రం వచ్చి చేరింది. మన సముద్ర జలాల్లోకి చొరబడే శత్రుదేశాల జలాంతర్గాముల (సబ్ మెరైన్‌లను) ఉనికిని పసిగట్టే ఈ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ అండ్రోత్' సాగర జలాల్లోకి ప్రవేశించింది. ఇప్పటికే ఈ శ్రేణిలో ఐఎన్ఎస్ ఆర్నాలా సేవలు అందిస్తుండగా... దానికి తోడుగా ఐఎన్ఎస్ ఆండ్రోత్ వచ్చి చేరింది. దీంతో భారత నౌకా దళ.. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాలు గణనీయంగా పెరుగుతాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు యుద్ధ నౌకలను విశాఖ సముద్ర తీరంలోనే ప్రారంభించడం విశేషం. రెండో యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ యుద్ధనౌక ఐఎన్ఎస్ అండ్రోత్‌ను సోమవారం విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో తూర్పు నౌకాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధర్కర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో భారత నౌకాదళ అధికారులు, షిప్‌యార్డ్ ప్రతినిధులు హాజరయ్యారు. ఐఎన్ఎస్ అండ్రోత్ చేరికతో భారత నౌకాదళం యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాలు మరింత బలోపేతం అవుతాయని నౌకాదళ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా తీర ప్రాంతానికి చేరువలో లోతు తక్కువగా ఉన్న సముద్ర జలాల్లో జరిగే ఆపరేషన్లకు ఇది చాలా కీలకమని పేర్కొన్నాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాకు చెందిన ప్రభుత్వరంగ నౌకా నిర్మాణ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) ఈ యుద్ధనౌకను రూపొందించింది. ఐఎన్ఎస్ అండ్రోత్‌లో 80 శాతం కంటే ఎక్కువ భాగాలు దేశీయంగా తయారు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడిం చాయి. ఇది భారత స్వదేశీ నౌకా నిర్మాణ పరాక్రమాన్ని చాటుతోందని పేర్కొన్నాయి.

ఐఎన్ఎస్ అండ్రోత్ ప్రత్యేకతలు

యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ శ్రేణిలో ఐఎన్ఎస్ అర్నాలా తర్వాత ఇది రెండో యుద్ధనౌక. మొదటిది ఐఎన్ఎస్ అర్నాలా... ఈ ఏడాది జూన్ 18వ తేదీన భారత నౌకాదళంలో చేరింది. లక్షద్వీప్‌లోని అండ్రోత్ అనే దీవి పేరును ఈ యుద్ధనౌకకు పెట్టారు. ఐఎన్ఎస్ అండ్రోత్‌లో దేశీయంగా రూపొందించిన 30 మిల్లీమీటర్ల సర్ఫేస్ గన్ ఉంది. ఈ నౌకలు విమానాలతో సమన్వయం చేసుకుంటూ శత్రువులకు సంబంధించిన జలాంతర్గాములను వేటాడనున్నాయి. ఈ రెండు యుద్ధ నౌకలలో అత్యాధునిక పోరాట నిర్వహణ వ్యవస్థలతో పాటు.. తేలికపాటి టార్పిడోలు, జలాంతర్గామి విధ్వంసక రాకెట్లు ఉంటాయి. తక్కువ లోతు ఉన్న జలాల్లోని జలాంతర్గాములను వేటాడేందుకు భారత నౌకాదళం మొత్తం 16 అధునాతన నౌకలకు ఆర్డర్ ఇచ్చింది. ఇందులో 8 యుద్ధనౌకలను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ ఉత్పత్తి చేస్తోంది. ఇక ఈ ఐఎన్ఎస్ అండ్రోత్ నౌకాదళంలో చేరడం ద్వారా.. భారత నౌకాదళ స్వదేశీకరణ ప్రయత్నాల్లో మరో కీలక మైలురాయిగా నిలిచిందని ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రకటన విడుదల చేసింది.

నకిలీ మద్యం లీలలు

(మొదటిపేజీ తరువాయి)
మద్యం సీసాలు ఉండటంపై అనేక అనుమానాలు ఉన్నాయి. తాజాగా నకిలీ మద్యం కేసుకు సంబంధించిన కీలక అంశాలు ఇబ్రహీంపట్నం మండలంలో వెలుగు చూశాయి. ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో నకిలీ మద్యానికి వాడిన స్పిరిట్ లభ్యమైంది. నకిలీ మద్యం తయారీలో ఈ స్పిరిట్ కీలకంగా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న అద్దెపల్లి జనార్ధన్‌రావుకు సంబంధించిన గోడౌన్‌లో పెద్ద ఎత్తున మద్యం తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన స్పిరిట్ ఖాళీ సీసాలను పోలీసులు సీజ్ చేశారు. వాటితో పాటు కేరళ మార్ట్, ఓఎస్టీ బ్రాండ్లకు చెందిన స్టిక్కర్లను, 35 లీటర్ల సామర్థ్యం కలిగిన 95 క్యాన్లలో లభ్యమైన స్పిరిట్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాలకు మద్యం పంపిణీ చేసే క్రమంలో సంబంధిత మెటీరియల్ సిద్ధంగా ఉంచుకున్నట్లు అధికారులు గుర్తించారు. నకిలీ మద్యం తయారీ కోసం ఆర్ఎస్, ఈఎన్ఏ స్పిరిట్‌లను వినియోగించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో స్పిరిట్ విక్రయించిన వారిని గుర్తించి, వారిపై కేసు నమోదుకు అధికారులు సిద్ధమయ్యారు. ఒక్కో బాటిల్ రూ.120 నుంచి రూ.130 ధరకు విక్రయించినట్లు సమాచారం. ఈ కేసులో ఏ1గా ఉన్న జనార్ధన్‌రావు ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయన అనుచరుడు కట్టా రాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వంపై వైసీపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పట్టుబడిన మద్యం స్పిరిట్ టీడీపీ నేత జనార్ధన్‌రావు గోడౌన్ అని, ఆయన వెనుక ఎవరున్నారో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. నకిలీ మద్యం పేరుతో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి తదితరులపై అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా జైళ్లకు పంపారని, ఇప్పుడు బయటపడిన మద్యం స్పిరిట్‌పై చంద్రబాబు ప్రభుత్వం ఏం చెబుతుందని నిలదీస్తున్నారు. ఎన్నికల ముందు రూ.99కే మద్యం విక్రయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి... అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారని మండిపడుతున్నారు. ఇదిలాఉండగా, ఇబ్రహీపట్నంలోని గోడౌన్‌లోని నకిలీ మద్యం స్వాధీనం చేసుకుని పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. మరోవైపు, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోను ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పక్క జిల్లాలకు కల్తీ మద్యం సరఫరా చేసినట్లు గుర్తించారు. అదే జిల్లాలోని పీటీఎం మండలం సోంపల్లె గ్రామంలోని బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేపట్టారు.

న్యాయ వ్యవస్థను బెదిరించడమే...

(మొదటిపేజీ తరువాయి)
ప్రవర్తన మాత్రమే కాదని, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు చెందిన కుడిపక్ష శక్తులు పెంచిపోషిస్తున్న అసహన సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలను అవమానపరచడం, న్యాయవ్యవస్థను బెదిరించడం లక్ష్యంగా... ప్రణాళికతో కూడిన దాడి ప్రయత్నమని నారాయణ మండిపడ్డారు. సీపీఐ అభిప్రాయం ప్రకారం... న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి ఒక స్వతంత్ర స్తంభం. న్యాయమూర్తులపై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య శక్తులందరూ న్యాయవ్యవస్థ గౌరవం, స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, దీని వెనుక ఉన్న ఉద్దేశం, సంస్థాగత ప్రోత్సాహం గురించి వెలికితీయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై నేర, ధిక్కరణ చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. రాజ్యాంగ విలువలను కాపాడటానికి, ద్వేషం, బెదిరింపు రాజకీయాలను ఎదుర్కోవడానికి, సామ్యవాద, ప్రజాస్వామ్య శక్తులంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

సనాతనవాది దాడి దుర్మార్గం: రామకృష్ణ

సీజేఐ బీఆర్ గవాయ్‌పై ఓ సనాతనవాది దాడికి పాల్పడడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎన్నడూ లేని విధంగా సుప్రీంకోర్టులో ఇలాంటి అనూహ్య ఘటన చోటుచేసుకోవడం విచారకరమన్నారు. సాక్షాత్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై రాకేశ్ కిషోర్ అనే న్యాయవాది చెప్పుతో దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 'సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు' అని న్యాయవాది కేకలు వేయడం దుర్మార్గమన్నారు. లౌకిక వ్యవస్థగా పేరుగాంచిన దేశంలో ఎవరి అభిప్రాయాలను వారు స్వేచ్ఛగా వెలిబుచ్చే పరిస్థితి ఉండేదని, మోదీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి సనాతనవాదం తారస్థాయికి చేరిందన్నారు. సనాతనవాదుల్లో రోజురోజుకీ అసహనం పెరిగిపోతోందని, చివరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడులు చేసే స్థాయికి సనాతనవాద పిచ్చి పరాకాష్టకు చేరడం గర్హనీయమని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హేతువాదులు, ప్రజాతంత్రవాదులంతా సనాతనవాదుల దురాగతాలను తీవ్రంగా ఖండించాలని కోరారు.

మతోన్మాదులపై చర్యలు: సీపీఎం

సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ తీర్మానించింది. రాష్ట్ర కమిటీ సమావేశాలు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అధ్యక్షతన జరిగాయి. మొదటగా జస్టిస్ గవాయ్‌పై మతోన్మాద న్యాయవాది ఒకరు కోర్టులో అందరూ చూస్తుండగానే బూటు విసరటం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందని తీర్మానం విమర్శించింది.

సీజేఐపై దాడి హేయం: కూనంనేని

విశాలాంధ్ర - హైదరాబాద్: సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై నిండు కోర్టులో ఒక న్యాయవాది దాడికి ప్రయత్నం చేయడం అత్యంత దిగ్భ్రాంతికరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి , శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇది కేవలం గవాయ్‌పై జరిగిన దాడి కాదని, భారత సర్వోన్నత న్యాయ వ్యవస్థ పై జరిగిన దాడిగా భావించాలని వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం పేరిట ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరే ప్రయత్నం న్యాయవ్యవస్థ తమకు అనుకూలంగా వ్యవహరించాలనే బెదిరింపు ధోరణి, అరాచకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా దేశంలో మత, మితవాద శక్తుల ఆధిపత్య వైఖరి ... చివరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి దారితీయడం ప్రజాస్వామ్య విలువలకు పరాకాష్ట అన్నారు. ఈ దాడిపై లోతుగా విచారించి న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయవ్యవస్థ స్వతంత్రతను, దేశ లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవశ్యకత ఉందన్నారు.

ఆర్టీఐ కొత్త లోగో ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు (ఆర్టీఐ) కమిషన్ కొత్త లోగోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. 20వ జాతీయ ఆర్టీఐ వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ బృందం ముఖ్యమంత్రిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలోని బృందం సీఎంతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో సమాచార హక్కు కమిషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం ఇటీవలే భర్తీ చేసింది. ఈ క్రమంలో బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావు, మొహిసినా పర్వీన్, దేశాల భూపాల్, మెర్ల వైష్ణవి కమిషనర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మత్స్యకారులు టెర్రరిస్టులా?

(మొదటిపేజీ తరువాయి)
మత్స్యకారులు, స్థానికులు ఆందోళనలు చేస్తున్నారని, వారిని పరామర్శించడానికి, బాధితులకు సంఘీభావం తెలపడానికి వెళుతుంటే... పోలీసులు ఓవరాక్షన్ చేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. ఆందోళనకారువల వద్దకు తీసుకెళతామని నమ్మబలికి... దారి మళ్లించారని విమర్శించారు. మత్స్యకారులు ఏమైనా టెర్రరిస్టులలా? మేమైనా టెర్రరిస్టులమా అని రామకృష్ణ ప్రశ్నించారు. తాము ఆందోళనకారులను కలవాలనుకోవటం పోలీసులకు ఎందుకు తప్పుగా కనిపించిందని ప్రశ్నించారు. ఆందోళకారులను కలవకూడదని, కలవాలంటే మూడు రోజులు ముందుగానే అనుమతి తీసుకోవాలని, 30 యాక్ట్ అమల్లో ఉందని పోలీసులు చెప్పడాన్ని తీవ్రంగా తప్పుపడుతుఊ... మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీగా తాము ఆందోళనకారులను కలిసి... వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వచ్చామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముందస్తు అరెస్టులపై తెలుగుదేశం పార్టీతో కలిసి ఆందోళనలు చేశామని, అధికారం రాగానే టీడీపీ నాయకులు ఆ విషయం మర్చిపోయారా అని నిలదీశారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆందోళనకారులు సంయమం పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా నిరసనలు కొనసాగించాలని రామకృష్ణ కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారంగా వైద్యవైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మహబూబాబాద్ మండలంలోని ముత్యాలమ్మగూడెం బాలికల ఆశ్రమ పాటశాలను, అంగన్వాడీ కేంద్రం, మండల ప్రాథమిక పాటశాలను, కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలను ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ పాఠశాలల్లోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, లైబ్రరీ తరగతి గదులను పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల వివరాలను, వారి అభ్యసన సామర్థ్యాలను పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, విద్యార్థులతో ముచ్చటించి వారి విషయావగహన పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం, డిజిటల్ తరగతులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాట్యాంశాలను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన బోజనంతో పాటు, మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేలా పాట్యాంశాలను భోదించాలని అన్నారు. వారి మానసిక, ఆరోగ్య స్థితిగతులను నిత్యం గమనిస్తూ ఉండాలని, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకుంటూ నిత్య సానిటేషన్ చేయాలన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కు అండగా నిలిచిన మాస్ సంస్థ

విశాలాంధ్ర - తొర్రూర్: సమాజంలో నెలకొన్నఅసమానతలను తొలగించడమే కాకుండా, పేద మధ్యతరగతి కుటుంబాలలో మాదిగ విద్య కుసుమాలకు వారి ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాలలో ఎంబిబిఎస్ మంచిర్యాల మెడికల్ కాలేజీలో సీట్ సాధించిన తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు యాకయ్య కుమారుడు ధర్మారపు లోకేష్ నిరుపేద కుటుంబం కావడంతో మహా అది సేవ సమితి సంస్థ అండగా నిలిచి 20 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేసినట్లు మాస్ సంస్థ ప్రతినిధులు డా.అలువాల విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడం తండ్రి యాకయ్య దయాలసీస్ పేషెంట్ తల్లి మైబూబా వ్యవసాయ కులీ కావడంతో తన ఉన్నత విద్యకు ఆటంకం కలుగుతుందని భావించి మాస్ సంస్థ చేస్తున్న నీరుపేద మాదిగ విద్యార్థుల ఉన్నత చదువులకై అందిస్తున్న ప్రోత్సాహక సహాయ సహకారాలను తెలుసుకొని నాకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ సంస్థ నీరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకై ఆసక్తి ఉండి, ఫీజులు పెండింగులు, సర్టిఫికెట్లు తీసుకోలేని వారికి ఆర్థిక పరిస్థితిని విచారణ రిపోర్ట్ ఆధారంగా సహాయం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సంస్థ సభ్యులు రాయిశెట్టి యాకేందర్, యూనివర్సిటీ పీజీ కాలేజీ అధ్యపకులు డా. ధర్మారపు నాగయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు ధర్మారపు మహేందర్, ధర్మారపు వెంకయ్య, మంగళపెల్లి చంటి తదితరులు పాల్గొన్నారు. సంప్రదించాలకునే వారు ఈ మొబైల్ నెంబర్‌కి 9010730380, 9959697682 ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ డా. సినపెల్లి విజయ్ కుమార్ సంప్రదించవచ్చిని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల స్కాం : ఎనిమిది మంది అరెస్ట్

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు అందించకుండా అక్రమాలకు పాల్పడిన ఎనిమిది మంది నిందితులను సూర్యాపేట జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మేళ్లచెరువు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో నిందితుల వద్ద నుంచి రూ.7.30 లక్షల నగదు, 44 వాడని చెక్కులు, 6 బ్యాంక్ పాస్ బుక్కులు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 51 చెక్కుల విలువ రూ.34.58 లక్షలు కాగా, వీటిలో 7 చెక్కులను దుర్వినియోగం చేసి రూ.9.50 లక్షలు మోసం చేసినట్లు ఎస్పీ కె.నరసింహ ఐపీఎస్ తెలిపారు.ప్రధాన నిందితుడు పెండెం వెంకటేశ్వర్లు (సోమారం గ్రామం, నేరేడుచర్ల మండలం) హుజూర్నగర్ మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి దగ్గర బంధువైన బెల్లంకొండ వెంకటేశ్వర్లు సహాయంతో నకిలీ లబ్ధిదారులను సృష్టించి, అసలైన లబ్ధిదారుల చెక్కులను వేరే వ్యక్తుల ఖాతాల్లో వేసి మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో అసిస్టెంట్‌గా పని చేసిన ప్రైవేట్ వ్యక్తి పులిదిండి ఓంకార్ ఈ మోసంలో కీలకపాత్ర పోషించాడు. నిందితులు నకిలీ వ్యక్తుల ఖాతాల్లో చెక్కులు జమచేసి రూ.9.50 లక్షలు డ్రా చేసినట్లు దర్యాప్తులో తేలింది. అందులో రూ.2.25 లక్షలు బాధితునికి ఇవ్వగా, మిగిలిన రూ.7.30 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ నరసింహ ఐపీఎస్ పర్యవేక్షణలో కోదాడ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ ప్రతాపలింగం, ఎస్ఐ పి. పరమేష్ కేసును త్వరితగతిన ఛేదించారు. బాధితులు ఇలాంటి మోసానికి గురైనట్లయితే వెంటనే మేళ్లచెరువు ఎస్ఐకి ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ సూచించారు.

న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - ఖమ్మం : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై చెప్పు విసరడానికి ప్రయత్నించిన న్యాయవాదిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అతని న్యాయవాద సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని బి.ఆర్.అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం కార్యాలయంలో లింగాల రవికుమార్ మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్‌ని అవమానించడం క్షమించరాని నేరమని, ఇలాంటి వ్యక్తి దేశద్రోహితో సమానమని అతనిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై అన్ని కోర్టులలో న్యాయవాదులు బార్ అసోసియేషన్లు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని లింగాల రవికుమార్ కోరారు.

త్రిపురారంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ జిల్లా, త్రిపురారంలో ఉన్న తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకులాన్ని, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గిరిజన బాలికల సంక్షేమ మినీ గురుకులాన్ని తనిఖీ చేసి సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారి పేర్లు, వివరాలు, ఇష్టం ఉన్న సబ్జెక్టులు, తదితర అంశాలను ముచ్చటించారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు చెప్పారు. పిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు తరగతి గదిలో చదువుకోవడమే కాకుండా అక్కడే నేలపై పడుకుంటున్నారని తెలుసుకుని తక్షణమే 100 పరుపులను నల్గొండ నుండి పంపిస్తానని కలెక్టర్ చెప్పారు. మినీ గురుకులంలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను ఆమె తనిఖీ చేశారు. సాధ్యమైనంత త్వరగా అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మినీ గురుకులం గ్రౌండ్ లోతుగా ఉందని, మట్టి కావాలని ప్రిన్సిపల్ భారతి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. అంతేకాక ఫార్మసీలో స్టాక్‌లో ఉన్న మందులు, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వస్తున్న పేషెంట్లు, వారికి అందిస్తున్న చికిత్స, రిజిస్టర్లు, రిపోర్టులు తదితర వివరాలను పరిశీలించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, మినీ గురుకులం ప్రిన్సిపల్ భారతి, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్, తహసిల్దార్ ప్రమీల, ఎంపీడీవో విజయలక్ష్మి, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

ఎన్నికలు ముగిసే వరకు సమర్థవంతంగా పనిచేయాలి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: ఎన్నికలు ముగిసే వరకు సమర్థవంతంగా సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. సోమవారం ఐడిఓసిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణపై ఆర్వోలు, ఏఆర్వోలు, ఎంపీడీవోలు, ఆల్ నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నామినేషన్ నుండి లెక్కింపు వరకు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు, అర్హతలు, పరిశీలన, గుర్తుల కేటాయింపు, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ మెటీరియల్ పంపిణీ, కేంద్రాలు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు తదుపరి ఎన్నికల నిర్వహణలో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర అన్ని అంశాలపై ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిర్వహించాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలు ట్రాన్స్పరెన్సీ, సక్సెస్ ఫుల్‌గా జరగాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహనా కల్పించారు. ఈ శిక్షణలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాస్ రావు, డిపిఓ యాదయ్య, డిఈఓ రాధకిషన్, ఆర్డిఓలు రమాదేవి, మహిపాల్ రెడ్డి, జయచంద్రారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై ఎస్పీ అవగాహన..

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులకు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల నియమావళిపై అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర రెడ్డి ఎన్నికల సమయంలో పాటించవలసిన విధానాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించి తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఎన్నికల సమయంలో ప్రతి అధికారి నిష్పాక్షికంగా, చట్టపరంగా, ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ... జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా, శాంతి భద్రతల మధ్య సజావుగా జరిగేలా ప్రతి పోలీస్ అధికారి కృషి చేయాలని సూచించారు. ప్రతి అధికారి తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి ఎలాంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీఎస్ మహేందర్, డియస్పిలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సీఐలు సందీప్ రెడ్డి, శ్రీ.మధు సుధన్ గౌడ్, జాన్ రెడ్డి, రంగా కృష్ణ, వెంకట రాజా గౌడ్, జార్జ్, శైలందర్, రామకృష్ణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

8న టాస్క్ కేంద్రం వద్ద జాబ్ మేళా

విశాలాంధ్ర బ్యూరో- పెద్దపల్లి: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్‌లో ఉద్యోగాలు కల్పించుటకు అక్టోబర్ 8న బుధవారం రోజున ఎంపీడీవో ఆవరణలోని టాస్క్ కేంద్రం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్‌లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ కాంటెంట్ మోడరెటర్, అనలిస్ట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఈ పోస్టులకు ఏదైనా డిగ్రీ, బీటెక్ లేదా పిజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని, స్త్రీ పురుషులు దరఖాస్తు తీసుకువచ్చని, అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 8న సంబంధిత సర్టిఫికేట్స్ జిరాక్స్‌లతో పాటు రేస్ యుమ్ తీసుకొని పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గల టాస్క్ సెంటర్ నందు నిర్వహించే జాబ్ మేళాలో హాజరు కావాలని మరిన్ని వివరాలకు 9059506807 నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆ ప్రకటనలో తెలిపారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: వృత్తి శిక్షణ నైపుణ్యం కోసం ఈనెల 15 లోగా దరఖాస్తులు ఆర్జీ వన్ సింగరేణి సేవాసమితి కార్యాలయంలో అందజేయాలని పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సేవా సమితి, ఆర్జీ వన్ ఆధ్వర్యంలో సామాజిక భాధ్యత స్వయం ఉపాధి కల్పనలో బాగముగా సింగరేణి ఉద్యోగుల మాజీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు, పిల్లలకు, సింగరేణి ప్రభావిత గ్రామాలు, గోదావరిఖని ప్రాంత నిరుద్యోగ యువతులకు, మహిళలకు జీవనోపాధి కల్పించుటకు టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, స్పోకెన్ ఇంగ్లీష్, క్లాత్/ జూట్/ బంజారా బ్యాగ్స్ వివిధ వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులను ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగం వెంటనే నిలిపివేయండి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: జిల్లాలో చిన్నపిల్లలలో దగ్గును నియంత్రించేందుకు వినియోగించే కోల్డ్ రిఫ్ సిరప్ వాడకాన్ని వెంటనే నిలిపివేయాలని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డి.జి. హెచ్.ఎస్.), తెలంగాణ రాష్ట్ర వైద్య-ఆరోగ్యశాఖ డైరెక్టర్ మార్గదర్శకాల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వెంటనే ఆపాలని, సిరప్ సంబంధిత నిల్వలు జిల్లాలో అందుబాటులో లేవని, జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, ఫార్మాసిస్టులు, ఏజెన్సీలు తమ వద్ద సిరప్ నిల్వలు ఉన్నట్లయితే వెంటే సమాచారం అందించాలని తెలిపారు. తమిళనాడులోని కాంచీపురం జిల్లాకు చెందిన శ్రేసన్ ఫార్మా మే 2025 నెలలో తయారు చేసిన బ్యాచ్ నం.ఎస్ఆర్-13 నుండి వచ్చిన కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగించడం వలన చిన్న పిల్లలలో అనారోగ్య సమస్యలు రావడంతో ఈ మందు నిషేధించడం జరిగిందని, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో అనేక మంది పిల్లల మరణానికి కోల్డ్ రిఫ్ సిరప్ వినియోగంతో సంబంధం ఉండటంతో ఈ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ప్రకారం నమోదు చేసుకున్న అన్ని ఆసుపత్రులు, ఫార్మసీ కేంద్రాలు, చిన్నపిల్లల వైద్యులు, ప్రైవేట్ వైద్యుల వద్ద కోల్డ్ రిఫ్ సిరప్ లు ఉండరాదని, సిరప్ నిల్వలు కలిగి ఉన్న వారు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో / టోల్ ఫ్రీ నం. 1800 599 6969 లో వివరాలు అందించాలని తెలిపారు. 2 సం.ల వయస్సు లోపు గల పిల్లలకు ఎలాంటి దగ్గు మందుల వినియోగానికి వైద్యులు సూచించరాదని, తల్లిదండ్రులు పిల్లల వైద్య నిపుణుల సూచన ద్వారా మాత్రమే మందులను వినియోగించాలని, ఫార్మాసిస్టులు / డ్రగ్గిస్ట్ లు వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని తెలిపారు.

కోట మైసమ్మ జాతర హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ జాతర హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ప్రతి ఏడాది విజయదశమి(దసరా)ను పురస్కరించుకొని ఇక్కడ ఐదు రోజుల పాటు అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈనెల రెండవ తేదీ నుండి ప్రారంభమైన కోట మైసమ్మ జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా పెద్ద వాహన పూజలకు రూ.1,82,800లు, ద్విచక్ర వాహన పూజలకు రూ.1,89,100లు, గోత్ర నామార్చన పూజలకు రూ.42,360లు, కుంకుమార్చన పూజలకు రూ.81,030లు, వేలం పాట హక్కుల ద్వారా కొబ్బరికాయలు పూజ సామాగ్రికి రూ.3,14,000లు, లడ్డు పులిహోరకు రూ.1,51,000, మిఠాయిలకు రూ.2,10,000లు, పుట్నాలకు రూ.72,00లు,ఐస్ క్రీమ్‌లకు రూ.36,500లు, కొబ్బరి చిప్పలకు రూ.1,81,000లు,హుండీ ఆదాయం రూ.7,41,764లు, జాతరలు దుకాణాల స్థల ఏర్పాటు కిరాయిలకు రూ.5,40,650లు, విరాళాలు రూ. 3,696లు, చీరల వేలం రూ.80,486లు, వాహన పూజలు చేయు పూజారుల లైసెన్సులకు రూ. 84,000ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జాతర ఆదాయం రూ.1,92,437లు పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సా ట్రస్ట్, దేవాలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఈ.వెంకటేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. వేణుగోపాలాచార్యులు, సిబ్బంది పరస సాయి, పగడాల మోహన్ కృష్ణ మూడు మోహన్ పరాకమని సేవకులు తదితరులు పాల్గొన్నారు.

రోడెక్కిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల విభేదాలు

విశాలాంధ్ర - అశ్వరావుపేట : స్థానిక సంస్థల ఎన్నికలు నెత్తిపై వచ్చిన వేళ... అశ్వరావుపేట నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేల మధ్య విభేదాలు ముదిరి బజారెక్కాయి. అసలే ఆ పార్టీ పరిస్థితి రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా వరకు వడిదొడుగుల్లో ఉన్న క్రమంలో నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చ నాగేశ్వరావుల మధ్య నెలకొన్న విభేదాలు పార్టీకి తీవ్ర నష్టాన్ని కల్పించే దిశగా పయనిస్తున్నాయి. ఎంతో కాలంగా ఆ పార్టీ నాయకుల తీరుపై అసహనంగా ఉన్న తాటి వెంకటేశ్వర్లు నేరుగా ఆదివారం మీడియా సమావేశం నిర్వహించి తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుతో పాటు మాజీ ఎమ్మెల్యే మెచ్చా పై తీవ్రంగా విమర్శలు చేశారు. . తమ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా, పేట నియోజకవర్గ ఇన్చార్జి మేచ్చ తీరుపై చర్యలు తీసుకోకుంటే పార్టీకి జిల్లాలో తీవ్ర నష్టం జరుగుతుందని అధిష్టానానికి తాటి హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి బిఆర్ ఎస్ లోకి వచ్చిన తనకు ప్రాధాన్యత లేకుండా పోయిందని అడుగడుగు అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మీడియా ముందు తాటి ఆవేదన వ్యక్తం చేయడం జిల్లాలో తీవ్ర దుమారాన్ని లేపింది. పార్టీ గీత దాటి నిర్మొహ మాటంగా తాటి పై ఇద్దరు నాయకులపై చేసిన ఆరోపణలు ఇటీవల జరుగుతున్న పరిణామాలపై తాటి చేసిన విమర్శలు ఆ పార్టీ ప్రతి కార్యకర్త గుండెచప్పుడుగా మారాయి. ఒకే పార్టీలో ఉన్న ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మధ్య చాలా కాలంగా సఖ్యత లేదని స్పష్టం అవుతుంది. అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

స్థానిక ఎన్నికల్లో ఒక జెడ్పిటిసి, 17 ఎంపీటిసిలకు సిపిఎం పోటీ

విశాలాంధ్ర - బూర్గంపాడు : ప్రజల పక్షాన రైతులు కార్మికుల కోసం ఎలాంటి రాజు లేకుండా పోరాడుతున్న సిపిఎం పార్టీ స్థానిక ఎన్నికల్లో మండలంలోని అన్ని స్థానాల్లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అన్నారు. మండలంలోని 17 ఎంపీటీసీలు, ఒక జడ్పిటిసి కి పోటీ చేయనున్నట్లు స్థానిక కమిటీ నిర్ణయించిందన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన స్థానికల ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హక్కుల కోసం, పోడు భూముల కోసం పోరాడుతున్న సిపిఎం పార్టీ అభ్యర్థుల్ని గెలిపించాలని మండల ప్రజలను కోరారు. ప్రతి గ్రామంలో ప్రజా సమస్యల్ని తెలుసుకుని సర్వేలు నిర్వహిస్తూ పరిష్కారం అయ్యే విధంగా సిపిఎం పార్టీ పోరాడుతుందన్నారు. విలువైన తమ ఓట్లను డబ్బుకు, మద్యానికి అమ్ముకోకుండా నిజమైన ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, నాయకులు పాండవుల రామనాథం, పాపినేని సరోజన, అబిదా బేగం, భయ్యా రాము, గుంటక కృష్ణ, రాయల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలి

విశాలాంధ్ర- పినపాక : త్వరలో జరగపోయే స్థానిక సంస్థ ఎన్నికలపై ప్రతి కార్యకర్త సైనికుల అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించడం ద్వారా అభ్యర్థులను గెలిపించు కోవాలని కోరారు. సోమవారం మణుగూరు మండలంలోని గుట్ట మల్లారంలో పినపాక నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షులు పొదేం వీరయ్య, గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దేవి ప్రసన్న దేవి ప్రసన్న హాజరయ్యారు. ఈ సమావేశంలో ముందుగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ లుగా గ్రామాల నుంచి పోటీ చేయదలచిన నాయకులు, కార్యకర్తలు తమ పేర్లను పార్టీకి సమర్పించాలని సూచించారు. ఈ దరఖాస్తులను పరిశీలించి, అభ్యర్థులను పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ఎంపిక జరుగుతుందన్నారు. గత ఎన్నికల్లో పార్టీ శ్రేణులు తన విజయానికి ముఖ్యపాత్ర వహించారు అన్నారు. అలాగే ఈ ఎన్నికలను ప్రతిష్టగా తీసుకోవాలని కోరారు. గ్రామ స్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలన్నారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని భాషాభాగం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ప్రజలు ఆర్థికంగా ఊపిరి పీల్చుకున్నారని పథకాలను వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, చందా లింగయ్య దొర, డిసిసి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, చందా సంతోష్, పినపాక, కరక గూడెం, మణుగూరు మండలా ల అధ్యక్షులు పిరినాకి నవీన్, గోడిశాల రామనాథం, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, నాయకులు కొరస ఆనంద్, గాండ్ల సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - భద్రాచలం : రోడ్డు నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రవాణా శాఖ అధికారి సంఘం వెంకట పుల్లయ్య అన్నారు. భద్రాచలం రవాణాశాఖ యూనిట్ కార్యాలయంలో సోమవారం లెర్నర్, డ్రైవింగ్ లైసెన్స్, మోటార్ సైకిల్, ఆటో రిజిస్ట్రేషన్స్‌లతో పాటు వాహనాల ఫిట్నెస్‌కు వచ్చిన వాహన దారులకు రోడ్ సేఫ్టీ, భద్రత ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించడం, వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరిం చడం, వాహనాలను నడిపేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తె ప్రమాదాలు నివారించవచ్చన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి నడపడం నిషేధమనీ చాలా ప్రమాదకరం అన్నారు. చాలా దూరం ప్రయాణించాల్సి వచ్చినపుడు ముందురోజు విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటిస్తామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్సై

విశాలాంధ్ర -కొత్తగూడెం క్రైమ్ : కొందరు పోలీసులు విధి నిర్వహణ పట్ల ఎంత నిబద్ధత, బాధ్యతగా ఉంటారో అంతే స్థాయిలో మానవత్వం కలిగి ఉంటారని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్ నిరూపించారు. సోమవారం సాయంత్రం బోడగుట్టకు చెందిన ఖలీల్ పాషా ఒక పనిమీద బస్టాండ్ ప్రాంతానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్ళాడు. ఇక్కడి ఆర్టీసీ బంక్ వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్ కుమార్ దీన్ని గమనించి తక్షణమే స్పందించి ఖలీల్ పాషాను తన వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. వెంటనే దగ్గరుండి ఎక్కడ ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం ఖలీల్ కుటుంబ సభ్యులకు ప్రమాదం గురించి ఎస్సై సమాచారం అందించారు. దీంతో అక్కడికి కుటుంబ సభ్యులు చేరుకున్నారు. మానవత్వంతో స్పందించి దగ్గరుండి ఆసుపత్రికి తరలించిన ఎస్సై ప్రవీణ్ కుమార్ ఉదారత్వానికి క్షతగాత్రుడు ఖలీల్ తో పాటు అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనా స్థలంలో ఉన్న కొందరు ప్రజలు ఎస్సైను అభినందించారు.

ఘనంగా వడ్డెర ఓబన్న వర్థంతి

విశాలాంధ్ర - కోదాడ : స్వాతంత్ర్య పోరాట యోధుడు వడ్డెర ఓబన్న వర్థంతిని సోమవారం కోదాడలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పట్టణంలో బస్టాండ్ వద్ద గల ప్రధాన రహదారిపై ఉన్న ఆయన విగ్రహానికి అన్ని పార్టీల నాయకులు, వడ్డెర సంఘం నాయకులు కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలహీన వర్గాల్లో పుట్టినప్పటికీ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై అలుపెరగకుండా పోరాడిన స్వాతంత్ర సమరయోధుడు ఓబన్న అని, ఆయన ఆశయాల సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర కులస్తులకు రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించి మద్దతు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంటిపులి వెంకటేష్, బత్తుల ఉపేందర్, చింతల నాగేశ్వరరావు, చింతల లింగయ్య, వంటిపులి శ్రీనివాస్, ఓర్సు దుర్గారావు, ఉప్పతల కోటేశ్వరరావు, బండ్ల దాసు, ఉప్పతల శ్రీనివాస్, వేముల రాము, చల్లా వెంకన్న, బత్తుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడిని ఖండించిన న్యాయమూర్తుల సంఘం

విశాలాంధ్ర - ఖమ్మం : తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. న్యాయమూర్తులపై దాడి అంటే అది న్యాయ వ్యవస్థపైనే దాడి చేసినట్టే. ఇది రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య పునాదులకు మచ్చతెచ్చే సంఘటనగా తాము భావిస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లా కోర్టులో ఉన్న వివిద న్యాయవాద సంఘాలు ఐఏఎల్, ఐలు, కాంగ్రెస్, టీడీపి, సంఘాలు ముక్త ఖంఠంతో ఈ దాడిని ఖండించారు. అదేవిధంగా ఈ దాడికి వెనక ఉండి ప్రోత్సహించే శక్తులను కూడా కనిపెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమాధానాలు ఎగవేస్తున్న ఎన్నికల కమిషన్

సంపాదకీయం

బీహార్‌లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. నిజానికి వాతావరణం వేడెక్కడం మూడు నెలల కింద ప్రత్యేక, సునిశిత ఓటర్ల జాబితా తయారీతోనే మొదలైంది. ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఎన్నికల కమిషన్ బృందం శని, ఆదివారాల్లో బిహార్‌లో పర్యటించింది. 12 రాజకీయ పార్టీల నాయకులతో కూడా ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి, తదితరులు చర్చించారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహిస్తామని జ్ఞానేశ్ కుమార్ షరా మామూలుగా హామీ పడేశారు. కానీ ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతాయా అన్న అనుమానాలు మాత్రం మిగిలే ఉన్నాయి. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడం అంటే పోటీలో అన్ని పక్షాలకు సమానావకాశాలు కల్పించాలి. జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల కమిషన్ ఈ పని చేయడంలో విఫలం అవుతూనే ఉంది. పర్యటన ముగియడానికి ముందు జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో కూడా మాట్లాడారు. అక్రమంగా వలస వచ్చిన వారి పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్. ప్రధాన ఉద్దేశం అని ఎన్నికల కమిషన్ చెప్తూ వచ్చింది. అక్రమంగా వలస వచ్చిన ఎంతమంది పేర్లు తొలగించారు, ఒకే ఇంట్లో డజన్ల మంది ఓటర్ల పేర్లు ఎలా చేరాయి, అన్ని రాష్ట్రాలలో ఎస్ఐఆర్. చేపట్టినప్పుడు ఆధార్ కార్డును ప్రామాణికంగా స్వీకరిస్తారా అన్న ప్రశ్నల్లో వేటికీ జ్ఞానేశ్ కుమార్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. కొన్ని ప్రశ్నలకు డొంక తిరుగుడు సమాధానాలు ఇచ్చారు. కొన్నింటిని దాట వేశారు. కొన్నింటికి ఫిర్యాదులేమైన ఉంటే ఓటర్ల జాబితా సిద్ధం చేసిన ఈఆర్ఓలనో, జిల్లా కలెక్టర్లనో అడగండి అని జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. "అక్రమంగా వలస వచ్చిన ఓటర్లను ఎంతమందిని తొలగించారు అన్న ప్రశ్నకు జ్ఞానేశ్ కుమార్ లెక్క చెప్పనే లేదు. ఈ సమాచారం జిల్లా కలెక్టర్ల దగ్గర ఉందని, కలెక్టర్లు రాజకీయ పార్టీలకు వివరాలు అందజేశారని, ఇంకా అభ్యంతరాలు ఏవైనా ఉంటే నామినేషన్లు దాఖలు చేయడానికి పది రోజుల ముందు దాకా తెలియజేయవచ్చునని మాత్రం చెప్పారు. మొత్తం మీద "అక్రమంగా వలసవచ్చిన"ఎంత మంది పేర్లు తొలగించారో మాత్రం చెప్పలేదు. భారత పౌరులు ఎవరు, కానిది ఎవరో నిర్ణయించే అవకాశం ఎన్నికల కమిషన్‌కు లేదు. అయినా ఎన్నికల కమిషన్ పౌరసత్వ నిర్ధారణను కొనసాగించింది. 47 లక్షల మంది పేర్లు తొలగించడానికి కారణాలు ఏమిటో కూడా బయట పెట్టలేదు. ఓటర్ల జాబితా సిద్ధం చేసే అధికారులు ఆయా ప్రాంతాలలో దర్యాప్తు చేసి అభ్యంతరాలను, విజ్ఞాపనలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే తొలగించారని చెప్పారు. దీని మీద అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈఆర్ఓలను సంప్రదించవచ్చునన్నారు. సరైన ప్రామాణిక పత్రాలు లేనందువల్ల ఎంత మందిని తొలగించారో కూడా వివరాలు ఇవ్వలేదు. తొలగించిన వారి పేర్లు ఎన్నికల కమిషన్ వెబ్ సైట్‌లో ఉంచాలని ఆగస్టు 14 న సుప్రీంకోర్టు ఆదేశించేదాకా ఎన్నికల కమిషన్‌లో చలనమే కనిపించలేదు. తొలగించడానికి కారణాలేమిటో వెల్లడించాలని కూడా సుప్రీంకోర్టు తెలియజేసింది. కారణాలను వెల్లడించడానికి జ్ఞానేశ్ కుమార్ సిద్ధంగా లేరని ఆదివారం నాటి మీడియా సమావేశంలో ఆయన ధోరణివల్లే వ్యక్తమైంది. ఆధార్ కార్డును ప్రామాణికంగా పరిగణించాలని మొదట సుప్రీంకోర్టు సూచించినా పట్టించుకోలేదు. చివరకు సుప్రీంకోర్టు ఆదేశించవలసి వచ్చింది. క్రమంగా దేశమంతటా ఎస్ఐఆర్ నిర్వహిస్తామంటున్నారు కదా అప్పుడు ఆధార్ కార్డుని ప్రామాణికంగా పరిగణిస్తారా అన్న ప్రశ్నకూ సమాధానం లేదు. కానీ ఆధార్ కార్డు కేవలం గుర్తింపు పత్రమే తప్ప అది పౌరసత్వాన్ని నిరూపించదని, పుట్టిన తేదీ, చిరునామాకు కూడా ఆధార్ పనికి రాదన్న పాత పాటే పాడారు. మృతి చెందిన వారి, భారత పౌరులు కానివారి, అనేక చోట్ల ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లను, శాశ్వతంగా మరో చోటికి వెళ్లిపోయిన వారి పేర్లు తొలగించామని తెలియజేశారు. తుది జాబితా విడుదల చేసినప్పుడు సవివరమైన వివరణ కూడా అందులో ఉండేది. కనీసం 2009 నుంచి ఇటీవలి దాకా సకల వివరాలూ అందించే వారు. ఇప్పుడదేమీ కనిపించదు. ఒకే ఇంట్లో వందలాది ఓటర్లు ఎలా ఉన్నారు అంటే జ్ఞానేశ్ కుమార్ విచిత్రమైన సమాధానం చెప్పారు. ఇల్లు లేనివారు, ఉన్నా ఇంటి నెంబర్లు లేనప్పుడు పొరుగింటి నెంబరు ఇచ్చామంటున్నారు. లేదా ఇంటి నెంబర్ సున్నా అని చూపించామంటున్నారు. ఎన్నికల కమిషన్ చేస్తున్న చెయ్యని పనులవల్ల ఆ వ్యవస్థను రహస్యమైందిగా, దొంగచాటు వ్యవహారంగా మార్చేశారు. ప్రజల అభిప్రాయాన్ని ఎన్నికల కమిషన్ పట్టించుకోవడమే లేదు. ఇదంతా చూస్తూ ఉంటే స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే శక్తే లేదని రుజువు అవుతోంది. వాస్తవాలు తెలుసుకోవడానికి వీలుందని ఎన్నికల కమిషన్ చెప్తున్నా వాస్తవాలే కనిపించడం లేదు. కర్నాటకలోని అలంద్ శాసన సభా నియోజకవర్గంలో అవకతవకలు జరిగాయని చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ ఇప్పటిదాకా పెదవే విప్పలేదు.

బిహార్‌లో ఎన్నికలు జరగడానికి కొద్ది రోజుల ముందు ప్రత్యేక, సునిశిత ఓటర్ల జాబితా (ఎస్.ఐ.ఆర్.) సిద్ధం చేయడాన్ని సమర్థించుకున్నారు. ఎన్నికలు పూర్తి అయిన తరవాత ఓటర్ల జాబితా సవరించి ఉండాల్సిందన్న సూచనలను తోసి పుచ్చుతూ తాము చేపట్టిన సవరణ చట్టబద్ధమైందని, అవసరం అయిందని ఆయన అన్నారు. ఈ సవరణ ఎన్నికల తరవాత జరిపించి ఉండాల్సిందనడం "సమర్థనీయం" కాదని తేల్చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద ఇలాంటి సవరణ జరగాల్సిందేనని చెప్పారు. ఓటు వేయడానికి అర్హత లేని వారిని జాబితాలోంచి తొలగించడం ఎన్నికల ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల మునుపటికన్నా ఆరు శాతం ఓటర్లు తగ్గిపోయారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై దర్యాప్తు జరిపించడానికి కూడా ఎన్నికల కమిషన్ సిద్ధంగా లేదు. మొత్తం వ్యవస్థను కేంద్రీకృతం చేసేశారు. ఎన్నికల సంఘాన్ని నిరంకుశ వ్యవస్థగా మార్చేశారు. ఇలా జరిగే ప్రమాదం ఉందని 1984 లోనే సుప్రీంకోర్టు ఎ.సి.జోస్, శివన్ పిళ్లేకు మధ్య కేసు విచారణ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పుడు ఆ భయాందోళనలు నిజం అవుతున్నాయి. ఎన్నికల వ్యవస్థను నిర్వహించడానికి, పర్యవేక్షించడానికి, ఓటర్ల జాబితా సవరించడానికి రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్‌కు అధికారాలు ఉన్న మాట నిజమే అయినా సర్వాధికారాలు లేవు. ఉన్న అధికారాలు కూడా రాజ్యంగం ద్వారా సంక్రమించినవే. ఎన్నికల కమిషన్‌కు అపరిమితమైన ఆధికారాలు, నిరంకుశాధికారాలు ఉంటే దానిని నిర్వహించే వ్యక్తి తన రాజకీయ సిద్ధాంతం ప్రకారం నడుచుకోవడం మొదలు పెడితే రాజ్యాంగ సంక్షోభానికే దారి తీయవచ్చునని సుప్రీం కోర్టు హెచ్చరించింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యవసరమైన, అనివార్యమైన సూత్రాలను పక్కన పెడితే ఆ వ్యవస్థకే ముప్పు వస్తుంది. ప్రస్తుతం ఆ స్థితిలోనే ఉన్నాం.

పైవాడు

చింతపట్ల సుదర్శన్

అరుగు అంచున కూచుని ఆకాశంలోకి చూస్తున్నది డాగీ. అప్పటికి మూడు నాలుగు సార్లు డాగీని పిలిచి పలకకపోవడంతో పెద్దగా అరవాల్సి వచ్చింది డాంకీకి. ఏమిటి డాగీ. ఏమైంది నీకు. అరగంట నించి చూస్తున్నాను అసలు అరవడమే లేదు నువ్వు. అధికారంలో ఉన్నవాళ్లు, లేనివాళ్లూ అయిన పొలిటీషన్స్ గంట గంటకీ అరుచుకున్నట్టు నీలాంటి డాగీలు ప్రతి పదినిమిషాల కొకసారైనా అరవాలి కదా. ఎందుకు అరవడం లేదు. కొంపదీసి అరవడం మరచిపోలేదు కదా అంది డాంకీ. అరవడం మరిచిపోయిన లీడర్లు రిటైరైనట్టే, అరవడం మానేసిన డాగీ రోజులు దగ్గర పడ్డట్టే. నాకూ ఇంకా ఐదారు ఎలెక్షన్ల దాకా బతకాలనే ఉంది కానీ నా అదృష్టం ఎలా ఉందో తెలీక ఏమైనా తెలుస్తుందేమోనని ఆకాశంలోకి చూస్తున్నాను అంతే. ఏమిటేమిటీ నీ అదృష్టం ఎలా ఉందో ఆకాశంలో కనిపిస్తుందా? అని పళ్లికిలించింది డాంకీ. అవును. కాదా మరి. మనుషుల అదృష్ట దురదృష్టాలు, సౌభాగ్య దౌర్భాగ్య సంఘటనలూ ఆకాశంలో ఉండే గ్రహాలు తేలుస్తయట కదా. నాకూ అదృష్టాన్ని తెచ్చిపెట్టే గ్రహాలు కనపడతాయేమోనని ఆకాశంలో వెదుకుతున్నా అంది డాగీ.

రంగస్థలం

ఈసారి డాంకీ చాలాసేపు పళ్లికిలించి, నీ మొహం సూర్యుడూ, చంద్రుడూ తప్ప ఏ గ్రహాలూ మనకు కనిపించవు అంది. మరి నువ్వే అన్నావు కదా మనుషుల్లో కొందరు స్వాములకు, ఆకాశంలో ఏ గ్రహాలు ఎటునుంచి ఎటు తిరుగుతాయో, ఎక్కడ కొన్నాళ్లు సెటిలవుతాయో. వాటి తిరుగుళ్ల వల్ల రాజకీయ నాయకులు తాము ఎలెక్షన్లల్లో గెలిచేది లేనిది, సినిమా వాళ్లయితే జనాన్ని దోపిడీ చేసేది లేనిది, ఆ స్వాముల నడిగి తెలుసుకుంటారని. అవును అన్నాను, ప్రమాణ స్వీకారం చెయ్యాలన్నా, పత్రాల మీద వేలిముద్రలు వేయాలన్నా మనుషులకు చేతిలో గీతలూ, తలరాతలే ఉంటాయన్న నమ్మకం ఉంది. కాని ఈ గ్రహాలూ, తలరాతా, కలిసి వచ్చే కాలమూ, ఇలాంటివి మనుషులకు సంబంధించిన విషయాలు కుక్కలకీ, గాడిదలకీ ఇవేవీ వర్తించవు. మనల్ని గురించి గ్రహాలూ, ఆ పైవాడూ పట్టించుకోడు వదిలెయ్యి అంది డాంకీ.

ఆ పైవాడికి మరీ ఇంత పక్షపాతమా? మనుషులకే కాదు మనకూ ప్రాణాలున్నవి కదా. ఆ మధ్య మనుషులు కుక్కల మీద ఎంత ప్రేమ వలకబోశారు. వసతి గృహాలు కట్టిస్తామన్నారు. వేళకు ఇంత తిండి పెడతామన్నారు. ఇంకా అమలు చేస్తున్నట్టు లేదు. ఎప్పుడు అమలవుతాయో ఎప్పుడు నా కష్టాలు తీరుతాయో, అదృష్టం ఎప్పుడు తలుపు తడుతుందోనని ఆకాశంలోకి చూస్తూ కూచున్నాను. ఇప్పుడు నువ్వు చెప్తే అర్థమైంది ఇదంతా 'వేస్టు' అని, పైవాడికి మనమంటే లెక్కేలేదని, అంటూ డాగీ వెనక్కి వచ్చి గోడ వారన కూచుంది. అప్పుడేదో వీధి కుక్కలు కరిచి చంపుతున్నాయని భయపడి మనుషులు అంటే నాయకులు ఆ కూతలు కూశారు. వారి మాటలు నీటి మూటలు కదా. అవసరానికో అబద్ధం కాదు అనవసరంగా కూడా అబద్ధాలాడటం వారికలవాటు. అయినా వాళ్లనంటే ఏం లాభంలే. పైవాడికే మనమీద మెల్లకంటి చూపో, ఒంటి కంటి చూపో మరి అని డాంకీ అంటుంటే అరుగు ఎక్కాడు అబ్బాయి.

పైవాడనే మాట వినపడింది ఏ పైవాడు అన్నాడు అబ్బాయి. ఎంతమంది పైవాళ్లు ఉంటారేమిటి? అంది డాగీ. ఎందుకుండరూ ప్రతి రంగంలోనూ పెత్తనాలు సాగించే పైవాళ్లుంటారు. అవసరం లేకపోయినా రెండు దేశాల మధ్య తలదూర్చి పెత్తనం చేసేవాడూ, ఓ దేశానికి ఆయుధాలు సప్లయి చేస్తూనే ఓ పదో పాతికో శాంతి సూత్రాలు పాటించమని సలహా ఇచ్చే పైవాడూ ఉంటాడు అన్నాడబ్బాయి. ఈ మాట నిన్నామొన్న కూడా విన్నా. అసలు అంతర్జాతీయ ప్రమాణాలంటే ఏమిటి 'బ్రో' అనడిగింది డాంకీ. ఏముందిలే ఒక దేశం మీద మరో దేశం దాష్టీకం చేస్తుంటే, హింస రచన చేస్తుంటే మానవతా దృక్పథంతో సాయం చెయ్యడానికి వెళ్లిన వాళ్లను బంధించడం, టాయిలెట్ల నీరు తాగించడం, నల్లులతో కరిపించడం వంటివి అక్షరాలా పాటించడమే అన్నాడు అబ్బాయి.

అదా విషయం! మరి ఇరవై సూత్రాల శాంతి పథకం పని చేస్తుందంటావా. ప్రపంచంలో ఇక యుద్ధమనే మాట వినపడదంటావా అన్నది అమాయకరంగా డాగీ. ఏదో ఒకటి మనసులో పెట్టుకుని పలికే శాంతి ప్రవచనాలు పని చేయవు. ఆ సంగతి ఈ పైవాడికి అర్థం కావడంలేదు మరి అంది డాంకీ. ప్రపంచం మీద పెత్తనం చలాయించాలనుకునే పైవాడికి ఆ పైనున్నవాడు బుద్ధి చెప్తే బాగుండును అన్నది డాగీ ఆకాశంలో కనపడని పైవాడి కోసం చూస్తూ.

అమెరికా ముసుగు తొలగించిన ట్రంప్

జి.నవీన్

డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అమెరికా అధ్యక్షుడై తొమ్మిది నెలలే అయింది. కానీ అంతర్గతంగానూ, అంతర్జాతీయంగానూ ఆయన తీసుకున్న తలకిందుల నిర్ణయాలు చూస్తే అధికారంలోకి వచ్చి తొమ్మిది అయినట్టుగా ఉంది. అయితే ట్రంప్ అస్తవ్యస్త విధానాలు అమెరికా అనుసరించే విధానాలకు భిన్నమైనవని చాలామంది అనుకుంటారు. నిజానికి ట్రంప్ వ్యవహారం చూస్తే ఆయన అమెరికా నిజ స్వరూపాన్ని చూపిస్తున్నారు. అమెరికా ఎప్పుడూ క్రూర మృగంగానే ఉంది. వాస్తవానికి అమెరికా ఇన్నాళ్లుగా కనిపిస్తున్న తీరు అసలు స్వరూపాన్ని చూపించినందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు చెప్పాలి. అమెరికా ఆధిపత్యం మళ్లీ సంపాదించలేని రీతిలో తగ్గుతోంది. ఈ పరిస్థితి నుంచి తప్పించుకోవడానికే దిక్కుతోచని స్థితిలో ట్రంప్ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

నిస్సిగ్గుగా ఇస్రాయెల్‌కు మద్దతు: ఇస్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ పలస్తీనియన్లపై కొనసాగిస్తున్న కిరాతకమైన దాడికి ట్రంప్ గట్టి మద్దతు ఇచ్చారు. ఈ మారణకాండలో ఇప్పటికే 20,000 మంది బాలలతో సహా 65 వేలకుపైగా జనం ప్రాణాలు పోగొట్టుకున్నారు. నెతన్యాహు విధ్వంసాన్ని ఐక్యరాజ్య సమితి అధికారికంగా మారణ హోమం అంటోంది. అయినా వేలాదిమంది పలస్తీనియన్లను గజా నుంచి తొలగించి ఆ ప్రాంతాన్ని "శుద్ధి చేస్తాం" అని ట్రంప్ బహిరంగంగానే చెప్పారు. అంటే పలస్తీనియన్లకు అస్తిత్వాన్ని శాశ్వతంగా తొలగించడమే. ఇస్రాయెల్ మారణకాండను ఇదివరకు అమెరికా ఇలాగే సమర్థించింది. కాల్పుల విరమణ కోసం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాన్ని అడ్డుకోవడానికి మాజీ అధ్యక్షుడు బైడెన్, ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ అమెరికాకు ఉన్న వీటో అధికారాన్ని ఇప్పటికే ఆరుసార్లు వినియోగించుకున్నారు. ఇంకెన్ని సార్లు ఉపయోగించుకుంటారో తెలియదు. పలస్తీనియన్ల భూమి ఆక్రమించుకుని దాన్ని "బీచ్ ఒడ్డున ఉన్న ఆస్తిగా" మలుచుకుంటామని ట్రంప్ బాహాటంగానే మాట్లాడుతున్నారు. ఇంతకు ముందు కూడా దక్షిణాఫ్రికాఫ్రికాలోని జాతి వివక్ష ప్రభుత్వాన్ని అమెరికా చివరిదాకా సమర్థించింది. ఓ వైపున అంతర్జాతీయ సమాజం ఎన్ని విమర్శలు చేస్తున్నా అమెరికా ఈ పనే చేసింది. 1955 నుంచి 1975 దాకా వియత్నాం మీద అమెరికా దాడి చేసింది. డ్వైట్ డి.ఐసెన్ హోవర్ నుంచి రిచర్డ్ నిక్సన్ దాకా నలుగురు అమెరికా అధ్యక్షుల హయాంలో ఇదే దాడి కొనసాగింది. అప్పటి అమెరికా అధ్యక్షులు వియత్నాం మీద దాడిని "న్యాయమైన యుద్ధం", "సదుద్దేశం", "ఆఖరి ప్రయత్నం" అన్న చక్కెర పూత మాటలే చెప్పారు. ట్రంప్ మాత్రం తనకు మర్యాదపూరిత మాటలు చెప్పాల్సిన అవసరం లేదనుకునే వ్యక్తి. ఆయన పలస్తీనియన్లను అంతం చేయడాన్ని బాహాటంగానే సమర్థిస్తారు. అంటే ట్రంప్ నుంచి ఎదురయ్యే పరిణామాలేమిటో మనకు స్పష్టంగా తెలుస్తున్నాయి. దీనికి సంతృప్తి పడాల్సిందే.

తమ నగరాల మీదే ట్రంప్ యుద్ధం: మళ్లీ అధికారంలోకి వచ్చిన తరవాత ట్రంప్ తన పౌరుల మీద సైన్యాన్ని, భీకరమైన బలప్రయోగాన్ని వినియోగించారు.

"ప్రజాభద్రత, అత్యవసర పరిస్థితి" పేరున ఆయన దేశ రాజధాని వాషింగ్టన్ డీసీలో "జాతీయ రక్షణ దళాలను" ప్రయోగించారు. నేరాలను తగ్గించడానికి ఈ పని చేశామని ట్రంప్ చెప్తున్నప్పటికీ కొన్నేళ్లుగా అక్కడ నేరాలు తగ్గుతున్నాయి. ఆయన మెంఫిస్‌లోకి కూడా తమ బలగాలను పంపించారు. చికాగోలో కూడా అదే పని చేస్తామని ఆయన బెదిరిస్తున్నారు. వలస, కస్టమ్స్ నిబంధనలను అమలు చేయడానికి ఇదివరకే లాస్‌ఏంజెల్స్‌లో బలగాలను వినియోగించారు. ఈ నగరాలన్నీ ఆఫ్రికన్ అమెరికన్లు, హిస్పానిక్ జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలే. ట్రంప్ చర్యల వెనక ఉన్న జాతి వ్యతిరేకతను విస్మరించడం కుదరదు. స్వదేశీయులను నియంత్రించడానికి సైనిక బలగాలను వాడుకోవడం సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరం చేయడమే. పశ్చిమ దేశాలకు ఆశాకిరణమైన ప్రజాస్వామ్యం అంటే ఇదేనేమో! పౌరులపై అమెరికా ప్రభుత్వం సైన్యాన్ని లేదా పోలీసులను వినియోగించడం అమెరికాకు కొత్తేమీ కాదు. 2005లో కత్రీనా ఉత్పాతం వచ్చినప్పుడు అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో సైన్యం కాల్పులు జరిపి ఆఫ్రికన్-అమెరికన్ పౌరులను హతమార్చారు. జనం ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని డానిజెగర్ వంతెన దాటుతున్న సమయంలో సైన్యం జరిపిన కాల్పుల్లో అనేక మంది గాయపడ్డారు. దశాబ్దాలుగా అక్కడ ఆఫ్రికన్ అమెరికన్ల మీద హింసాకాండ కొనసాగుతూనే ఉంది. దీనికీ పసిపిల్లలు కూడా బలయ్యారు. తెల్లవారు కాని వారు కూడా ఇలాంటి హింసాకాండకే గురయ్యారు. జార్జ్ ఫ్లాయిడ్, ఎరిక్ గర్నెర్, సంద్రా బ్లాండ్, తమీర్ రైచు లాంటి వారందరూ ఈ హింసాకాండకు గురైన వారే. పోలీసుల బల ప్రయోగం నుంచి పౌరులను కాపాడే ప్రయత్నం చేస్తున్నామని మునుపటి అమెరికా అధ్యక్షులు ఊరట కలిగించడానికైనా చెప్పేవారు. ట్రంప్ పోలీసు బలగాలను సైనికీకరిస్తున్నారు.

విస్తరణవాద ఎజెండా: కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా మార్చేస్తామని, గ్రీన్‌లాండ్, చివరకు పనమా కాలవను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ బీరాలు పలికారు. ప్రస్తుతం సమాజంలో ఇవి అసాధారణమైన ప్రకటనలే. అమెరికా అవతరణే అత్యంత ఆశ్చర్యకరమైంది. విస్తరణావాదం ఆ దేశ మూలుగల్లో ఉంది. అమెరికాలోని మూలవాసులను తుడిచిపెట్టే ప్రయత్నం చేశారు. మొదట యాత్రికులుగా, వర్తకులుగా వచ్చిన వారు 13 కాలనీలు ఏర్పాటు చేసుకున్నారు. చివరకు అవి 50 రాష్ట్రాలైనాయి. ఇదంతా అనైతిక ఎత్తుగడలు, నియమోల్లంఘన, మూలవాసులను లక్ష్యపెట్టకుండానే జరిగింది. సుదూరంగా ఉన్న హవాయ్‌ని అదే రీతిలో కబళించి కేవలం 65 ఏళ్లు మాత్రమే అయింది. ప్రపంచమంతటా అమెరికా సైనిక స్థావరాలు ఏర్పాటు చేస్తూ ఉంటుంది. 80 దేశాల్లో అమెరికాకు 750 సైనిక స్థావరాలు ఉన్నాయి. పరాయి దేశాల్లో ఇన్ని సైనిక స్థావరాలున్న మరో దేశం లేదు. అందువల్ల ట్రంప్ బీరాలు పలకడానికి ఎల్లలు లేని అమెరికా విస్తరణవాదానికి భిన్నమైందేమీ కాదు. ఎలాన్‌మస్క్ లాంటి వారికి ఇదంతా అంగారక గ్రహాన్ని ఆక్రమించుకోవడం లాంటిదే. ఇతర గ్రహాల విషయంలోనూ అమెరికాది విస్తరణవాదమే.

ప్రభుత్వాలు పడదోయడం: వెనిజులా, ఇరాన్‌లో ప్రభుత్వాలను మార్చడంలో ట్రంప్ దాహం ఎన్నటికీ తీరనిది. ఇరాన్ అణుకేంద్రాల మీద నేరుగా దాడి చేయడానికి ట్రంప్ సకల నియమాలనూ ఉల్లంఘించారు. వెనిజులా పౌరులను అంతర్జాతీయ సముద్ర జలాల్లో హతమార్చారు. ఇలాంటి దుస్సాహసాలు అమెరికాకు కొత్తేమీ కాదు. ఒబామా లాంటి వ్యక్తి హయాంలోనూ విదేశాల నుంచి తమ పౌరులని అమెరికా తీసుకొచ్చేసింది. జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో "మానవ విధ్వంసక ఆయుధాలు" ఉన్నాయన్న నెపంతో ఇరాక్ మీద అమెరికా దండయాత్ర చేసింది. ఈ విషయం ఇంకా స్మృతిలోనూ ఉంది. లిండ్ సన్ ఓ రూర్కె రాసిన "కోవర్ట్ రెజీం చేంజ్: అమెరికాస్ సీక్రెట్ కోల్డ్ వార్" గ్రంథంలో 1947 నుంచి 1989 మధ్య కనీసం 64 దేశాలలో ప్రభుత్వాలను కూల్చేశారని రాశారు. అంటే మొత్తం ప్రపంచంలో మూడోవంతు దేశాలలో అమెరికా ప్రభుత్వాలను పడదోసింది. అయితే ట్రంప్ ఏలుబడిలో రహస్యంగా ప్రభుత్వాలను దించేయాల్సిన అవసరమే ఉన్నట్టు లేదు. ఆయన ప్రసంగాల ద్వారా చిటెకలో ఈ పని చేసేస్తున్నారు. ఇలాంటి ఉదంతాలను బయటికి లాగడానికి రహస్య సమాచారాలను వెలికి తీసే వికీలీక్స్ అవసరం ఇప్పుడు ఎంతమాత్రం లేదు. ఆయన మంత్రివర్గ సహచరులు కూడా ప్రభుత్వాలను పడదోయడానికి బాగా ఉబలాట పడ్తున్నారు. విదేశాంగ మంత్రి మార్కో రుబియో, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇదే ఆత్రుత ప్రదర్శిస్తున్నారు. రక్షణ శాఖ పేరును ట్రంప్ యుద్ధ విభాగంగా మార్చేశారు. అంటే అమెరికా పోషిస్తున్న దుష్ట పాత్రను నిజాయితీగా అంగీకరిస్తున్నారన్న మాట.

ఈ విషయంలో అమెరికా ఇప్పటికే పరాకాష్టకు చేరుకుంది. ఇటీవల చైనా పురోగమనాన్ని ట్రంప్ జీర్ణించుకోలేక పోతున్నారు. అనేక ధృవాల ప్రపంచాన్ని ట్రంప్ సహించడం లేదు. సుంకాల విధింపునకు చైనా భయపడడం లేదని ఇటీవల జరిగిన షాంఘై సహకార సంఘ సమావేశంలో చైనా తెగేసి చెప్పింది. విజయోత్సవం రోజు చైనా ప్రదర్శించిన సైనిక బల ప్రదర్శనను చూస్తే ప్రపంచ గమనం మారిపోతోందని అర్థం అవుతోంది. వలస వచ్చే వారిని నిరోధించడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు చూస్తే వలస వచ్చిన వారి స్వేదం, చాకిరీవల్లే అమెరికా అంతర్జాతీయ శక్తి కాగలిగిందన్న వాస్తవాన్ని దాచేస్తున్నారు. గత 250 ఏళ్లుగా అక్రమంగానో, సక్రమంగానో వలస వచ్చిన వారి శ్రమతోనే అమెరికా ఈ ఆధిపత్య స్థాయికి చేరుకుంది. అంతర్గత, బహిర్గత శత్రువులతో ట్రంప్ ఘర్షణ పడే ధోరణి అమెరికాకు మేలుచేయదు. ప్రస్తుత పరిస్థితి ఒక్క అమెరికా కోసమే కాదు మొత్తం ప్రపంచానికే ఎగుడు దిగుళ్ల ప్రయాణం. ఇందులో కనిపిస్తున్నదల్లా అమెరికా ఆధిపత్యం క్షీణించడమే.

నిష్పక్షపాత జర్నలిజానికి నిలువెత్తు నిదర్శనం జార్జ్

కృష్ణ కాసూరి

భారతీయ జర్నలిజంలో ఒక శకం ముగిసింది. దేశ పత్రికా రంగాన్ని ఏడు దశాబ్దాలకు పైగా తన నిర్మొహమాటమైన, సూటి వ్యాఖ్యానంతో సుసంపన్నం చేసిన దిగ్గజ జర్నలిస్ట్ టీజేఎస్ జార్జ్ (97) (థయిల్ జేకబ్ సోని జార్జ్) పరమపదించారు. ఆయన మరణం భారతీయ పత్రికారంగానికి తీరని లోటు. కేవలం వార్తలను నివేదించడమే కాకుండా, తన సూక్ష్మ పరిశీలన, నిప్పులాంటి నిజాయితీతో దేశంలోని మేధావులను, సామాన్య పాఠకులను ఆలోచింపజేశారు. పాత్రికేయ వృత్తి ఒక ధర్మం' అని నమ్మి, 'భయం ఎరుగని' కలంతో పాలకుల గుండెల్లో గుబులు రేపిన జార్జ్, తన 'పాయింట్ ఆఫ్ వ్యూ' కాలమ్‌తో తరాల పాఠకులను ఆలోచింపజేశారు. నిజానికి, ఆయనది కేవలం నివేదన కాదు; అది రాజీలేని నిబద్ధతతో కూడిన ఒక జీవనయానం. ఆయన మన మధ్య లేకపోయినా, ఆయన గీసిన 'సరళమైన, వంగని గీత' (Straight, Unbending Line) భావి జర్నలిస్టులకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం.

కేరళలో 1928లో జన్మించిన జార్జ్, మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో ఆనర్స్‌తో పట్టా పొంది, 1950లో ది ఫ్రీ ప్రెస్ జర్నల్తో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. ఆ తర్వాత ది సెర్చ్‌లైట్, ఫార్ ఈస్టర్న్ ఎకనామిక్ రివ్యూ వంటి జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో పనిచేశారు. హాంకాంగ్ కేంద్రంగా ప్రచురితమైన ప్రముఖ ప్రాంతీయ పత్రిక ఆసియావీక్ స్థాపక సంపాదకుడిగా ఆయన అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. 97 ఏళ్ల దీర్ఘజీవితంలో ఆయన కేవలం రాసిన వార్తలకే కాదు, నిబద్ధతతో రాసిన వ్యాసాలు సత్యానికి కూడా ప్రతీక అయ్యారు. మాట, మౌనం రెండింటికీ అర్థం తెలిసిన వృత్తి యోధుడు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత, ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో సంపాదకీయ సలహాదారుగా చేరిన జార్జ్, తన వారపు కాలమ్ "పాయింట్ ఆఫ్ వ్యూ" ద్వారా దశాబ్దాల పాటు లక్షలాది మంది పాఠకులను చేరుకున్నారు. 25 ఏళ్లకు పైగా, 1,300 కు పైగా సంచికలు విరామం లేకుండా కొనసాగిన ఈ కాలమ్, ఆయన నిజమైన స్వభావాన్ని ప్రతిబింబించింది. అవినీతి, సామాజిక అన్యాయం, మత అసహనం, ప్రజాస్వామ్య సంస్థలకు ఎదురయ్యే ముప్పు వంటి అంశాలపై ఆయన నిరంతరం నిర్మొహమాటంగా విమర్శలు గుప్పించారు. 'పాయింట్ ఆఫ్ వ్యూ' కేవలం అభిప్రాయం కాదు. అది ప్రజాస్వామ్యానికి ఒక హెచ్చరిక, పాలకులకు ఒక ప్రశ్నాస్త్రం. నరేంద్రమోదీకి అనుకూలంగా వ్యాసం రాయడానికి తిరస్కరించిన జార్జి ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు రాయబోనని చెప్పి విరమించుకున్నారు. మోదీ ప్రభుత్వం ఈ వ్యవహారం ఉందని అనేక మంది విశ్లేషకులు తెలిపారు.

జైలుకు వెళ్లిన సంపాదకుడు: టీజేఎస్. జార్జ్ నిర్భయ జర్నలిజానికి నిలువెత్తు నిదర్శనం. 1965 లో నాటి బీహార్ ముఖ్యమంత్రి కేబీ సహాయ్‌ని వ్యతిరేకిస్తూ రాసినందుకు ఆయన అరెస్టయ్యారు. స్వతంత్ర భారతదేశంలో దేశద్రోహం కేసులో జైలుకు వెళ్లిన తొలి పత్రికా సంపాదకులలో ఆయన ఒకరు. అప్పటి రక్షణ మంత్రి వీకే కృష్ణ మీనన్ స్వయంగా కోర్టులో ఆయన తరఫున హాజరుకావడం ఆయన నిబద్ధతకు లభించిన గౌరవం. ఎమర్జెన్సీ సమయంలో కూడా ధైర్యంగా నిలబడిన ఆయన, ప్రజాస్వామ్య విలువలకు రక్షకుడిగా మిగిలారు. 'భయం ఎరుగని' ఈ అనుభవాలను ఆయన తన జ్ఞాపకాల పుస్తకం ఘోషయాత్రలో నమోదు చేశారు. ఆయన జీవితం, పత్రికా స్వేచ్ఛ విలువను చాటిచెప్పే ఒక పాఠం, ఒక ధైర్య ప్రదర్శన.

అద్భుతమైన గ్రంథకర్త: జర్నలిస్టుగా మాత్రమే కాకుండా, జార్జ్ గొప్ప రచయితగా కూడా పేరు గాంచారు. రాజకీయ వ్యాసాల సంకలనం ది ఫస్ట్ రెఫ్యూజ్ ఆఫ్ స్కౌండ్రల్స్, పాలిటిక్స్ ఇన్ మోడర్న్ ఇండియా, కర్నాటక సంగీత విదుషీమణి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత చరిత్ర ఎం.ఎస్.: ఎ లైఫ్ ఇన్ మ్యూజిక్ వంటి రచనలు ఆయన మేధో పరిధిని, లోతైన పరిశోధనా దృష్టిని తెలియజేస్తాయి. కృష్ణ మీనన్, నర్గిస్, పోతన్ జోసెఫ్ వంటి ప్రముఖుల జీవిత చరిత్రలను రాసిన ఆయన, చైనా పరిణామాలపై విస్తృతంగా రాశారు. మలయాళంలో కూడా 'ఘోషయాత్ర', 'ఒట్టయాన్' వంటి రచనలు చేశారు. ఆయన రచనలు సరళంగా, సూటిగా, హృదయానికి హత్తుకునేవి; ప్రతి వాక్యం ఒక పాఠం. జార్జ్‌కు రాజకీయ రంగులు లేవు. ఆయన పక్షం ఒకటే నిజం పక్షం. రాజకీయ నాయకుల ద్వంద్వ నీతులపై, మతం పేరుతో మోసాలపై, అవినీతిపై, ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగించే ప్రతి శక్తిపై ఆయన కలం విరుచుకుపడింది. ఆయన రచనల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన 'ది ఫస్ట్ రెఫ్యూజ్ ఆఫ్ స్కౌండ్రల్స్: పాలిటిక్స్ ఇన్ మోడర్న్ ఇండియా' పుస్తకం ద్వారా భారత రాజకీయాల్లోని చీకటి కోణాలను నిర్భయంగా ఆవిష్కరించారు. దేవుడిపై విశ్వాసం లేని ఆయన, మానవత్వాన్ని దేవుడిగా చూశారు. భాషలో ఖచ్చితత్వం, విమర్శలో నిజాయితీ" ఆయన ప్రతి తరానికి నేర్పిన పాఠం.

గౌరవం – నిరాడంబరత: జార్జ్ సేవలకు గుర్తింపుగా 2011 లో భారత ప్రభుత్వం ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన పద్మభూషణ్ పురస్కారాన్ని అందించింది. అయినప్పటికీ, చివరి క్షణం వరకు ఆయన నిరాడంబరంగా, తన కలంతోనే జీవించారు. ఆయన తన చివరి కాలంలో కూడా జర్నలిజం విద్యను పెంపొందించేందుకు ఏషియన్ కాలేజ్ ఆఫ్ జర్నలిజం వంటి సంస్థలకు స్ఫూర్తిగా నిలిచారు. 2024లో వక్కం మౌలవి అవార్డు స్వీకరించినప్పుడు ఆయన భార్య అమ్ము జార్జ్ మరణంతో దుఃఖంలో ఉన్నప్పటికీ, అద్భుతమైన సమాధానంతో మాట్లాడారు. "జర్నలిజం అనేది వృత్తి కాదు, ఇది ఒక కర్తవ్యం" అని చెప్పారు. వృద్ధాప్యంలోనూ సాహిత్యం, ఆలోచన, పరిశీలన ఆయనకు ఊపిరి లాంటివి. 2025 అక్టోబర్ 3 న బెంగళూరులో ఆయన తుది శ్వాస విడిచారు. కానీ ఆయన చూపిన అచంచల రేఖ ఎప్పటికీ చెరగదు. ఆయన చివరి కాలమ్‌లో రాసిన ఈ మాటలు ఆయన జీవన సారాంశాన్ని తెలియజేస్తాయి: "ఒక దేశాన్ని, దాని పాలకులను ఏ మాత్రం విమర్శించకూడదని భావించడం సరికాదు ప్రత్యేకించి 'వార్తాపత్రికల మనుషుల' (newspaperwallahs) ద్వారా విమర్శ రావడం అవసరం."

టీజేఎస్ జార్జ్ మన మధ్య లేకపోయినా, ఆయన నిష్పక్షపాత జర్నలిజం, సంక్షిప్తత, అపారమైన ధైర్యం అనే లక్షణాలు యువ జర్నలిస్టులకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆయన కలం గీసిన గీత నిజాయితీ, కచ్చితత్వం, రాజీలేని నిబద్ధతతో కూడిన సూటి గీత భారతీయ జర్నలిజం చరిత్రలో చెరగని ముద్ర వేసింది. ఆయన మరణం ఒక యుగాన్ని ముగించినా, ఆయన ఆలోచనలు కొత్త తరాన్ని ముందుకు నడిపిస్తాయి.

సెల్ 7981305779

పచ్చని ఫలాల్లో కార్బైడ్ మంట

మన రోజువారీ జీవితంలో పండ్లు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమైనవి. ఇవి సహజంగా కాకుండా, రసాయనాలతో వేగంగా పండించినప్పుడు, మన ఆరోగ్యానికి శత్రువులుగా మారుతాయి. అందులో ముఖ్యంగా కాల్షియం కార్బైడ్ ఒకటి. ఒకప్పుడు రైతు, వ్యాపారస్తులు సహజంగా పండించే పండ్లు అమ్మేవారు. పండ్ల తోటల్లో డ్రమ్ముల కొద్దీ కార్బైడ్ లేదా పౌడర్లు ఉంటున్నాయి. రోజు వేల టన్నుల కొద్దీ పండ్లు కార్బైడ్‌లో లేదా మగాడనికి వాడే రసాయనాలలో అద్ది మార్కెట్‌కు తరలిస్తున్నా పట్టించుకునే వాడు లేదు. చట్టం ప్రకారం నిషేధితమైనప్పటికీ, కాల్షియం కార్బైడ్‌ని ఉపయోగించి కృత్రిమంగా పండించడం సాధారణమైంది. సహజంగా పండిన పండ్లు జీవరసాయన మార్పుల శ్రేణికి లోనవుతాయి - కణజాలాలను మృదువుగా చేయడం, రంగులో మార్పు, పులుపు తగ్గుదల, మంచి వాసన, తీపి అభివృద్ధి. ఈ ప్రక్రియ సహజ మొక్కల హార్మోన్ అయిన ఇథిలీన్ వాయువు ద్వారా నడుస్తుంది. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి, మార్కెటింగ్ కోసం పండ్ల దృశ్య ఆకర్షణను మెరుగుపరచ డానికి, వ్యాపారులు తరచుగా కృత్రిమంగా పండించే పద్ధతులను ఆశ్రయిస్తారు. కృత్రిమంగా పండించడంలో సాధారణంగా సహజ పండించే ప్రక్రియను అనుకరించడానికి ఎసిటిలీన్ లేదా ఇథిలీన్ వంటి హైడ్రోకార్బన్‌లను ఉపయోగించడం ఉంటుంది. ఇది పండ్లకు ఆకర్షణీయమైన రంగును ఇచ్చినప్పటికీ, వాటి అంతర్గత నాణ్యత, రుచిని దెబ్బతీస్తుంది. అత్యంత సాధారణమైన, ప్రమాదకరమైన పద్ధతి కాల్షియం కార్బైడ్ ను ఉపయోగించడం. పండ్ల మార్కెట్లలో "మసాలా" అని కూడా పిలిచే చౌకైన పారిశ్రామిక రసాయనం. ఆహార కల్తీ నివారణ నియమాలు, 1955, ఆహార భద్రతా ప్రమాణాల నిబంధనలు, 2011 కింద నిషేధించబడినప్పటికీ, కాల్షియం కార్బైడ్ దాని సులభమైన లభ్యత, తక్కువ ధర కారణంగా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. కాల్షియం కార్బైడ్ నీటితో చర్య జరిపినప్పుడు, అది ఎసిటిలీన్ వాయువును ఉత్పత్తి చేస్తుంది, ఇది ఇథిలీన్‌కు అనలాగ్‌గా పనిచేస్తుంది, ఇది అకాల పక్వానికి కారణమవుతుంది. అయితే, ఎసిటిలీన్ చాలా తక్కువ ప్రభావవంతంగా ఉంటుంది, చాలా ప్రమాదకరమైనది. రెండూ అత్యంత విషపూరిత పదార్థాలు. ఈ రసాయనం కేన్సర్ కారక లక్షణాలను కలిగి ఉంటుంది. భయంకరమైన ప్రమాదాలను గుర్తించి, ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 పండ్లను పండించడానికి కార్బైడ్ వాయువును ఉపయోగించడాన్ని నిషేదించింది . ఆహార భద్రత ప్రమాణాల నిబంధనలలోని సెక్షన్ 2.3.5 ప్రకారం ఎసిటిలీన్ వాయువును ఉపయోగించి కృత్రిమంగా పండించిన ఏదైనా పండ్ల అమ్మకం లేదా బహిర్గతం చేయడం స్పష్టంగా నిషేధితమే. ఉల్లంఘించిన వారికి చట్టంలోని సెక్షన్ 50 కింద 5 లక్షల వరకు జరిమానాలు, సెక్షన్ 59 కింద తీవ్రమైన కేసులలో జీవితాంతం జైలు శిక్ష విధిస్తారు. కాల్షియం కార్బైడ్‌తో కృత్రిమంగా పండించడం అనేది అనైతిక వాణిజ్య పద్ధతి మాత్రమే కాదు - ఇది ప్రజారోగ్యాన్ని నెమ్మదిగా విషపూరితం చేస్తుంది. సురక్షితంగా, సహజంగా పండిన పండ్లను నిర్ధారించుకోవడానికి అధికారులు, వ్యాపారులు వినియోగదారుల నుండి సమిష్టి అప్రమత్తత అవసరం.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

బంగారం మాయంపై
సిట్ దర్యాప్తు: హైకోర్టు

తిరువనంతపురం: కేరళలోని శబరిమల దేవాలయంలో ద్వారపాలకుల విగ్రహాలకు తొడిగిన బంగారు పూత పూసిన రాగి పలకల నుంచి బంగారం మాయమవడంపై ఆ రాష్ట్ర హైకోర్టు తాజాగా సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు విజిలెన్స్ బృందం తన ప్రాథమిక దర్యాప్తుపై మధ్యంతర నివేదిక సమర్పించిన అనంతరం న్యాయమూర్తులు జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కేవీ జయకుమార్లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. దర్యాప్తును గోప్యంగా నిర్వహించాలని, నివేదికను నేరుగా కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. 2019లో ద్వారపాలకుల విగ్రహాలకు ఉన్న బంగారు పూత పూసిన రాగి పలకలను తాపడం కోసం తొలగించారు. దీని కోసం స్పెషల్ కమిషనర్ నుంచి కానీ, కోర్టు నుంచి కానీ ముందస్తు అనుమతి తీసుకోలేదు. కనీసం సమాచారం ఇవ్వలేదు. అప్పుడు వాటి బరువు 42.8 కిలోలు. కానీ ఈ రాగి పలకలు చెన్నైలోని ఓ సంస్థకు చేరేసరికి వీటి బరువు 38.258 కేజీలు మాత్రమే ఉంది. అంటే 4.54 కేజీల బంగారం తగ్గిపోయింది. ఓ భక్తుడి ద్వారా వాటిని చెన్నైకి పంపడం వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై కేరళ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన, వివరణ లేని వ్యత్యాసం అని పేర్కొంది. వాస్తవానికి ఈ ద్వారపాలకుల విగ్రహాలను 1999లో 40 ఏళ్ల వారంటీతో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ, కేవలం ఆరేళ్లకే తాపడంలో లోపాలు తలెత్తడంతో మరమ్మతులు చేపట్టాల్సి వచ్చింది.

డ్రగ్స్ ఇచ్చి అత్యాచారం
ఎంబీబీఎస్ విద్యార్థిని ఫిర్యాదు

న్యూఢిల్లీ: ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని సహ విద్యార్థిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫ్రెండ్‌షిప్ పేరుతో హోటల్‌కు రప్పించి డ్రగ్స్ ఇచ్చి తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన దేశ రాజధాని ఢిల్లీలో జరిగింది. హర్యానాలోని జింద్‌కు చెందిన యువతి (18) ఢిల్లీలోని బాబా సాహెబ్ అంబేద్కర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. కాలేజీ హాస్టల్ క్యాంపస్‌లో ఆమె నివసిస్తోంది. తోటి మెడికల్ స్టూడెంట్ అయిన యువకుడు (20) గత నెల తొమ్మిదో తేదీన స్నేహం పేరుతో ఆదర్శ్‌నగర్‌లోని హోటల్‌కు తనను రప్పించాడని ఆ యువతి తెలిపింది. హోటల్ రూమ్‌లో తనకు మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. తన ఫొటోలు తీసి, వీడియో రికార్డ్ చేసి బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం వెతుకున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

ఎంజీఆర్ విగ్రహం ధ్వంసం
అన్నాడీఎంకే నేతల నిరసన

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం నియోజకవర్గంలోని అవనియాపురంలో ఈ సంఘటన జరిగింది. ప్రసిద్ధ జల్లికట్టు అరేనా సమీపంలో ఉన్న 3.5 అడుగుల ఎంజీఆర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. పీఠం నుంచి ఆ విగ్రహాన్ని పెకలించడాన్ని సోమవారం ఉదయం స్థానికులు గమనించారు. ఈ విషయం తెలుసుకున్న అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. కూలిన ఎంజీఆర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. ఈ సంఘటనపై నిరసన తెలిపారు. బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అవనియాపురం పోలీసులకు పార్టీ జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మరోవైపు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కే పళనిస్వామి (ఈపీఎస్) ఈ సంఘటనను ఖండించారు. ఎంజీఆర్ కీర్తి, విధానాలను ఎదుర్కోలేని వారు ఈ పిరికి చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. పోలీసులు నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మెట్రోలో ప్రయాణికుల కొట్లాట

న్యూఢిల్లీ: మెట్రో రైల్లో ఇద్దరు ప్రయాణికులు రెజ్లింగ్ తరహాలో పంచ్‌లు విసురుకున్న ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ మెట్రో కోచ్‌లో ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అదికాస్తా ఘర్షణకు దారితీసింది. ఇద్దరూ ఒకరినొకరు దూషించుకుంటూ కొట్టుకున్నారు. నెట్టడం, తోసుకోవడం, తన్నుకోవడం, పంచ్‌లు విసురుకోవడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఈ ఘటనతో రైల్లోని వారంతా ఒక్కసారిగా షాక్ అయ్యారు. తోటి ప్రయాణికులు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. ఈ తతంగాన్నంతా అక్కడే ఉన్న కొందరు తమ కెమెరాల్లో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేయగా... అదికాస్తా వైరల్‌గా మారింది. సీటు కోసమే ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

'ఇండియా'తో ఎన్డీఏకు దెబ్బేనా?

బీహార్ పోరులో బలం... అవకాశాలెంత?

పట్నా: బీహార్ శాసనసభ ఎన్నికల పోరు రసవత్తరంగా జరగనుంది. కేంద్ర ఎన్నికల సంఘం బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించడంతో ఉత్కంఠ ప్రారంభమయింది. రాష్ట్రంలో అధికార నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ), ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన మధ్య ప్రత్యక్ష పోటీ జరగనుంది. ఆర్‌జేడీ–కాంగ్రెస్ కూటమి నేతృత్వంలోని ఇండియా ఐక్య సంఘటనకు సంబంధించి బలాలు, బలహీనతలు, అవకాశాలు, ముప్పులను విశ్లేషిస్తే ఆసక్తికర అంశాలు అవగతమవుతున్నాయి. ముందుగా బలాలను పరిశీలిస్తే... ఆర్‌జేడీ దృఢమైన, నమ్మకమైన ముస్లిం–యాదవ్ (ఎంవై) ఓటు బ్యాంకు కలిగి ఉంది. ఇది దాదాపు 30 శాతం. ఆర్‌జేడీ వ్యవస్థాపకుడు లాలూ ప్రసాద్ వెనుక సీటు తీసుకోవడంతో పార్టీ తన కుమారుడు తేజస్వీ యాదవ్‌ను తిరుగులేని నాయకుడిగా నిలబెట్టింది. మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యువత విశేష ఆదరణ పొందారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ఓటరు అధికార్ యాత్ర రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరిచింది. ఇక బలహీనతలనూ పరికిస్తే... ఇండియా ఐక్య సంఘటనలో అతిపెద్ద భాగస్వామ్య పక్షమైన ఆర్‌జేడీని లాలు ప్రసాద్, తేజస్వీ యాదవ్, వారి కుటుంబ సభ్యులు నియంత్రిస్తున్నారు. ఈడీ దర్యాప్తు చేస్తున్న ఉద్యోగాల కోసం భూమి కుంభకోణం వంటి చట్టపరమైన వివాదాలలో చిక్కుకున్నారు. పార్టీ శ్రేణుల్లో తేజస్వికి ఆమోదం ఉన్నప్పటికీ... తేజ్ ప్రతాప్ యాదవ్, యాదవ్ కుటుంబంలోని ఇతర సభ్యులు విసిరిన కోపతాపాలు తరచుగా ఆర్‌జేడీ నేత వారసుడు పార్టీ, కూటమి భాగస్వాములను నడపడం కంటే తన కుటుంబాన్ని నిర్వహించడంపై ఎక్కువ దృష్టి పెట్టేలా చేశాయి. తేజస్వి వంటి యువ నాయకుడి నాయకత్వంలో ఆర్‌జేడీ ఉండటంతో ఇండియా ఐక్య సంఘటన తన ప్రతిష్ఠను మరింత ప్రదర్శించవచ్చు. రాష్ట్రానికి ఉద్యోగాల సృష్టి అవసరం పట్ల సున్నితమైన వ్యక్తిగా తనను తాను చూపించుకునే అవకాశాన్ని తేజస్వి ప్రదర్శిస్తున్నారు. వలసలు, శాంతిభద్రతల సమస్యను కూడా లేవనెత్తారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వేకు అధికార ఎన్డీఏ హక్కులు పొందినప్పటికీ... అన్ని అణగారిన వర్గాలకు కోటాల పెంపుతో కసరత్తు జరిగినప్పుడు ఆర్‌జేడీ అధికారాన్ని పంచుకుంది. దాని 'మండల్' ఆధారాలను అనుసరించి అది ఎన్నికలలో పట్టు సాధించవచ్చు. కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ వంటి సారూప్యత కలిగిన పార్టీలతో పొత్తు పెట్టుకోవడం, నితీశ్ కుమార్ ఎన్డీఏలోకి ఆకస్మికంగా తిరిగి రావడం వల్ల ఆర్‌జేడీ, దాని మిత్రపక్షాలు ముస్లిం ఓట్ల మొత్తాన్ని కూడగట్టడంలో సహాయపడవచ్చు. అయితే ముప్పు ఏమిటంటే, చాలాకాలంగా అధికారంలో లేనందున... పార్టీలో నాయకులను సరైన దారిలో నడిపించడం, కూటమిని ఐక్యంగా ఉంచడం ఇండియా కూటమికి సవాళ్లుగా నిలిచాయి.

వరద బాధిత రైతులకు పరిహారం
పంజాబ్‌లో రైతు సంఘాల డిమాండ్

చండీగఢ్: వరద బాధిత రైతులకు తక్షణ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం కిసాన్ మజ్దూర్ మోర్చా సోమవారం పంజాబ్‌లోని అనేక చోట్ల నిరసనలు నిర్వహించింది. రైతులు పంటలు కాల్చివేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నందుకు వారు తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, పంజాబ్ ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదల సమయంలో జరిగిన భారీ నష్టాలకు పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకుడు సర్వాన్ సింగ్ పాంధర్ అన్నారు. వరదల సమయంలో వరి పంట దెబ్బతిన్నందుకు ప్రభుత్వం ఎకరానికి కనీసం రూ.70 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 'దానిలో పది శాతం వ్యవసాయ కార్మికులకు ఇవ్వాలి' అని అమృత్‌సర్‌లో నిరసనకు నాయకత్వం వహించిన పాంధర్ అన్నారు. పశువులు, కోళ్ల పెంపకందారుల నష్టానికి 100 శాతం పరిహారం చెల్లించాలని కూడా పాంధర్ కోరారు. వరదల కారణంగా ఇళ్లు దెబ్బతిన్న వారికి పూర్తి పరిహారం ఇవ్వాలని, గోధుమ పంటను విత్తడానికి రాష్ట్ర ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల్లో పేరుకుపోయిన ఇసుక, బురదను తొలగించడానికి రైతులకు ఎక్కువ సమయం ఇవ్వాలని పాంధర్ కోరారు. హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ వాటి పరీవాహక ప్రాంతాలలో భారీ వర్షపాతం కారణంగా సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగడంతో పాటు కాలానుగుణంగా ప్రవహించే వాగుల కారణంగా పంజాబ్ దశాబ్దాలలో అత్యంత దారుణమైన వరదలను ఎదుర్కొంది. అంతేకాకుండా పంజాబ్‌లో భారీ వర్షాలు వరదల పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయి. పంట వ్యర్థాలను తగులబెట్టినందుకు రైతులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలను నిలిపివేయాలని పాంధర్ డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్‌లు చేస్తున్నారని, భూమి రికార్డులలో రెడ్ ఎంట్రీలు చేస్తున్నారని ఇవన్నీ ఆపాలన్నారు. కిసాన్ మజ్దూర్ మోర్చా పిలుపు మేరకు భారతీయ కిసాన్ యూనియన్ (ఏక్తా ఆజాద్), బీకేయూ (క్రాంతికారి), బీకేయూ (దోబా), కిసాన్ మజ్దూర్ హిట్కారి సభ వంటి ఇతర రైతు సంఘాలు కూడా నిరసనలో పాల్గొన్నాయి.

వరదలకు డీవీసీ తప్పిదమే కారణం

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: రాష్ట్రంలో సంభవించిన వరదలకు, ముఖ్యంగా ఉత్తర బెంగాల్‌లో తలెత్తిన దుర్భర పరిస్థితులకు దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డీవీసీ) కారణమంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వరదలను ఆమె మానవ నిర్మిత విపత్తుగా అభివర్ణించారు. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ ఎటువంటి సమన్వయం లేకుండా రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయడమే ఈ పరిస్థితికి కారణమని మమతా ఆరోపించారు. శనివారం నుంచి నమోదవుతున్న రికార్డు స్థాయి వర్షపాతం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న డార్జిలింగ్, చుట్టుపక్కల ప్రాంతాలలో డీవీసీ చేపట్టిన చర్యలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదలు, కొండచరియలు విరిగిపడిన కారణంగా మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి రూ. ఐదు లక్షల పరిహారం, ఒకరికి హోమ్‌గార్డ్ ఉద్యోగం ప్రకటించారు. డబ్బుతో ప్రాణ నష్టాన్ని పూడ్చలేమని, అయితే ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని ఆమె తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు బాగ్డోగ్రాకు బయలుదేరే ముందు కోల్‌కతా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన మమతా బెనర్జీ డీవీసీపై ఆరోపణలు చేశారు. జార్ఖండ్‌ను వరదల నుంచి రక్షించేందుకు డీవీసీ మైథాన్, పాంచెట్ రిజర్వాయర్ల నుంచి ఇష్టం వచ్చినట్లుగా నీటిని విడుదల చేసిందని, ఇది దిగువ ప్రాంతమైన బెంగాల్‌లో పరిస్థితిని మరింత దారుణంగా మార్చిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. కేవలం 12 గంటల్లో 300 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని. దీని కారణంగా హైవేలు, వంతెనలు, ఇళ్లు ధ్వంసమయ్యాయన్నారు. కాగా, డార్జిలింగ్‌లోని మిరిక్, సుఖియాపోఖ్రి, జోరెబంగ్లో, అలాగే జల్‌పాయ్‌గురి జిల్లాలోని నాగర్‌కట వరద ప్రభావిత ప్రాంతాలలో ఉన్నాయని పీటీఐ తెలిపింది. ఇప్పటివరకు ఉత్తర బెంగాల్ వరదలలో 23 మంది మృతి చెందారని మమత తెలిపారు. డార్జిలింగ్, మిరిక్, కాలింపాంగ్‌లలో 18 మంది, నాగర్‌కటలో ఐదుగురు మృతి చెందారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆమె అన్నారు. కాగా వరద ప్రభావిత జిల్లాల్లో చిక్కుకుపోయిన పర్యాటకులను తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం 45 బస్సులను ఏర్పాటు చేసింది. ఇప్పటికే దాదాపు 500 మంది పర్యాటకులను తరలించామని, మరో 250 మందికి సిలిగురిలో వసతి కల్పిస్తామని సీఎం తెలిపారు. డైమండ్ హార్బర్ నుండి తప్పిపోయిన ఒక వ్యక్తి మినహా మిగిలిన పర్యాటకులందరినీ రక్షించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. చిక్కుకుపోయిన పర్యాటకుల నుంచి డబ్బులు వసూలు చేయవద్దని, గదులు ఖాళీ చేయమని ఒత్తిడి చేయవద్దని హోటళ్లను ప్రభుత్వం ఆదేశించింది. ఆ ఖర్చులను తామే భరిస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది.

బీజేపీ ఎంపీపై రాళ్ల దాడి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర మాల్దా నియోజకవర్గ ఎంపీ ఖగెన్ ముర్మ తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఆయనపై రాళ్ల దాడి జరిగింది. వరద ప్రభావిత ప్రాంతం జల్‌పాయ్‌గురిలో బీజేపీ ప్రతినిధుల బృందం పర్యటిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఖగెన్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే శంకర్ ఘోష్ వరద సహాయం పంపిణీ చేస్తున్న సమయంలో దాడి జరిగింది. దాడికి ముందు బీజేపీ ప్రతినిధులను అడ్డుకునేందుకు 500 మందికిపైగా వ్యక్తులు రహదారులు దిగ్బంధించారు. 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. గాయపడిన ఎంపీ, ఎమ్మెల్యేకు స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందించారు. మరోవైపు ఈ ఘటనపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. 'బెంగాల్‌లో తృణమూల్ ఆటవిక రాజ్యం నడుస్తోంది' అని ఆ పార్టీ నాయకుడు అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటంతో అతలాకుతలమైన ప్రభావిత ప్రాంతానికి ఎంపీ వెళుతుండగా... తృణమూల్ గుండాలు దాడికి పాల్పడ్డారని అమిత్ మండిపడ్డారు. వరద బాధితులను ఆదుకోవడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

బీజేపీ పాలిత మహారాష్ట్ర
అన్నదాతల ఆత్మహత్యల్లో అగ్రస్థానం

న్యూఢిల్లీ: బీజేపీ పాలిత రాష్ట్రమైన మహారాష్ట్ర రైతు ఆత్మహత్యల్లో అగ్రస్థానంలో ఉంది. మోదీ ప్రభుత్వ విధానాల వల్ల రైతులు భంగపాటుకు గురవుతున్నారు. పంటలు సక్రమంగా పండకపోవడం, కష్టం కరిగించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, పెట్టుబడికి తెచ్చిన అప్పులను తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలు దీనికి బలం చేకూరుస్తోంది. ఎన్‌సీఆర్‌బీ తాజా లెక్కల ప్రకారం మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో రైతులు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఐదు రాష్ట్రాల్లో బీజేపీ పాలిత మహారాష్ట్రనే మొదటి స్థానంలో నిలిచింది. 2023లో రైతులు, వ్యవసాయ కార్మికులు 10,786 మంది ఆత్మహత్య చేసుకున్నారని నివేదిక పేర్కొంది. రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర 38.5 శాతం, కర్నాటక 22.5 శాతం మొదటి రెండుస్థానాల్లో నిలిచాయి. వ్యవసాయ రంగంలో 2023లో 10,786 ఆత్మహత్యల్లో 4,690 మంది రైతులు, 6,096 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. 2023లో ఆంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలు 8.6 శాతం, మధ్యప్రదేశ్ 7.2 శాతం, తమిళనాడు 5.9 శాతం మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రైతుల ఆత్మహత్యలే లేని రాష్ట్రాల జాబితాలో పశ్చిమబెంగాల్, బీహార్, ఒడిశా, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, మిజోరామ్, నాగాలాండ్, త్రిపుర, చండీగఢ్, ఢిల్లీ, లక్షద్వీప్ నిలిచాయి. అయితే ఈ ఎన్‌సీబీఆర్ డేటాను ఆల్ ఇండియా కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ ధావలే విమర్శించారు. ఈ నివేదికలో పశ్చిమబెంగాల్ రైతుల ఆత్మహత్యలే లేని రాష్ట్రంగా ఉంది. అది తప్పు. వాస్తవానికి ఆ రాష్ట్రంలో రైతుల ఆత్మహ్యలే ఎక్కువగా ఉన్నాయి అని చెప్పారు. వ్యవసాయ రంగంలో 2021–2022, 2023లో పదివేల మంది కంటే ఎక్కువమందే రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు నివేదికలున్నాయి. రైతుల ఆత్మహత్యలకు కారణం మోదీ ప్రభుత్వ విధానాలేనని ధావలే ఆరోపించారు. మహారాష్ట్రలో మరట్వాడా, విదర్భ ప్రాంతాల్లో పత్తి, సోయాబీన్ పంటల్ని అధికంగా పండిస్తారు. ఈ పంటల్ని పండించే రైతులే ఎక్కువమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గుతుంది. ట్రంప్ ఆంక్షల వల్ల కేంద్ర ప్రభుత్వం పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేసింది. దీనర్థం రాబోయే రోజుల్లో అమెరికన్ పత్తి భారత్‌కు దిగుమతి అవుతుంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో భాగంగా... మన దేశ వ్యవసాయం పూర్తిగా నాశనం అవుతుంది. అంతేకాదు డైరీ, వంట నూనెలపై కూడా తీవ్రంగా ప్రభావం పడనుంది అని అశోక్ ధావలే అన్నారు. వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా... మోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆయన దుయ్యబట్టారు.

దళితుడి హత్యకు సీఎం యోగీదే బాధ్యత

- రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- యూపీలో శాంతిభద్రతలు కుప్పకూలాయని మండిపాటు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలిలో ఓ దళిత వ్యక్తి హత్యకు గురవడంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సంఘటన రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయనడానికి నిదర్శనమని విమర్శించింది. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలని, దళితుడి హత్యపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తు చేపట్టాలని బాధితుడి కుటుంబానికి రూ.1 కోటి పరిహారం చెల్లించాలని, బాధితుడి కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసింది. రాయ్‌బరేలిలో హరియోమ్ అనే వ్యక్తిని దొంగగా భావించి హత్య చేసినందుకు ఐదుగురు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం... మానసికంగా అస్థిరంగా ఉన్న హరియోమ్... దండేపూర్ జమునాపూర్‌లోని తన అత్తమామల ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా... కొందరు అతడ్ని చుట్టుముట్టి... దొంగతనం చేయడానికి డ్రోన్‌లతో ఇళ్లను గుర్తించే ముఠాలో సభ్యుడని నిందించారు. అనంతరం అతడిని బెల్టులు, కర్రలతో కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గత 10 ఏళ్లలో ఉత్తరప్రదేశ్‌లో దళితుల అణచివేత పెరిగిందని, దళితుల హత్యలు, సామాజిక బహిష్కరణ సంఘటనలు జరిగాయని కాంగ్రెస్ ఎస్సీ విభాగాధిపతి రాజేంద్ర పాల్ గౌతమ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... "దేశంలో, బీజేపీ పాలిత ఐదు రాష్ట్రాలు దళిత అణచివేత కేసుల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. దళిత అణచివేత సంఘటనల్లో 75 శాతం ఈ ఐదు రాష్ట్రాల్లోనే జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లో ఇది 26.2%" అని ఆయన తెలిపారు. రాయబరేలీలో జరిగిన సంఘటనను ప్రస్తావిస్తూ... రాష్ట్ర ప్రభుత్వానికి దేశ రాజ్యాంగం, చట్టాలపై నమ్మకం లేదన్నారు. రాష్ట్రంలో కోర్టులు ,పోలీసుల అవసరం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్‌సిఆర్‌బీ నివేదికను ఉటంకిస్తూ... 2023లో దేశవ్యాప్తంగా దళితులపై 57,789 నేరాలు నమోదయ్యాయని... ఉత్తరప్రదేశ్‌లో, దళితులపై 15,130 నేరాలు జరిగాయని ఇది దేశంలోనే అత్యధికమని ఆయన పేర్కొన్నారు. రాయ్‌బరేలిలో జరిగిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయని స్పష్టం చేస్తోందని ఆయన అన్నారు. ఈ సంఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజీనామా చేయాలని గౌతమ్ డిమాండ్ చేశారు. బాధితుడి కుటుంబానికి యూపీ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం అందించడంతో పాటు అతడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఈ సంఘటనపై సిట్‌తో దర్యాప్తు చేసి, దోషులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

కటక్ బంద్ హింసాత్మకం: 8 మంది అరెస్టు

కటక్: ఒడిశాలోని కటక్‌లో సోమవారం జరిగిన హింసాకాండకు సంబంధించి పోలీసులు 8 మందిని అరెస్టు చేశారు. నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో భారీ భద్రతా మోహరింపు మధ్య 12 గంటల బంద్ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. విలేకరులతో పోలీసు కమిషనర్ ఎస్ దేవ్ దత్తా సింగ్ మాట్లాడుతూ ఆదివారం వీహెచ్‌పీ కార్యకర్తలు పోలీసులపై దాడి చేసిన కేసులో మూడు కేసులు నమోదు చేశామని, ఎనిమిది మందిని అరెస్టు చేశామని చెప్పారు. పరిస్థితి అదుపులో ఉందన్నారు. దాడిలో గాయపడిన 25 మందిలో పోలీసు ఉన్నతాధికారి అమరేంద పాండా, కటక్ డీసీపీ ఖిలారి రిషికేశ్ ద్యాండియో ఉన్నారు. పాండాను ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆసుపత్రిలో ఐసీయూలో చేర్చినట్లు అధికారులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా కొంతమంది దుండగులను గుర్తించిన తర్వాత నగరంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు కొనసాగుతున్నాయని పోలీసులు వివరించారు. దర్గాబజార్ ప్రాంతంలోని హాతి పోఖారి సమీపంలో శనివారం తెల్లవారుజామున నిమజ్జన ఊరేగింపులో బిగ్గరగా సంగీతం వినిపించడాన్ని స్థానికులు వ్యతిరేకించడంతో ఘర్షణలు చెలరేగాయి. మొదట్లో మొదలైన వాదన కొద్దిసేపటికే పెరిగి రాళ్లు, గాజు సీసాలు విసరడానికి దారి తీసింది. ఘర్షణల్లో ద్యాండేవ్ సహా ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు ఊరేగింపులపై దాడిని ఆపడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సోమవారం 12 గంటల బంద్‌కు పిలుపునిచ్చింది. ఆదివారం బంద్‌కు మద్దతుగా వీహెచ్‌పీ కార్యకర్తలు చేపట్టిన మోటార్ సైకిల్ ర్యాలీని పోలీసులు సమస్యాత్మక ప్రాంతానికి చేరుకున్నప్పుడు అడ్డుకున్నారు. దీంతో మళ్లీ హింస చెలరేగింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీచార్జ్, బాష్పవాయు గోళాలను, రబ్బరు బుల్లెట్లను ఉపయోగించారు. హింస సమయంలో గౌరీశంకర్ పార్క్ ప్రాంతంలోని అనేక దుకాణాలకు నిప్పు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన బంద్‌కు మిశ్రమ స్పందన వచ్చింది. కానీ ఎటువంటి సంఘటనలు జరగలేదు. నగరంలోని 20 పోలీస్ స్టేషన్ పరిధిలోని 13 ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల వరకు 36 గంటల పాటు నిషేధాజ్ఞలు విధించినట్లు అధికారులు తెలిపారు. సున్నితమైన ప్రాంతాలలో పోలీసు గస్తీ కొనసాగుతోందని, నగరంలోకి ప్రవేశించడానికి కూడా ఆంక్షలు విధించారు.

మీరు గోవాలో ఏం చేస్తున్నారు
రష్యా మహిళ కేసులో సుప్రీం

న్యూఢిల్లీ: కర్నాటకలోని గోకర్ణ గుహలో రహస్య జీవనం సాగిస్తూ కనిపించిన రష్యా మహిళ కేసులో సుప్రీం కోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆమె ఇద్దరు పిల్లలకు తండ్రిగా చెబుతున్న వ్యక్తిపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిల్లలు గుహలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. గోకర్ణ గుహలో రహస్యంగా జీవించిన నైనా కుటినా (40), తన ఇద్దరు కుమార్తెలు ప్రస్తుతం పోలీసుల సంరక్షణలో ఉన్నారు. తన భర్త ఇజ్రాయిల్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అని ఆమె వెల్లడించారు. ఆ కుమార్తెల తండ్రిని తానేనని, వారిని రష్యాకు తరలించొద్దని ఇజ్రాయిల్ దేశస్థుడు గోల్డ్‌స్టిన్ ఇటీవల సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సుప్రీం విచారణ జరిగింది. 'వాళ్లు గుహలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారు. ఈ దేశం అందరికీ స్వర్గధామంగా మారింది. ఎవరైనా వచ్చి ఇక్కడ ఉండిపోచ్చని అనుకుంటున్నారు' అని అసహనం వ్యక్తం చేసింది.

జైలులో రౌడీషీటర్ జన్మదిన వేడుకలు

బెంగళూరు: అతడో రౌడీషీటర్. ఓ హత్య కేసులో బెంగళూరులోని పరప్పన్ అగ్రహార్ సెంట్రల్ జైల్లో ఉంటున్నాడు. చాలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు... నిత్యం ప్రహరా ఉండే జైలులో ఓ రౌడీషీటర్ గొప్పగా పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రౌడీషీటర్ శ్రీనివాస అలియాస్ గుబ్బచ్చి సినా ఓ హత్య కేసులో నిందితుడు. అతనికి సహచర ఖైదీలంతా పుట్టినరోజు వేడుకలు చేశారు. యాపిల్ కాయలు కలిగిన ఒక దండను మెడలో వేసి ఈలలు, కేరింతలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. పెద్ద కత్తితో రౌడీషీటర్ కేక్ కట్ చేశాడు. ఈ దృశ్యాలను సహచర ఖైదీలు మొబైల్‌లో షూట్ చేశారు. ఈ దృశ్యాలు ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, యూట్యూబ్, వాట్సాప్‌లో వైరల్‌గా మారాయి. అయితే ఈ వీడియోను ప్రత్యర్థి భార్య సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లుగా తెలుస్తోంది. దీంతో జైలు శాఖ, పోలీసు శాఖ అప్రమత్తమైంది. వాస్తవంగా జైల్లో ఖైదీలకు మొబైల్స్ అనుమతి ఉండదు. బర్త్ డే వేడుకలు కూడా జరుపుకోవడానికి అనుమతి ఉండదు. అలాంటి జైల్లో ఇంత గొప్పగా వేడుకలు ఎలా జరుపుకున్నారని అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఈ వేడుకలు చాలా రోజుల కిందట జరిగినా... అసలు ఇలా జరుపుకోవడానికి పోలీసులెవరు సహకరించారని అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్ఓ హరిప్రియ, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (61) ఫిర్యాదులు అందాయ న్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో మాజీ కార్పొరేటర్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 18వ డివిజన్లో నిర్మితమైన ఇందిరమ్మ ఇల్లు సోమవారం ఉదయం గృహప్రవేశ పూజా కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శైలజ, సీనియర్ నాయకులు రాపోలు రాములు, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్, చీరాల నరసింహ, నాయకులు పోగుల వీర రెడ్డి, హరినాథ్ రెడ్డి, గుర్రాల వెంకటేష్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీఐ నరసయ్య

విశాలాంధ్ర - కొత్తూరు: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కొత్తూరు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం సిఐ జీ నర్సయ్య సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నియమ, నిబంధనలను పాటించాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా మల్లాపూర్, మల్లాపూర్ తాండ, గూడూరు, తీగాపూర్, మక్తగూడ, చింతగట్టు తండాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఇదివరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవంచానియ సంఘటనలు చోటు చేసుకోకుండ పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, సిబ్బంది గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ చోరీని అరికట్టాలి...

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ అగ్రనేత, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు నిదర్శనంగా దేశవ్యాప్తంగా "వోట్ చోరీ వ్యతిరేక కార్యక్రమం"ను కాంగ్రెస్ పార్టీ ఘనంగా నిర్వహిస్తోందని, అందులో భాగంగా తెలంగాణా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని, ప్రతి ఓటు పవిత్రమైనదని, ప్రజల హక్కులను హరించే ఓటు చోరీ వంటి చర్యలను అరికట్టాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే ఓటు హక్కు కాపాడబడాలని, ప్రతి పౌరుడు తన ఓటును స్వేచ్ఛగా వినియోగించే హక్కు కలిగి ఉన్నాడని, ప్రజల్లో అవగాహన కల్పించే ర్యాలీలు, చర్చావేదికలు బహిరంగ సభల ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించలని, ప్రజల ఓటు విలువను మోసం చేసే ఏ చర్యకూ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళా నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నూతన పాఠశాల భవనాన్ని శాసనసభ్యులు ఎమ్మెల్సీతో కలసి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగానికి అత్యంత ప్రాధాన్యతిస్తుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఎర్రమంజిల్‌లో ప్రభుత్వ నూతన పాఠశాల భవనాన్ని స్థానిక శాసనసభ్యులు దానం నాగేందర్, ఎమ్మెల్సీ రియాజుల్ హాసన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిలతో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎర్రమంజిల్‌లో కార్పొరేట్ స్థాయికి దీటుగా రూ. 7.7 కోట్లతో నూతన పాఠశాల నిర్మించి ప్రారంభించుకోవటం శుభపరిణామమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇంత గొప్ప పాఠశాలల ఎర్రమంజిల్‌లో అనుకున్న సమయానికి పూర్తిచేయడంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ప్రత్యేక శ్రద్ధ అలాగే మెగా సంస్థ యాజమాన్యం కృష్ణారెడ్డి, నిర్వాహకులని మంత్రి అభినందించారు. అదే విదంగా పాఠశాలలోని అన్ని గదులను ఏసీ క్లాస్ రూమ్స్‌గా మార్చేందుకు చర్యలు చేపట్టాలని అలాగే స్మార్ట్ డిజిటల్ క్లాస్ రూమ్‌లుగా మార్చేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని ఆ దిశగా పాఠశాల ఆవరణలో ఉన్నటువంటి ఖాళీ స్థలాన్ని క్రీడా ప్రాంగణంగా సిద్ధం చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. పేద పిల్లలు ఉన్నతమైన విద్యాబోధన అందించే దిశగా ప్రభుత్వం ఒక లక్ష్యంతో ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను చేపట్టనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. అదే విధంగా దాదాపు రూ. 17.00 కోట్లతో నిమ్స్ ఆవరణలో వైద్య భవనాల విస్తరణ పనులు ఈ డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచటం జరిగిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అలాగే కార్డులో ఉన్న ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యాన్ని అందిస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించుకున్న పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎం.పి నిధుల నుండి రూ.25 లక్షలు కేటాయించునున్నట్లు తెలిపారు. నూతన పాఠశాల కార్పొరేట్ స్థాయికి దీటుగా చేపట్టటంతో విద్యార్థి పోటితత్వంతో చదివి ప్రతి ఒక్కరూ అత్యున్నత మార్కులు సాధించాలని అన్నారు. స్థానిక శాసనసభ్యులు దానం నాగేందర్ మాట్లాడుతూ నూతనంగా చేపట్టిన పాఠశాల భవనం ప్రారంభించుకోవడంతో హైదరాబాద్ నగరంలోని ఒక మోడల్ స్కూల్‌గా నిలుస్తుందని అలాగే వేగవంతంగా చేపట్టినటువంటి పనులలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ప్రత్యేక కృషి ఎంతో ఉందని ఈ పాఠశాలలోని అన్ని తరగతి గదులను డిజిటల్ క్లాసులుగా మార్చాలని జిల్లా కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు విద్యుత్‌తో పాటు క్రీడల్లో రాణించే విధంగా అసలు ఆవరణలో క్రీడా ప్రాంగణాన్ని త్వరలో చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, డిజిటల్ క్లాసుల ద్వారా మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని అన్నారు. అలాగే అన్ని పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలు అందించటం అన్ని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ లింగారెడ్డి, చీఫ్ ఇంజనీర్ బిల్డింగ్స్ రాజారెడ్డి, ఈఈ ఎలక్ట్రికల్ శ్రీనివాస్, డిఇఓ ఆర్ రోహిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలను నోడల్ అధికారులు, పోలింగ్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో పోలీస్ అధికారులు, ఎంపీడీవోలు, ఎన్నికల నోడల్ అధికారులు, అడిషనల్ కలెక్టర్లతో కలిసి జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ ప్రక్రియ, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. మండల స్థాయి ఎన్నికల అధికారులు ఒక టీం గా ఏర్పడి సమన్వయంగా పనిచేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సభలు, ర్యాలీలు సమావేశాల కొరకు అనుమతి పొందాల్సి ఉంటుందని సంబంధిత సమాచారాన్ని ఖర్చుల పర్యవేక్షణ బృందానికి అందించనట్లైతే నిబంధనలకు లోబడి ఖర్చుల పరిశీలన చేస్తారని అన్నారు. సరైన అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించకూడదని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీం, స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీంలు, ఆయా టీంలలో పోలీసు శాఖ సిబ్బంది తప్పని సరిగా ఉండాలని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు ప్రొసైడింగ్, సహాయ ప్రొసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్, బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్ ఇతర ఎన్నికల సంబంధిత ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నిక ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. పోలీసుశాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడం జరుగుతుందని డిసిపి సునీతారెడ్డి తెలిపారు. అడిషనల్ డిసిపిలు సమస్యాత్మక గ్రామాలను త్వరలో గుర్తించి తగిన విధంగా బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, సైబరాబాద్ పోలీస్ శాఖ అడిషనల్ డీసీపీలు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, అబ్కారి శాఖ సుపరిడెంట్లు కృష్ణప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, రెవెన్యూ డివిజినల్ అదికారులు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మాచార హక్కు చట్టం -2005 వారోత్సవాలలో భాగంగా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో జిల్లా, డివిజన్, మండల స్థాయి కార్యాలయాల వారిగా అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాలలో భాగంగా ఈనెల 5 నుండి 12వ తేది వరకు సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో అన్ని కార్యాలయాలలో, మున్సిపల్ కమీషనర్ కార్యాలయాలలో ఈ అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ప్రజలకు సమాచార హక్కు చట్టం గురించి తెలియ జేయడమే కాకుండా, ఈ చట్టాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలి, చట్టం వల్ల కలిగే ప్రయోజనం గురించి ప్రజలలో పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సోమవారం జీహెచ్ఎంసీ వ్యాప్తం గా నిర్వహించిన ప్రజావాణి' కి మొత్తం 157 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంకు మొత్తం 157 విన్నపాలు రాగా, జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 87 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్‌పల్లి జోన్‌లో 31, సికింద్రాబాద్ జోన్‌లో 22, శేరిలింగంపల్లి జోన్‌లో 14, ఎల్బీనగర్ జోన్‌లో13, చార్మినార్ జోన్‌లో 7 ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 70 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 32, ఇంజనీరింగ్ 26, రెవెన్యూ 5, హెల్త్ అండ్ శానిటేషన్ 3, యు.బి.డి 2, యు.సి.డి, స్పోర్ట్స్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించిన జిహెచ్ఎంసి అధికారులు సత్వర పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, వేణు గోపాల్, సుభద్ర దేవి, అలివేలు మంగతాయారు, సిసిపి శ్రీనివాస్, మెయింటెనెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, ఇరిగేషన్ సిఈ నిత్యానంద, అడిషనల్ సిసిపిలు ప్రదీప్, రంజిత్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి ప్రజావాణిలో అందచేసిన దరఖాస్తులను సత్వరమే అధికారులు స్పందించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి సూచించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు కదివన్ పలని, జి. ముకుంద రెడ్డిలు పాల్గొని ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు శాఖల వారీగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. వికలాంగులు, వయోవృద్ధులు వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అదే విధంగా ప్రజల సమస్యలను తెలుసుకుని, దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. సి.ఎం ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తుల పురోగతిపై ఆయన సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న ఆర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, సతర్వమే పరిష్కరించాలని సూచించారు. అలాగే జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అవరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్ లేకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణిలో 206 అర్జీలు అందగా అందులో హౌసింగ్ శాఖ 98, (2బిహెచ్‌కె-8, ఇందిరమ్మ ఇండ్లు 90), పెన్షన్స్ 26, రెవెన్యూ 46, ఇతర శాఖలు 36 ఫిర్యాదులు వచ్చాయని ఆయన తెలిపారు. ఈ ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి, హౌసింగ్ పి.డి. అశోక్ చక్రవర్తి, హైదరాబాద్ ఆర్డిఓ రామకృష్ణ, లా ఆఫీసర్ శ్రీధర్, సిపిఓ డాక్టర్. సురేందర్, ఎస్సీ, ఎస్టీ శాఖ సంక్షేమ అధికారులు కోటాజి, ప్రవీణ్, జి.ఎం ఇండ్రస్ట్రీస్ పవన్ కుమార్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఎ.ఓ విజయ లక్ష్మీ, జిల్లా సర్వే అధికారి శ్రీరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల వ్యతిరేక పిటిషన్‌ను

సుప్రీంకోర్టులో కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నాం



విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 9 ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో గోపాల్ రెడ్డి వేసిన పిటీషన్ ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నట్లు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలియజేశారు. బీసీలు తరతరాలుగా సాంఘిక ఆర్థిక రాజకీయ రంగాలన్నింట్లో తీరని అన్యాయానికి గురైనారని ఆవేదన వ్యక్తం చేశారు. "మేమెంతో మాకంతా" నినాదంతో బీసీ ఉద్యమాలు ఉధృతంగా జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించి బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ బిల్లులు శాసనసభలోఆమోదించి కేంద్రానికి పంపిస్తే కేంద్రం పెండింగ్లో పెట్టిందన్నారు. 50% రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేస్తూ శాసనసభ ఆమోదించి గవర్నర్ కి పంపిస్తే అది కూడా పెండింగ్లో ఉన్నదని ఈ పరిస్థితుల్లో జీవో నెంబర్ 9 ద్వారా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తే అగ్రకులాలకు చెందిన కొందరు వ్యతిరేకిస్తూ హైకోర్టులో, సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయడం దారుణమన్నారు. బీసీ బిల్లులు రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చకుండా బిజెపి బీసీలకు తీరని ద్రోహం చేస్తున్నదన్నారు. బిసి రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ కోర్టులో పిటిషన్లు వేయడం బీసీల హక్కులను కాలరాసే కుట్ర మాత్రమేనన్నారు. ఇప్పటికైనా వారు తమ బిసి వ్యతిరేక వైఖరి మార్చుకోకుంటే తగిన గుణపాఠం తప్పదని వెంకట్రాములు హెచ్చరించారు.

ఉప్పల్-నారాపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు సత్వరమే పూర్తి చేయాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: ఉప్పల్-నారాపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు సత్వరమే పూర్తి చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో సిపిఐఎం పార్టీ కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, జావీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభు తదితరులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేయడంతో పాటు ప్రజలకు ఆవసరమైన ఈ ప్రాజెక్టు ఆలస్యమవడం పట్ల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం, కోమటి రవి, చంద్రశేఖర్, ఎన్. సృజన, కర్రే జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పర్యటించిన కార్పొరేటర్ ప్రేం కుమార్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని తాళ్లబస్తి, ఇక్రిసెట్ కాలనీ ప్రాంతాలలలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్డు, డ్రైనేజీ, చెట్ల కొమ్మలు తొలగించాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ.ఈ సత్యలక్ష్మి, వర్కింగ్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, ఆర్టికల్చర్ వెంకటేష్, నాయకులు ఉమేష్ సింగ్, కిషోర్, స్థానికులు వెంకటరత్నం, అనురాధ, మైకేల్, కొండయ్య, నారాయణ, రామకృష్ణ, ఓం ప్రకాష్, శైలజ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయులకు అండగా విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రాష్ట్రంలోని ఎలాంటి ఆధారం లేని మహిళలు, నిస్సహాయులు ముఖ్యంగా పోలీసులు, కోర్టులు అంటే భయం ఉన్నవారికి విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ కన్వీనర్ కల్లె నాగరాజా గిరిప్రసాద్ శర్మ స్పష్టం చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ కో- కన్వీనర్ మామిళ్ళపల్లి విజయ్ కుమార్ కలిసి ఆయన మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కోర్టులు, పోలీస్ స్టేషన్‌లు అంటే భయం ఉంటుందని, అందుకోసమే వారికి ఉచిత న్యాయ సహాయం అందించడానికి తమ ట్రస్ట్ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.రియల్ ఎస్టేట్ కంపెనీలు చిట్ ఫండ్స్, ఆర్థిక మోసాలు, గృహింస లాంటి బాధితుల పక్షాన ప్రభుత్వానికి, పోలీసులకు ఫిర్యాదు చేయడం ట్రస్టు ప్రధాన లక్ష్యమని వివరించారు. బాధితులకు ఏమైనా న్యాయ సహాయం కావాలనుకున్నప్పుడు తమ ట్రస్ట్ సంప్రదించి వారికి జరుగుతున్న అన్యాయాలపై వినతి పత్రం అందజేయాలని కోరారు. ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై న్యాయ సలహా తీసుకొని ముందుకు సాగుతామని వెల్లడించారు. పూర్తి వివరాలకు 9701609689 నెంబర్ ను సంప్రదించాలని గిరిప్రసాద్ శర్మ విజ్ఞప్తి చేశారు.

జస్టిస్ గవాయిపై దాడిని ఖండించిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడి ఘటనను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తీవ్రంగా ఖండించారు. ఇది క్షణికావేశంలో జరిగిన దాడి కాదని, పథకం ప్రకారం కుట్రపూరితంగా చేసిన దాడి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సుప్రీంకోర్టు భారత రాజ్యాంగానికి కస్టోడియన్ అని, దాని ప్రధాన న్యాయ మూర్తిపై దాడి జరగడం అంటే రాజ్యాంగంపై దాడి చేసినట్టే అని ఆమె పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, దానిపై దాడి చేయడం భారత ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడులు దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీతక్క డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం మన అందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలను ప్రసాదించిందని, ఆ విలువలను కాపాడడం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఆమె పిలుపునిచ్చారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు తప్పదు: సిపి సజ్జనార్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ సోమవారం హైదరాబాద్ కమిషనర్ రేట్ పరిధిలోని మాదన్నపేట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ వ్యవస్థ పనితీరు, పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, పెండింగ్ కేసులు, క్రైమ్ డీటైల్స్‌ను సజ్జనార్ స్వయంగా పరిశీలించారు. బాధితులకు న్యాయం జరిగేలా పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. తనిఖీ అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన సీపీ మాట్లాడుతూ పోలీసింగ్ అంటే కేవలం చట్ట అమలు చేయడమే కాదు ప్రజలతో నమ్మకం కలిగించే విధంగా పనిచేయ డమే నిజమైన సేవని తెలిపారు. పారదర్శకత, క్రమశిక్షణ, సత్సంబంధాలు పోలీసుల ప్రతిష్ఠ ను పెంచుతాయని స్పష్టం చేశారు. సుదీర్ఘ విరామం తర్వాత యూని ఫాం వేసుకున్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి తమ దైన మార్క్‌ను చూపిం చడం ప్రారంభించారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడేవారికి స్ట్రాంగ్ వార్నింగ్‌లు ఇస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో మందుబాబు లకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గత నాలుగేళ్లుగా టీజీఎస్ఆర్టీసీ ఎండీగా పనిచేసిన సజ్జనార్.. ఇప్పుడు సీపీగా చార్జ్ తీసుకొని ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని డిసైడ్ అయ్యారు.మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ఉక్కుపాదం మోపుతామని.. ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే జైల్లో ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

వాహనాల తనిఖీలు చేపట్టిన పోలీసులు

విశాలాంధ్ర- కొత్తూరు: త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల దృశ్య సోమవారం కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాట్కో జంక్షన్ బైపాస్ రోడ్డుపై సీఐ జి నరసయ్య సిబ్బందితో కలిసి వాహనాలను ముమ్మర తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా వాహనాల పత్రాలతో పాటు ఇతర కార్యకలాపాలను పరిశీలించారు. ఈ తనఖీల్లో ఎస్ఐలు సత్యసిల రెడ్డి, గోపాలకృష్ణ, సిబ్బంది గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు దుర్మార్గం

విశాలాంధ్ర - బషీర్ బాగ్: హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు దుర్మార్గం అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నేతలు బుర్ర రాము గౌడ్, విజయ్ మల్లంగి, ఎంఏ. మజీద్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితమే విద్యార్థుల బస్సు పాసులు 30 శాతం 50 శాతం పెంచిన ప్రభుత్వం, మళ్లీ ఇప్పుడు హైదరాబాద్ ప్రజలపై మరోసారి బస్సు చార్జీలు పెంచి పేద మధ్యతరగతి కుటుంబాల సంపదను దోచుకుంటుందని మండిపడ్డారు. హైదరాబాద్, లిబర్టీ, ఆప్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 50 శాతం బస్సు చార్జీలను పెంచడం అంటే, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం పట్ల ఎటువంటి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతుందని విమర్శించారు. అధికారం లోకి వచ్చిన రెండు సంవత్సరాలకి సామాన్య ప్రజలను ఇన్ని ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు రాబోయే ఉప ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్తారని అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆమ్ ఆద్మీ పార్టీ పథకాన్ని కాపీ కొట్టి, ఒకవైపు మహిళలకు ఉచిత రవాణా అంటూ మరొకవైపు పురుషులపై విద్యార్థులపై చార్జీల పెంపు పేరిట ఆర్థిక భారాన్ని మోపడం దారుణమ న్నారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ మహిళలకు ఉచిత బస్సు రవాణా పథకం కల్పిస్తూ, పురుషులపై ఎటువంటి చార్జి పెంపుల భారం మోపలేదని వారు గుర్తు చేసారు. పెంచిన బస్ చార్జీలకు నిరసనగా

అందరివాడు గొడుగు యాదయ్య

విశాలాంధ్ర - మొయినాబాద్: ప్రస్తుత సమాజంలో తాను తన కుటుంబం బాగుండాలని ఆలోచించే వారే ఎక్కువగా కనిపిస్తారు. కానీ ఎన్ని పనులున్నా, సమస్యలు, ఒత్తిడీలు ఎన్ని ఉన్నా సరే తాను తన కుటుంబంతో పాటు సమాజం కూడా బాగుండాలని కోరుకునే వారు చాలా అరుదుగా కనిపిస్తారు. అలా అరుదుగా కనిపించిన వారిలో ఒకరే మొయినాబాద్ మండలం కేతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన గొడుగు యాదయ్య. ప్రజలు ఆర్థిక పరిస్థితుల కారణంగా , ఆసుపత్రి లేదా ఏ సమస్య తలెత్తిన నేను ఉన్నా అంటూ ముందుకు వచ్చి కృత నిశ్చయంతో ఆదు కుంటున్నాడు. ప్రజల సమస్యలకు నిరంతరం అండగా నిలుస్తూ వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తూ, ప్రజా సేవను తన ధ్యేయంగా చేసుకుంటూ, ప్రజల అభ్యున్నతి, ప్రాంత అభివృద్ధి పట్ల ఆయన చూపుతున్న కృతనిశ్చయత, సేవాభావం ప్రతిఒక్కరికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, భవిష్యత్తులో మరెన్నో సేవలు అందించి, ప్రజల ఆశీర్వాదాలతో మరింత ఉన్నత స్థాయిలో సేవ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రెవెన్యూ భూముల కేటాయింపులపై నివేదిక రూపొందించాలి

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు భూసేకరణ వేగవంతం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత 30-40 సంవత్సరాల నుంచి రెవెన్యూ శాఖ తరపున వివిధ అవసరాల కోసం ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు, వినియోగం, ప్రస్తుతం వాటి పరిస్థితి తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కోసం రెవెన్యూ విభాగం వేలాది ఎకరాల భూములను పలు విభాగాలకు ముఖ్యంగా ఇరిగేషన్, ఫారెస్ట్ శాఖలకు కేటాయించిందని అయితే రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టులలో మార్పులు చేర్పులు జరగడంతో పాటు కొన్ని రద్దుకూడా అయ్యాయని ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని లెక్కలు తేల్చాలని అధికారులకు సూచించారు. గడచిన 30 సంవత్సరాలలో అటవీ శాఖకు రెవెన్యూ శాఖ కేటాయించిన భూమి ఎంత, అదేవిధంగా అటవీ శాఖ రెవెన్యూ శాఖకు కేటాయించిన భూమి ఎంత అనే వివరాలను రెండు శాఖలు సమన్వయంతో ఒక నివేదికను తయారు చేయాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1138 ఎకరాల అటవీ భూమి కేటాయించేందుకు ప్రతిపాదించారని ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కేశవపురం త్రాగునీటి పథకం కోసం రెవెన్యూ శాఖ గతంలో అటవీశాఖకు 1030 ఎకరాల భూమిని కేటాయించింది. అయితే ఈ ప్రాజెక్ట్ రద్దయినందున సదరు భూమిని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు బదలాయింపునకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి, అటవీ పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, పీసీ సిఎఫ్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కళాసారథి కార్యకలాపాలపై మంత్రి సమీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు ఇవాళ ఆర్ట్ గ్యాలరీ సాంస్కృతిక కళాసారథి సంస్థల అధికారులతో మాదాపూర్ లోని ఆర్ట్ గ్యాలరీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్ట్ గ్యాలరీని సమర్థవంతంగా వినియోగించుకో వాల్సిన అవసరం ఉందని, దాని నిర్వహణను మరింత మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. ఆర్ట్ గ్యాలరీని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. చిత్రకారులు, కళాకారులు దీనిని మరింత సద్వినియోగం చేసుకునేలా, కళా ప్రియులు, ప్రజలు, పర్యాటకులు ఎక్కువగా సందర్శించేలా ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదర్శనలు, ఈవెంట్లు నిర్వహించాలని శిశానిర్దేశం చేశారు. సాంస్కృతిక కళాసారథుల గురించి మాట్లాడుతూ, వారి వేతనాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కళాకారుల సేవలకు గౌరవం ఇవ్వడం ప్రభుత్వ ధర్మమని తెలిపారు. అలాగే, కళాసారథి కార్యాలయంలో ఉన్న ఆడియో%-%వీడియో స్టూడియోలో సౌండ్ ప్రూఫింగ్ పనులను తక్షణమే చేపట్టాలని, అందుకోసం అవసరమైన కన్సల్టెంట్ నిపుణుడి సేవలను వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. అంతకుముందు మంత్రి జూపల్లి అర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కళాసారథి కార్యాలయాలను సందర్శించారు. ఈ సమీక్షలో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మీ, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నరసింహా రెడ్డి, సాంస్కృతిక కళాసారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ పాల్గొన్నారు.

బ్లాక్ స్థాయి అధికారుల రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ జాతీయ సంస్థ ఎన్ఐఆర్ డీపిఆర్ నీతి ఆయోగ్ సహకారంతో, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ ఏబిపిలో భాగంగా రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రాములను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డా. జి.నరేంద్ర కుమార్ ఐ.ఏ.ఎస్ డైరెక్టర్ జనరల్ ఎన్ఐఆర్ డీపిఆర్ ప్రారంభించారు. నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఆనంద్ శేఖర్ కార్యక్రమ లక్ష్యాలు దిశా నిర్దేశం వివరించారు. 2023లో నీతిఆయోగ్ ప్రారంభించిన ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన 500 బ్లాకులను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం కన్వర్జెన్స్ డేటా ఆధారిత ప్రణాళిక 40 సూచికల సంతృప్తి సాచురేషన్ విధానం ద్వారా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం ప్రారంభమైన ఈ రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలు బ్లాక్ స్థాయి అధికారుల సామర్థ్యాలను పెంచి కీలక పనితీరు సూచికలు సాధించడాన్ని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఉన్నాయి. అక్టోబర్ 6 నుండి ఎన్ఐఆర్.డీపిఆర్ దేశవ్యాప్తంగా ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక మౌలిక సదుపాయాలు, విద్య, సామాజిక అభివృద్ధి ఆర్థిక చేర్చు అనే ఐదు ప్రధాన రంగాలపై ఈ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ శిక్షణలు దేశవ్యాప్తంగా 9 కేంద్రాల్లో అక్టోబర్ 6 నుండి నవంబర్ 20, 2025 వరకు జరుగుతాయి. ప్రారంభ సభలో డైరెక్టర్ జనరల్ డా. జి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ లక్ష్యాలను స్థాయిమట్టంలో కార్యరూపంలోకి తీసుకురావడంలో ఫీల్డ్ అధికారుల పాత్ర కీలకమని అన్నారు. కన్వర్జెన్స్ ఇన్నోవేషన్ సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మాడ్యూల్స్ ఎన్ఐఆర్ డీపిఆర్ అధ్యాపకులు రూపొందించగా నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఆనంద్ శేఖర్యోగ్ సహకారంతో తుది రూపం పొందాయి. డా.ఆర్.అరుణ జయమణి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పి.కేశవరావు హెడ్ ఎన్ఐఆర్ డీపిఆర్ సమన్వయం చేస్తున్నారు.

డిజిపిను కలసిన ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రానికి నూతనంగా నియమితులైన డిజిపి బి. శివధర్ రెడ్డి ను సోమవారం ఐ.ఎన్.టి.యు. సి రాష్ట్ర ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి కలిశారు. అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డికి దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గోపాల్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ శాశ్వత ఉద్యోగుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కాలనీ చల్లూరు ప్రాంతంలో 220 ఎకరాల స్థలంలో నిర్మించనున్నారు. గజం ధర రూ.3,999 గా నిర్ణయించినట్లు తెలిపారు. డీటీసీపీ అనుమతులు పొందే ప్రక్రియలో ఉన్నామని, అన్ని పనులు వేగంగా కొనసాగుతున్నాయని, జీహెచ్‌ఎంసీ శాశ్వత ఉద్యోగులు కేవలం రూ.1 చెల్లించి సభ్యత్వం పొందవచ్చన్నారు. ల్యాండ్‌ను ప్రత్యక్షంగా చూపించడానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇతర శాఖల ఉద్యోగులకు ఇప్పటికే కాలనీలు ఉన్న నేపథ్యంలో, ఇప్పుడు జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల కోసం ప్రత్యేక కాలనీ ద్వారా సొంత గృహ సౌకర్యం కల్పించనున్నట్టు వెల్లడించారు.

భారత న్యాయవ్యవస్థకి ఒక మాయని మచ్చ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ ఒక పక్క విచారణ జరుగుతుండగా చెప్పు విసరడం అనేది అత్యంత బాధాకరమైన సంఘటన అని, లాయర్ కిషోర్‌ని తక్షణమే తన వృత్తి నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేసి యావ జీవకారాగార శిక్ష విధించాల్సిన అవసరం ఉందని బిహెచ్ఇఎల్ ఎస్సీ అసోసియే షన్ అధ్యక్షుడు సురేందర్ డిమాండ్ చేశారు. భారతదేశ అత్యున్నత న్యాయ వ్యవస్థను నడిపే అధిపతి చీఫ్ జస్టిస్ మాత్రమే, అలాంటి అత్యున్నత విలువ కలిగిన వ్యక్తి పైన నేడు ఒక న్యాయవాది అందరూ చూస్తుండగా చెప్పు విసరడం అనేది సహించరాని నేరంగా అభివర్ణించారు. ఈ ఘటనపైన తక్షణమే సుప్రీంకోర్టు స్పందించకపోతే, రాష్ట్రపతి సుమోటాగా కేసు తీసుకొని తక్షణమే అతనిపైన కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సురేందర్ కోరారు. అలా చేయని పక్షంలో రాబోవు రోజుల్లో న్యాయవాదులు ఎవరైనా చీఫ్ జస్టిస్ పైన చెప్పు విసరడమే కాకుండా చెప్పుతో కొట్టే ప్రమాదం కూడా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో కులం మతం ప్రాంతం ఏమి చూడకుండా తక్షణమే అతనిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయవ్యవస్థ విలువలను కాపాడాలని సురేందర్ డిమాండ్ చేశారు.ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చీఫ్ జస్టిస్ గవాయ్ పై జరిగిన ఈ ఘటనతో భారత దేశానికి, భారత న్యాయవ్యవస్థకి ఒక మాయని మచ్చగా మిగిలిపోతుందని సురేందర్ ఆందోళన వ్యక్తం చేశారు.

చింతల్‌లో చదరపు గజం భూమి రూ.1.14 లక్షలు

హాట్ కేకుల్లా అమ్ముడైన హౌసింగ్ బోర్డు భూములు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో మరోసారి రికార్డు స్థాయి ధరలకు కొనుగోలు చేశారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్ లోని నివాస భూముల విక్రయాల నిమిత్తం సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియలో చదరపు గజం భూమి ధర రూ.1,14,000 (లక్షా పధ్నాలుగు వేలు) పలికింది. 513 గజాల విస్తీర్ణంలోని హెచ్ఐజి ఓపెన్ ప్లాట్‌కు ఆఫ్ సెట్ ప్రైజ్ గా రూ.80 వేలు నిర్ధారించగా బహిరంగ వేలంలో చ.గజం రూ.1.14 లక్షలకు కొనుగోలు చేసినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. హెచ్ఐజిలోనే మరో 389 చ.గజాల విస్తీర్ణంలోని ఓపెన్ ప్లాట్ ను చదరపు గజానికి లక్ష రూపాయల ధర పలికిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మొత్తం 18 ఓపెన్ ప్లాట్లు, 4 ఫ్లాట్ల విక్రయానికి బహిరంగ వేలం వేయగా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.44.24 కోట్ల మేర ఆదాయం వచ్చింది. 27 మంది బిడ్డర్లు పాల్గొన్న ఈ వేలం పాటలో చదరపు గజానికి సగటున రూ.91,947 ధరకు కొనుగోలు చేశారని ఆయన తెలిపారు. కెబిహెచ్‌బి, గచ్చిబౌలి పరిసరాల్లోని భూములకే అధిక ధరలు పలుకుతున్న నేపథ్యంలో చింతల్ ప్రాంతంలో కూడా చదరపు గజం ధర లక్ష రూపాయలు దాటడం విశేషం. నగరంలోని అన్ని ప్రాంతాల్లో నివాస భూములకు మంచి డిమాండ్ ఉందనడానికి ఇది నిదర్శనమని అంటున్నారు.

మార్వాడి గో బ్యాక్ జేఏసీ చైర్మన్‌గా పిడమర్తి రవి



విశాలాంధ్ర - బషీర్ బాగ్ : తెలంగాణ రాష్ట్రంలో మార్వాడీలకు వ్యతిరే కంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా సోమవారం మార్వాడి గో బ్యాక్ జేఏసీ రాష్ట్ర కమిటీ నియామకం జరిగింది. మార్వాడి గో బ్యాక్ జేఏసీ చైర్మన్గా డాక్టర్ పిడమర్తి రవి ను 11 సంఘాల నాయకులు కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఈ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారస్తులు కొత్తగా షాపు పెట్టడానికి వీలులేదని అన్నారు. మార్వాడి తెలంగాణ రాష్ట్రాని కల్తీమయం చేశారని దానిని సమర్థవం తంగా ఎదుర్కొంటామని అన్నారు.దీపావళి తర్వాత రాష్ట్ర పర్యటన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా డాక్టర్ పిడమర్తి రవి, కో చైర్మన్ కరాటే శ్రీహరి, రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్ రాష్ట్ర ఉపాధ్యక్షు లు అందే కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ సన్నీ, పీ.రాములు నేత, డాక్టర్ మీసాల మల్లేష్, వైస్ చైర్మన్ గజ్జల మల్లికార్జున్, మాదు గుల నరసింహ, గుర్రం కోటేష్ రాష్ట్ర కార్యదర్శి మాదుగుల శివ, నక్క రమేష్,జోగు గణేష్, శ్రీనివాస్ గౌడ్, సూర్యారావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చాగంటి శేఖర్, సికింద్రాబాద్ కిషన్ యాదవ్, మహబూబ్న గర్ బుర్ర సురేష్, యూత్ ప్రెసిడెంట్ నక్క మహేష్, మహిళ అధ్యక్షు రాలు కోటగిరి ఉషారాణి, కన్వీనర్స్ శ్రీనివాస్ రెడ్డి కన్వీనర్ వరలక్ష్మి, ఓయూ జెఏసి అధ్యక్షులు ఎండి రహీంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

7న పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కాప్రా : వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 7న హైదరాబాద్ లో నిర్వహించే పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనను జయప్రదం చేయాలనీ సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో పాలస్తినా సంఘీభావ కరపత్రం నాచారం చౌరస్తాలోని షాప్ టు షాప్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ లిఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఆకాశం నుండి బాంబుల అగ్ని వర్షాన్ని కురిపిస్తూ, నరరక్త జీవనదిని చూస్తూ వికటాట్టహాసం చేస్తున్న వికృత విన్యాస నరహంతకులు బెంజిమోన్ నెతన్యాహూ, డోనాల్డ్ ట్రంప్ అని మండిపడ్డారు. 24 నెలల కాలంలో 65 వేల మంది ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకొని, కనీస యుద్ధ విలువలను పాటించకుండా తమ నరమేథాన్ని సాగిస్తూనే ఉండడం దుర్మార్గమన్నారు. తక్షణమే పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపాలని వారు డిమాండ్ చేసారు. తీవ్రంగా నష్టపోయిన పాలస్తీనా లోని గాజా ప్రజలను ప్రపంచ దేశాలు ఆదుకోవాలని వారు కోరారు. అక్టోబర్ 7న హైదరాబాద్ నగరంలో వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యలో భారీ స్థాయిలో పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించాలని నిర్ణయించామని, వి ఎస్ టీ నుండి ఇందిరా పార్క్ దాకా ప్రదర్శనను జరుగుతుందని, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఉప్పల మండల నాయకులు వి. రాజ్‌కుమార్, కే. శ్రీకాంత్ మేడ్చల్ జిల్లా ఏఐవైఎఫ్ నాయకులు, శేఖర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపుపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని మసీదు బండ కార్యాలయంలో ఈరోజు డివిజన్ కమిటీలు, మోర్చా కమిటీలు, బూత్ కమిటీలు శక్తి కేంద్రాల ఏర్పాటు, పూర్తి స్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం దిశగా ప్రతి బూత్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం అత్యంత ప్రాధాన్యతతో జరగాలి. ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలి. శక్తి కేంద్రాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న కేంద్ర పథకాల సమాచారాన్ని చేరవేయడం, కొత్త ఓటర్లను ఆకర్షించడం, ప్రతి డివిజన్‌లో సక్రమమైన సమన్వయంతో పని చేయడం అవసరం. ప్రతి బాధ్యతదారుడు సమయానికి లక్ష్యాలను చేరుకోవాలి. పార్టీ విస్తరణ కోసం క్రమబద్ధమైన ప్రణాళికతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, మూల అనిల్ గౌడ్, ఉపాధ్యక్షురాలు స్రవంతి, కార్యదర్శులు దుర్గాప్రసాద్, మాణిక్‌రావు, కోశాధికారి కృష్ణంరాజు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన నవీన్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ప్రభుత్వం చేపట్టిన మహిళా శ్రేయస్సు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని యూసఫ్ కూడా మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లో మూడవ రోజు కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ యాదవ్ స్వయంగా పర్యవేక్షించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి దశలోనూ సిబ్బందిని సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని సజావు గా కొనసాగించారు. ప్రతి మహిళా లబ్ధిదారికి కుట్టు మిషన్ సకాలంలో అందేలా చర్యలు తీసుకున్నారు. నవీన్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబులుగా మారే అవకాశం లభిస్తోంది. ప్రతి కుటుంబంలో ఒక మహిళా శక్తివంతం అయితే కుటుంబం అభి వృద్ధి దిశగా అడుగులు వేస్తుంది అన్నారు. కుట్టు మిషన్ పొందిన మహిళలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నవీన్ యాదవ్‌కి తమ కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ కార్యక్రమం తమ జీవితాల్లో కొత్త ఆశలను నింపిందని ఆనందం వ్యక్తం చేశారు.

హైకోర్టులో రెడ్డి జాగృతి పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : బీసీల పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 విడుదల చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రెడ్డి జాగృతి నాయకులు వాటిని అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు, హైకోర్టులలో పిటిషన్‌లు వేయడం సరికాదన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన బీసీ రిజర్వేషన్ల పెంపు హైకోర్టు, సుప్రీంకోర్టులలో కేసులు-భవిష్యత్ కార్యాచరణపై బీసీ సంఘాలు, మేధావులు, కుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జనాభాలో 5 శాతం లేని రెడ్డి సామాజిక వర్గం ఉద్యోగ, రాజకీయ రంగాలలో 90 శాతం పదవులు అనుభవిస్తున్నారని మండిపడ్డారు. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఎందుకు కడుపుమంట అని ప్రశ్నించారు. 24 గంటల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రెడ్డి జాగృతి నాయకులు హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరిం చుకోవాలని కోరారు. లేని పక్షంలో 2028 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క రెడ్డి అభ్యర్థిని గెలువకుండా పని చేస్తామన్నారు. ఈ నెల 8న హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల బిల్లు పై విచారణ ఉన్న నేపథ్యంల రిజర్వేషన్ల బిల్లుపై ఆమోద ముద్ర వేయాలని జాజుల కోరారు. 8వ తేదీన హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా పూలే, అంబేద్కర్ విగ్రహాల ఎదుట బీసీ సమాజం నిరసన తెలపాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీ నేతలు వి.జి.ఆర్. నారగోని, దాసు సురేష్, బీసీ నాయకులు మణిమంజీరి, కులకచర్ల శ్రీనివాస్, తారేశ్వరి పాల్గొన్నారు.

న్యాయమూర్తి గవాయ్‌పై న్యాయవాది దాడికి ప్రయత్నించడం దారుణం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ పై రాకేష్ కిషోర్ అనే న్యాయవాది కోర్టు హాలులోనే దాడికి ప్రయత్నించడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ ఏ ఎల్) ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఇది భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ పై దాడి అని అన్నారు. న్యాయమూర్తుల మనో స్థైర్యాన్ని దెబ్బతీయటం ద్వారా తీర్పులపై ప్రభావితం చేయాలని అనుకోవడం అత్యంత ప్రమాదకరం అని వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనలకు దేశంలో వాతావరణం ప్రేరేపించబడడం ఆందోళన కరమని అన్నారు. న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని, స్వతంత్రతను పరిరక్షించేందుకు ప్రభుత్వం, అన్ని రాజకీయ పార్టీలు, న్యాయవాదులు, పౌరులు తమ వంతు కర్తవ్యంగా నిలబడాల్సిన అవశ్యకతను ఈ ఘటన సూచిస్తున్నది అన్నారు.

జనవరినాటికి చెత్త రహిత రాష్ట్రం

స్వచ్ఛ సైనికుల కృషి అభినందనీయం

స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు అందజేసిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జనవరి 1వ తేదీ నాటికి ఆంధ్రప్రదేశ్‌ను చెత్త రహిత రాష్ట్రంగా మార్చనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ -2025 రాష్ట్రస్థాయి పురస్కార ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను విధించి... చెత్తను సకాలంలో తొలగించకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా తిరుమల సహా 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని చంద్రబాబు చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే చెత్త పన్ను రద్దు చేసి... అక్టోబర్ 2 లోపు మొత్తం 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఆ షెడ్యూల్‌ను పాటిస్తూ చెత్త తొలగింపులో విజయం సాధించినందుకు స్వచ్ఛ సైనికులను అభినందించారు. మిగిలిన 30 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను కూడా డిసెంబర్‌లోపు తొలగించి...

జనవరి 1 నాటికి చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. దేశంలో తొలిసారిగా 1998లో తాను క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. సింగపూర్‌లో క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రామ్‌ను అధ్యయనం చేసి... తర్వాత హైదరాబాద్‌లో నైట్ శానిటేషన్ ప్రోగ్రామ్‌ను అమలు చేసినట్లు చెప్పారు. పరిశుభ్రత అనేది అందరి బాధ్యత అని స్పష్టం చేస్తూ... విద్యార్థులను గ్రీన్ పాస్‌పోర్ట్ ద్వారా మొక్కలు నాటేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి నెల మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవంగా పాటిస్తున్నామన్నారు. సాలూరు ప్రాంతానికి చెందిన శానిటరీ వర్కర్ టోడు రాజు పరిశుభ్రత కాపాడటంలో చూపుతున్న అంకితభావానికి, పొడి-తడి చెత్త వేరు చేయాలన్న అవగాహన కల్పించడంలో చేసిన కృషికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మున్సిపల్ పరిపాలన మంత్రి డా. పి.నారాయణ, సమాచారశాఖమంత్రి కొలుసు పార్థసారధి, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ మాట్లాడారు. తరువాత స్వచ్ఛ సైనికులకు ముఖ్యమంత్రి పురస్కారాలు అందజేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మొత్తం 21 విభాగాల్లో 75 రాష్ట్రస్థాయి అవార్డులు, జిల్లాస్థాయిలో 1,257 అవార్డులను ప్రదానం చేసింది.

భారత్‌కు చీకటి దినం

- సీజేఐ గవాయ్‌పై బూటు దాడి ఘటన: మండిపడిన విపక్షాలు
- బీజేపీ, మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ విష ఫలితమేనని ఆరోపణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై సోమవారం ఒక న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించడానికి వీలు కల్పించిన ద్వేషపూరిత వాతావరణాన్ని బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ సృష్టించాయని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యురాలు సుప్రియా శ్రీనాటే ఈ దాడిని తీవ్ర రాజకీయ, సామాజిక క్షీణతలో భాగంగా అభివర్ణించారు. 'వీరు మతానికి స్వయం ప్రకటిత కాంట్రాక్టర్లు కాదు. వారు జాంబీలు. నా దేశాన్ని ఈ స్థితికి తీసుకురావడానికి ఒకే ఒక వ్యక్తి బాధ్యత వహించాలి. ఆయనే నరేంద్ర మోదీ. ఈ దేశంలోని అత్యున్నత న్యాయస్థానంలో అత్యంత సీనియర్ న్యాయమూర్తితో ఇలా జరుగుతుందని ఊహించుకోండి. ఇది మతఛాందసత్వం కాదు. ఇది పిచ్చితనం. అత్యున్నత న్యాయ సంస్థలో ఇలా జరగడం పూర్తిగా తప్పు' అని శ్రీనాటే అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ ఉప నాయకురాలు సాగరికా ఘోష్... ఆన్ లైన్ వాక్చాతుర్యానికి, ఆఫ్ లైన్ హింసకు మధ్య సంబంధాన్ని ఎత్తి చూపారు. 'బీజేపీ, దాని ఆన్ లైన్ ఐటీ సైన్యం పౌరులను విభజించే, హింసాత్మక భాష, అసహ్యకరమైన హ్యాష్‌ట్యాగ్‌ల ద్వారా వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని తీవ్రంగా ద్వేషించే సంస్కృతిని సృష్టించాయి. ఈ ఆన్ లైన్ హింస ఆఫ్ లైన్‌లో హింసాత్మక చర్యలకు దారితీస్తోంది. దుర్మార్గపు బీజేపీ ఐటీ సెల్ ఆన్ లైన్, ఆఫ్ లైన్ మధ్య రేఖను అస్పష్టం చేస్తోంది' అని ఘోష్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఇది 100 సంవత్సరాల ఆర్‌ఎస్‌ఎస్ ద్వేష విష ఫలితమని అన్నారు. సీజేఐ బి.ఆర్.గవాయ్ ప్రశాంతతను కాపాడుకున్నందుకు ప్రశంసించారు. 'సీజేఐ బి.ఆర్.గవాయ్ ప్రశాంతత భారతదేశ న్యాయవ్యవస్థ బలాన్ని ప్రతిబింబిస్తోంది. ద్వేషం మన సంస్థలను కదిలించడానికి ప్రయత్నించినప్పటికీ నిలబడటం. కానీ నిజాయితీగా ఉండండి. ఇది కేవలం ఒక వ్యక్తి పిచ్చి కాదు. ఇది 100 సంవత్సరాల ఆర్‌ఎస్‌ఎస్ ద్వేష విషం మనస్సులను క్షీణింపజేసి సంస్థల పట్ల గౌరవాన్ని బలహీనపరిచిన ఫలితం. ద్వేషం సాధారణమైనప్పుడు న్యాయం ప్రమాదకరంగా మారుతుంది. భారతదేశం గందరగోళం కంటే ప్రశాంతతను, ద్వేషం కంటే మానవత్వాన్ని ఎంచుకోవాల్సిన సమయం ఇది' అని ఠాకూర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ దీనిని 'చీకటి దినం' అని పిలిచారు. లోతయిన సామాజిక చిక్కులను ఎత్తి చూపారు. 'ఒక దళితుడు భారత ప్రధాన న్యాయమూర్తి అయ్యాడనే వాస్తవాన్ని వారు అంగీకరించలేకపోతున్నారు. ఇది బాబాసాహెబ్ అంబేద్కర్ కల. మన దేశంలో కులం, మతం పేరుతో ద్వేషం నాటబడిందని మేము తరచూ చెబుతున్నాము. ఇది దాని ఫలితం. వారు దళితులు, ముస్లింలను నిందిస్తారు. ప్రపంచంలో మనం ఒంటరిగా ఉన్నాము. మీరు విశ్వగురువు కావాలని కోరుకున్నారు. కానీ భారతదేశం తన స్నేహితులను కోల్పోయింది' అని మసూద్ అన్నారు. ఈ ఘటన సోమవారం సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఒక కేసు విచారణ సమయంలో చోటుచేసుకుంది. న్యాయవాది వేదిక వద్దకు వెళ్లి తన బూటను తీసివేసి ప్రధాన న్యాయమూర్తిపై విసిరేందుకు ప్రయత్నించాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

మత విద్వేషాలకు నాంది: విజయన్

తిరువనంతపురం: భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించిన ఘటనను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సీజేఐపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ ఆందోళనకరమైన ఘటన సంఘ్‌పరివార్ వ్యాప్తి చేస్తున్న మత విద్వేషాలను ప్రతిబింబిస్తోందని విమర్శించారు. ఈ ఘటనను వ్యక్తిగత చర్యగా తోసిపుచ్చడమంటే, పెరుగుతున్న అసహన వాతావరణాన్ని విస్మరించడమేనని అన్నారు. మతతత్వ మూఢత్వం సీజేఐని కూడా లక్ష్యంగా చేసుకోవడానికి ధైర్యం చేసిందంటే... ఇది విభజన, విషపూరిత రాజకీయాల తీవ్రమైన ప్రమాదాన్ని బహిర్గతం చేస్తోందని, వాటిని నిస్సందేహంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ ద్వేషపూరిత విషం ఫలితం: ఠాగూర్

ఆర్‌ఎస్‌ఎస్ ద్వేషపూరిత విషం ఫలితమే సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడి జరగడానికి కారణమని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ అన్నారు. ఈ చర్యతో ఆర్‌ఎస్‌ఎస్ అత్యున్నత సంస్థల పట్ల ఉన్న గౌరవాన్ని బలహీనపరుస్తుందని ఆయన విమర్శించారు. సనాతన ధర్మానికి మద్దతునిచ్చే ఓ లాయర్ దాడికి ప్రయత్నించినప్పటికీ సీజేఐ తన స్థానం నుంచి కదలకుండా ప్రశాంతంగా ఉన్నందుకు ఠాగూర్ ప్రశంసించారు. ఈ మేరకు ఆయన సోమవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఈరోజు సుప్రీంకోర్టులో షాకింగ్ ఘటన జరిగింది. విచారణ సమయంలో సీజేఐ గవాయ్‌పై లాయర్ షూ విసిరేందుకు యత్నించారు. కోర్టులో ఆ సమయంలో గందరగోళం నెలకొన్నప్పటికీ ప్రధాన న్యాయమూర్తి ప్రశాంతంగా, గౌరవంగా కదలకుండా ఉన్నారు. అదే నిజమైన నాయకత్వం. గవాయ్ ప్రశాంతత భారతదేశ న్యాయవ్యవస్థ బలాన్ని ప్రతిబింబిస్తుంది. ద్వేషం మన సంస్థల్ని కదిలించడానికి ప్రయత్నించినప్పటికీ... దానికి వ్యతిరేకంగా అండగా నిలబడటం అంటే ఇదే' అని మాణిక్యం ఠాగూర్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను తీవ్రంగా విమర్శించారు. నిజం చెప్పాలంటే... ఇది కేవలం ఒక వ్యక్తి పిచ్చి కాదు. ఇది వంద సంవత్సరాల ఆర్‌ఎస్‌ఎస్ ద్వేషపూరిత విషం మెదడులకెక్కింది. సంస్థల పట్ల ఉన్న గౌరవాన్ని బలహీనపరుస్తోంది. దీని ఫలితమే ఈరోజు సీజేఐపై దాడికి యత్నం అని ఠాగూర్ తెలిపారు.

గిరిజన బాలికలకు రామకృష్ణ పరామర్శ

విశాలాంధ్ర-విశాఖ: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన బాలికలు పచ్చకామెర్ల బారిన పడటం దురదృష్టకరమని, ఇద్దరు పిల్లలు చనిపోవడం విచారకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలికలను సోమవారం ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు బాలికలు చనిపోయారని మంత్రి ప్రకటించ లేదని, చనిపోయిన బాలికల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలన్నారు. స్నానపు గదులు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం కారణంగా పిల్లలు అస్వస్థతకు గురైనట్లు అర్థమవుతోందని చెప్పారు. గిరిజన పిల్లలకు ఇలా జరగడం గుణపాఠంగా తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యా వ్యవస్థను గాలికి వదిలేస్తున్నారని, మెడికల్ కాలేజీలు కూడా ప్రైవేటుకు ఇస్తున్నారని విమర్శించారు. విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నదని ప్రశ్నించారు. చంద్రబాబు మైండ్ సెట్ మార్చుకోవాలని, ఇంకొన్ని సంవత్సరాలు చంద్రబాబు సీఎంగా ఉంటే ప్రభుత్వమే ప్రైవేట్ అయిపోతుందని ఎద్దేవా చేశారు. హాస్టళ్లలో సౌకర్యాలు లేకపోవడం వలనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరారు. ఆసుపత్రిలో చేరిన పిల్లల కుటుంబాలకు రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ.విమల, ఎం.పైడిరాజు, కేజీహెచ్ ఏఐటీయూసీ నాయకులు జేడీ నాయుడు, కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, ఎన్. నాగభూషణం, సీఎన్ క్షేత్రపాల్, ఆర్.శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్., ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించాం

మంత్రి రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వ హయాంలో పడకేసిన పోలవరం ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అతికొద్ది కాలంలోనే పట్టాలెక్కించిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రి నేతృత్వంలో దిల్లీలో సోమవారం కీలక సమావేశం జరిగింది. ప్రాజెక్టు పురోగతి, నిధులు విడుదల, పునరావాసంపై సమీక్షించారు. ఈ సమావేశానికి మంత్రి రామానాయుడుతో పాటు జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఇరిగేషన్ అడ్వైజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులు, ఇతర కేంద్ర ఏజెన్సీల ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడుతూ 2014- 19 మధ్య పోలవరం పనులు దాదాపు 72 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అయితే వైసీపీ హయాంలో ప్రాజెక్టును విధ్వంసం చేసి, దాని భవితవ్యాన్ని గత సీఎం ప్రశ్నార్థకంగా మార్చారని విమర్శించారు. పడకేసిన పోలవరం ప్రాజెక్టును తమ ప్రభుత్వం మళ్లీ పట్టాలెక్కించిందని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి క్షేత్రస్థాయి పర్యటన పోలవరం కావడం, దీనికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో అర్థమవుతుందని మంత్రి అన్నారు. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. నూతన డయాఫ్రమ్ వాల్ పనులు 56 శాతం పూర్తయ్యాయని, భారీ వర్షాలు పడుతున్నా పనులు ఆగలేదన్నారు. గడువులోగా పోలవరం పూర్తి చేయాలనే చిత్తశుద్ధితో పని చేస్తున్నామని చెప్పారు. 2019లో టీడీపీ గెలిచి ఉంటే 2022 నాటికే పోలవరం పూర్తయ్యేదని, అటువంటి ప్రాజెక్టును రివర్స్ టెండరింగ్ పేరిట గత ప్రభుత్వం పనులు ఆపేసిందని మంత్రి అన్నారు.

రాజస్థాన్ ఆస్పత్రిలో ఘోర అగ్నిప్రమాదం

ఐసీయూలో 8 మంది మృతి

జైపూర్: రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న సవాయ్ మాన్‌సింగ్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఘోర అగ్నిప్రమాగం జరిగింది. అత్యవసర వైద్య విభాగంలో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది రోగులు మృతిచెందారు. క్షతగాత్రుల వివరాలు వెల్లడి కాలేదు. స్టోరేజ్ ఏరియాలో మంటలు ఎగిసిన సమయంలో ఐసీయూలో 11 మంది రోగులకు చికిత్స అందిస్తున్నామని డాక్టర్ అనురాగ్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నామని పోలీసులు చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. మొదట పొగ అలుముకున్న సమయంలోనే ఆస్పత్రిని సిబ్బందిని హెచ్చరించినా వారు పట్టించుకోలేదని... రోగుల తరఫున బంధువులు చెబుతున్నారు. మరోవైపు ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ వెంటనే అక్కడికి చేరుకున్నారు. సవాయ్ మాన్‌సింగ్ ఆస్పత్రిని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం రోగుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కాగా, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించడానికి రాజస్థాన్ ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి వైద్య శాఖ కమిషనర్ ఇక్బాల్ ఖాన్ అధ్యక్షత వహించనున్నారు. ఈ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి వివరణాత్మక నివేదికను సమర్పించనుంది. కాగా, ఈ ప్రమాదంపై రోగుల తరఫు బంధువులు మీడియాతో మాట్లాడుతూ... ప్రమాద సమయంలో కొంతమంది రోగులను వారి పడకలతో సహా ఆసుపత్రి నుంచి బయటకు తీసుకు వచ్చామని తెలిపారు. ఈ దుర్ఘటనకు సంబంధించి ఆస్పత్రిలో ఉన్న రోగి తరఫున బంధువు ఇలా అన్నారు. "రాత్రి 11:20 గంటల ప్రాంతంలో పొగ వ్యాపించడం ప్రారంభమైంది. ఇది రోగులకు అసౌకర్యాన్ని కలిగిస్తుందని నేను వైద్యులకు సూచించాను. పొగ తీవ్రమయ్యే సమయానికి, వైద్యులు, కాంపౌండర్లు బయటకు పారిపోయారు. ఆ సమయంలో కేవలం ఐదుగురు రోగులను మాత్రమే బయటకు తరలించారు. ఈ ప్రమాదంలో మా అల్లుడు ప్రాణాలు కోల్పోయాడు." అని ఆవేదన వ్యక్తం చేశారు. జైపూర్ పోలీస్ కమిషనర్ బిజు జార్జ్ జోసెఫ్ మాట్లాడుతూ...దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయన్నారు. అగ్ని ప్రమాదంలో ఆరుగురు చనిపోగా, మృతదేహాలను మార్చురీకి తరలించామని, మిగిలిన రోగులను వేరే వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు అని చెప్పారు.

ప్రధాని మోదీ సంతాపం: మరోవైపు ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. రోగులు ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఏపీలో మరిన్ని పెట్టుబడులు

టాటా గ్రూప్ సహా వివిధ కంపెనీలకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీలో అనేక అవకాశాలున్నందున మరింతగా పెట్టుబడులు పెట్టాలని టాటా గ్రూపు చైర్మన్ చంద్రశేఖరన్‌కు రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ముంబైలో చంద్రశేఖరన్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో ఈ నెలలో నిర్వహించనున్న టీసీఎస్ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని చంద్రశేఖరన్‌ను ఆహ్వానించారు. టాటా పవర్ రెన్యూవబుల్స్ అధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ సదుపాయల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించాలని కోరారు. సెల్, మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ స్థాపనకు, విశాఖపట్నంలో టాటా రీజనల్ ఆఫీస్/ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, తూర్పుతీరంలో ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో సాఫ్ట్ వేర్ డిఫైండ్ వెహికిల్స్ , అటానమస్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ టెక్నాలజీస్ ఆధారిత మొబిలిటీ లేదా మెడ్‌టెక్ ఇన్నోవేషన్‌ల వంటి రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, టాటా ఆటోకాంప్ అధ్వర్యాన శ్రీసిటీలో ఎలక్ట్రిక్ వాహన భాగాలు, అధునాతన కంపోజిట్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్లు స్థాపించే అవకాశాలను అన్వేషించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకవసరమైన భూమి, ప్లగ్ అండ్ ప్లే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ప్రభుత్వం అందిస్తుందన్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ నేతృత్వాన ఆంధ్రప్రదేశ్‌లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన ఉత్పత్తి యూనిట్ స్థాపనకు, టాటా కెమికల్స్ నేతృత్వాన మచిలీపట్నం లేదా మూలపేట పోర్టులకు సమీపంలోని ఉప్పు భూముల వద్ద సోడా యాష్ ఉత్పత్తి యూనిట్ స్థాపనకు, గ్లోబల్ డేటా సెంటర్స్ ఆధ్వర్యాన విశాఖపట్నం డేటా సిటీ ప్రాంతంలో ఏఐ రెడీ డేటా సెంటర్ క్యాంపస్ స్థాపనకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి లోకేశ్ చంద్రశేఖరన్‌కు విజ్ఞప్తిచేశారు.

వివిధ కంపెనీల సీఈవోలతోనూ లోకేశ్ భేటీ

లాజిస్టిక్స్, చమురు, ఖనిజాలు, ఆహార ఉత్పత్తుల ఎగుమతుల్లో పేరెన్నికగన్న ట్రాఫిగురా ఇండియా సీఈవో సచిన్ గుప్తా, గ్లోబల్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్లాట్ ఫాం ఈఎస్‌ఆర్ గ్రూప్ ఇండియా ఇన్వెస్టిమెంట్స్ హెడ్ సాదత్ షా, డైరెక్టర్ (లీజింగ్) ప్రకృత్ మెహతా మంత్రి లోకేశ్ వేర్వేరుగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ లోని పోర్టుల సమీపంలో 3-5 పెద్ద లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేయబోతున్నాం. విశాఖపట్నం పోర్టు, కాకినాడ పోర్టు వద్ద మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు ఏర్పాటు చేయండి. దేశంలో 70శాతం రొయ్యలను ఉత్పత్తి చేస్తున్న ఏపీలో కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు పెట్టండి. ఆంధ్రప్రదేశ్ సముద్ర ఎగుమతుల కోసం కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు, గిడ్డంగుల నిర్మాణం, పోర్టు ఆధారిత లాజిస్టిక్స్ లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఈఎస్‌ఆర్ ప్రతినిధులకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం రుస్తోంజీ గ్రూప్ చైర్మన్ బొమన్ ఇరానీతో లోకేశ్ భేటీ అయ్యారు. తదుపరి హెచ్ పీ ఇన్క్ ఎండీ ఇప్సితా దాస్ గుప్తాతో సమావేశమై ఏపీలో 3డీప్రింటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేయాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. బ్లూస్టార్ చైర్మన్ విర్ అద్వానీతో భేటీ సందర్భంగా తిరుపతి శ్రీసిటీలో విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బ్లూస్టార్ రూ.900కోట్లతో చేపట్టిన విస్తరణ ప్రణాళిక 2026 నాటికే పూర్తిసామర్థ్యంతో పనిచేసేలా పనులను వేగవంతం చేయాలని కోరారు. రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజాతో జరిగిన సమావేశంలో అమరావతి రాజధానికి సేవలందించే విధంగా 5 స్టార్ బిజినెస్ హోటల్స్‌ను అమరావతిలో ఏర్పాటుచేయాలని, విశాఖపట్నంలో వ్యాపార, వినోద విభాగాలను లక్ష్యంగా బీచ్ రిసార్ట్ ప్రాపర్టీ రిటైల్ అండ్ మాల్ నెట్‌వర్క్ ఏర్పాటుపై, అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రీమియం అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని మంత్రి లోకేశ్ కోరారు.

ఉద్యోగులకు అన్యాయం: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'చంద్రబాబు గారూ... ఎన్నికలకు ముందు మీరు ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీలు ఏమిటి? ఇప్పుడు మీరు చేస్తున్నదేమిటి? తీపితీపి మాటలతో అరచేతిలో వారికి వైకుంఠం చూపి, తీరా ఇప్పుడు వారిని మోసం చేస్తారా? నడిరోడ్డుమీద నిలబెడతారా? ఇందుకేనా మీరు అధికారంలోకి వచ్చింది?' అని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. 'మంత్రివర్గ సమావేశం జరిగిన ప్రతిసారీ ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలు గురించి, వారికి చెల్లించాల్సిన బకాయిల గురించి మీ నుంచి ప్రకటన వస్తుందని వాళ్లు ఆశగా ఎదురుచూడడం, చివరకు ఉసూరు మనిపించడం మీకు అలవాటుగా మారింది. మంత్రివర్గ సమావేశాల్లో మీ శ్రద్ధ అంతా భూ పందేరంమీద తప్ప, ప్రజలమీద, ఉద్యోగస్తుల మీద కాదు. అప్పుడయినా, ఇప్పుడయినా, ఎప్పుడయినా ప్రజలు, ఉద్యోగుల మీద మీకున్నది కపట ప్రేమే. వారిని నమ్మించి వెన్నుపోటు పొడవటం, మీకు అలవాటే. మీరుపెట్టే బాధలు భరించలేక ఇప్పుడు వారంతా రోడ్డు మీదకు వస్తున్నారు' అని సోమవారం 'ఎక్స్' వేదికగా చంద్రబాబు తీరుపై జగన్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ అన్నారని, మరి ఇచ్చారా?, మెరుగైన పీఆర్సీ అంటూ ఊదరగొట్టారనీ, మరి దాని సంగతేమిటని నిలదీశారు. ఉద్యోగస్తులకు ఇచ్చే అలవెన్స్ పేమెంట్స్‌ను పెంచుతామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఇప్పుడు దాని గురించి ప్రస్తావించడం లేదని, ఇప్పటిదాకా ఇవ్వాల్సిన 4 డీఏలు మొత్తం పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. దసరా పండుగకు డీఏలు క్లియర్ అవుతాయని ఉద్యోగస్తులందరూ ఎంతో ఎదురుచూశారని, ఇప్పుడు దీపావళి పండుగ వస్తుందని, ఇప్పుడయినా ఇస్తారా? అని నిలదీశారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింప చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికీ దానిని అమలు చేయడం లేదని అన్నారు. వారికిచ్చిన హామీలన్నీ మోసాలుగా మారిపోయాయని, అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డెక్కుతూ మిమ్మల్ని ఎండగడుతున్నారని ధ్వజమెత్తారు.

అమరావతిలో ఏడీబీ బృందం

విశాలాంధ్ర - సచివాలయం: రాజధాని అమరావతిలో ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) బృందం సోమవారం పర్యటించింది. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను ప్రత్యక్షంగా వీక్షించింది. సీఆర్డీఏ అధికారులు... పర్యావరణ, సామాజిక రక్షణకు, కార్మికుల ఆరోగ్య భద్రతకు అనుసరిస్తున్న ప్రమాణాలను వివరించారు. అనంతరం విజయవాడ కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబు, అడిషనల్ కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, అమిలినేని భార్గవ తేజ్‌తో బ్యాంకు ప్రతినిధులు భేటీ అయ్యారు. మందడంలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో అధికారులను ఏడీబీ బ్యాంక్ ప్రతినిధులు కలిశారు.

వాణిజ్య రంగంలో 'శివాలిక్' నౌక కీలకపాత్ర: కేంద్ర మంత్రి సోనోవాల్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: దేశపు తొలి వెరీ లార్జ్ గ్యాస్ క్యారియర్ (వీఎల్‌జీసీ) నౌక 'శివాలిక్' కు కేంద్ర పోర్టులు, నౌకాయాన, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ విశాఖపట్నం పోర్టులో ఘన స్వాగతం తెలిపారు. శివాలిక్ నౌక భారత జెండా కింద షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ సెప్టెంబర్ 10, 2025న నమోదు చేసింది. ఈ నౌక భారత సముద్ర, ఇంధన రవాణా రంగంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సోనోవాల్.. నౌక విజయవంతంగా తన తొలి ఎల్పీజీ సరుకు నిర్వహణ పూర్తి చేయడంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అందించిన సహకారాన్ని అభినందించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ... 'శివాలిక్ నౌక భారత జెండా కింద నడుస్తుండడం భారత సముద్ర యాన చరిత్రలో గర్వ కారణమని అన్నారు. ఇది ఆత్మనిర్భర్ భారత్, మారిటైమ్ ఇండియా విజన్-2030 లక్ష్యాలకు అనుగుణంగా ఉందని, భారత నౌకాశ్రయ రంగం ప్రపంచ వ్యాప్తంగా పోటీ సాధించే దిశగా సాగుతోందని తెలిపారు. ఈ నౌక తొలి ప్రయాణంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) ని తీసుకువచ్చిందన్నారు. 2030 నాటికి ప్రపంచంలోని షిప్ బిల్డింగ్ దేశాలలో భారత్ టాప్ 10లో ఒకటిగా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మారిటైం అభివృద్ధికి ఏటా రూ.6 లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నామని, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా 112 నౌకల తయారీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెలలో నాలుగు షిప్‌లకు టెండర్ ప్రక్రియ నిర్వహిస్తామని సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లో దుగ్గిరాజపట్నం వద్ద నౌక నిర్మాణ కేంద్రానికి డీపీఆర్ పూర్తయిందని, కేంద్రం పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. భారతదేశ విదేశీ వాణిజ్యంలో 70 శాతం సముద్ర మార్గాల ద్వారా రవాణా జరుగుతుందని, భారతీయ వస్తువులపై 25 శాతం అదనపు సుంకం విధించాలనే అమెరికా చర్య అన్యాయమని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. విశాఖపట్నం పార్లమెంటు సభ్యుడు శ్రీభరత్ మాట్లాడుతూ ఈ తరహా ఆధునిక కార్యక్రమాల ద్వారా త్వరలో ప్రతి ఇంటికీ గ్యాస్ సరఫరా సాధ్యమవుతుందని అన్నారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్మన్ డా.ఎం.అంగముత్తు మాట్లాడుతూ ఎస్సీఐ తీసుకున్న ఈ పురోగమన చర్యను అభినందిస్తూ, పోర్ట్ అథారిటీ ఎల్లప్పుడూ అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి విశాఖపట్నాన్ని తూర్పు తీరంలోని ప్రముఖ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సోనోవాల్ 'శివాలిక్' అధికారులతో, సిబ్బందితో సమావేశమై వారి సేవలను ప్రశంసించారు. దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చడానికి విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చేపడుతున్న ఆధునీకరణ చర్యలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస యాదవ్, నౌకాశ్రయ, నౌకాయాన, జలరవాణా మంత్రిత్వ శాఖ, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మోదీ పర్యటనపై నిరసనలు: బీవీ రాఘవులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రం తీసుకొచ్చిన కొత్త జీఎస్టీతో రూ.90 వేల కోట్ల నష్టం వస్తుందని, దీనిలో 70 శాతం రాష్ట్రాలే భరించాలని, దీనిపై వస్తున్న వ్యతిరేకతను చల్లబరిచేందుకు ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తున్నారని, ఆయన పర్యటనలపై నిరసనలు తెలుపుతామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ... ఈ నెల 16న ప్రధాని శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సీఎం చంద్రబాబు ప్రధానిని అభ్యర్థించాలని కోరారు. కొత్తగా తీసుకొచ్చిన జీఎస్టీపై ప్రజాధనాన్ని వినియోగించి ప్రభుత్వ అధికారులతో ప్రచారం చేయిస్తున్నారని అన్నారు. జీఎస్టీ వల్ల అన్ని రాష్ట్రాలూ తీవ్రంగా నష్టపోతున్నాయని చెప్పారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రధాని రాక సందర్భంగా అన్ని వామపక్ష పార్టీలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.